ఈనాడు
హైదరాబాద్
HMDA
సోమవారం ఆగస్టు 31, 2026



కీసరలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, కుటుంబ సభ్యులు



సికింద్రాబాద్‌లోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ డాక్టర్ ప్రియాంక

నీట్ పీజీ ప్రశాంతం

ఈనాడు, హైదరాబాద్: ఆదివారం నీట్ పీజీ ప్రశాంతంగా ముగిసింది. హైదరాబాద్ జిల్లాలో 97.47 శాతం, రంగారెడ్డి- 97.26శాతం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోనూ 97.25శాతానికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక సికింద్రాబాద్‌లోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. మేడ్చల్ జిల్లాలోని ఉప్పల్, మేడిపల్లి మండలాల్లోని కేంద్రాలను అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిగూడలో మద్యం తాగి కేంద్రానికి వచ్చిన విద్యార్థిని అనుమతించలేదు.

తీపి కబురెప్పుడో!

• రేషన్ చక్కెర.. పంపిణీకి దూరం

ఈనాడు, హైదరాబాద్: పౌరసరఫరాల శాఖ బియ్యం మినహా ఇతర నిత్యావసర సరకుల పంపిణీపై ఉదాసీనత చూపుతోంది. గ్రేటర్ పరిధిలో లక్షల మంది కార్డుదారులు చక్కెర పంపిణీకి ఎదురుచూస్తున్నారు. మార్చి నెల నుంచి చక్కెర సహా ఏ ఇతర నిత్యావసర సరకులను రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయడంలేదు. గతంలో పంచదారను సబ్సిడీపై కిలో రూ.13.50కు అందించేవారు. తాజాగా మార్కెట్‌లో ధరలు భారీగా పెరగడంతో కార్డుదారులు రేషన్ చక్కెర కోసం వాకబు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధర నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది. పేదలకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నా చక్కెర కోటా విడుదల కావడంలేదని డీలర్లు చెబుతున్నారు. గ్రేటర్ పరిధిలో గతంలో నెలకు 50 టన్నుల చక్కెరను సబ్సిడీ ద్వారా అందజేసేవారు. బియ్యంతో పాటు కొన్ని సందర్భాల్లో పప్పులు, గోధుమలు, చక్కెర వంటి సరకులు అందేవి. నిత్యావసర సరకులను మార్కెట్‌లో కొనాల్సివస్తోంది. ఇటీవల చక్కెర ధర రూ.60 దాటింది.

చెత్త కొండలకు భూసేకరణం

ఈనాడు, హైదరాబాద్

రాజధాని నగరం రోజురోజుకు విస్తరిస్తోంది. నగర శివారులోని కార్పొరేషన్లు, పురపాలక సంఘాలను విలీనం చేసిన ప్రభుత్వం ట్రై కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది. పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన ఈ మూడు కార్పొరేషన్లకు చెత్త నిలువ కేంద్రాల ఏర్పాటు సవాల్‌గా మారింది. చెత్త సేకరణ, రీసైక్లింగ్, వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ సమస్యగా మారింది. నగరం నుంచి వెలువడుతున్న చెత్త కొండల్లా పేరుకుపోతోంది. ప్రస్తుతం జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఒక్కటే ఉంది. ఇక్కడ ఒక వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంటు ఏర్పాటు అయ్యింది. రెండు విద్యుదుత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. ఇవి 24 మెగావాట్ల సామర్థ్యంతో పనిచేయాల్సి ఉంది. రోజుకు 1500 టన్నుల చెత్తను మండించడం ద్వారా చెత్త నుంచి ఇంధనం (విద్యుత్తు) వస్తుంది. దుండిగల్ ప్రాంతంలో 15 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంటు ఉంది. ఇక్కడ 500 టన్నుల వరకు మండిస్తారు. ఇది మినహా నగరంలో ఎలాంటి నిలువ కేంద్రాలు లేవు.

మహా నగర విస్తీర్ణం
2000 చదరపు కిలోమీటర్లు
ప్రస్తుత జనాభా
1.23కోట్లు
రోజూ వెలువడుతున్న చెత్త
9,500టన్నులు
డంపింగ్ యార్డు
జవహర్‌నగర్ విస్తీర్ణం 390ఎకరాలు
ప్రతిపాదిత ప్రాంతాలు
పారానగర్ (సంగారెడ్డి జిల్లా), విస్తీర్ణం: 150ఎకరాలు
లక్డారం (సంగారెడ్డి జిల్లా) 150 ఎకరాలు
సిద్ధాపూర్ (కొత్తూరు సమీపంలో) 86 ఎకరాలు



జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో చెత్తకొండ

• శివారు ప్రాంతాల్లో వ్యతిరేకిస్తున్న గ్రామస్థులు
• నిండిపోయిన జవహర్‌నగర్ డంపింగ్ యార్డు

దశాబ్దాలుగా ఒక్కటే..

నగరంలో గతంలో రెండు ప్రాంతాలు గంధంగూడ, సరూర్‌నగర్‌లలో డంపింగ్ యార్డులు ఉండేవి. ఇవి పూర్తిగా నిండిపోవడంతో 2004లో జవహర్‌నగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. 390 ఎకరాల్లో చేసిన ఈప్రాంతం రెండు దశాబ్దాల్లోనే పూర్తిగా నిండిపోయింది. మొత్తం గుట్టలుగా తయారైంది. ఇక్కడ ఎప్పటికప్పుడు గుట్టలను క్యాపింగ్ చేస్తూ.. మొక్కలు పెంచాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో క్యాపింగ్ చేశారు. ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో నగర చెత్తను నిలువ చేయడంతో ఈ ప్రాంతంలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కలుషిత జలం, ఘాటైన వాసనలతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యార్డులో దాదాపు 1.50 లక్షల టన్నులు పేరుకుపోయింది. చెత్త నుంచి దుర్గంధం వెదజల్లుతోంది.

అక్కడ వ్యతిరేకత ఎందుకంటే..

• సిద్ధాపూర్ పరిసరాల్లో ఇప్పటికే కోళ్లఫారాలు ఉన్నాయి. వీటి వ్యర్థాలతో ఈగలు ముసురుతున్నాయని తండావాసులు ఆందోళన చెందుతున్నారు. అక్కడ పోరాట కమిటీ ఏర్పాటై డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఇక్కడ ఒక విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు కావాల్సి ఉంది.

• పారానగర్‌లోనూ భూకేటాయింపులు పూర్తయినా నిర్మాణ పనులను అడ్డుకున్నారు. అక్కడ ఇదే పరిస్థితి నెలకొంది. లక్డారంలోనూ నిరసన వ్యక్తమవుతోంది. • ప్రధానంగా భూముల విలువలు తగ్గిపోయి.. స్థిరాస్తి పడిపోతుందనే కారణం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. ఎవరైనా చెత్తను తమ ఇంట్లో పోసుకుంటారా.. అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నేటితో ముగియనున్న ఇందిరమ్మ ఇండ్ల లాటరీ

మూడో రోజు కొనసాగిన డ్రా ప్రక్రియ

ఈనాడు, హైదరాబాద్: క్యూర్ పరిధిలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సోమవారంతో ముగియనుంది. వరుసగా మూడో రోజు కొనసాగిన లాటరీలో ఆదివారం నాలుగు నియోజకవర్గాలకు లబ్ధిదారులను డ్రా ద్వారా ఎంపిక చేశారు. శేరిలింగంపల్లి, మేడ్చల్, మలక్‌పేట, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో తొలి దశలో నిర్మించనున్న 1,920 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. క్యూర్ పరిధిలో పైలట్ ప్రాజెక్టు కింద 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నట్లు ప్రకటించి దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఇందులో 12 నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక ఇప్పటికే పూర్తయ్యింది.

లాటరీ నిర్వహించే నియోజకవర్గం- వేదికలు

• సనత్‌నగర్- హెవన్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్
• మహేశ్వరం- బడంగ్‌పేట ప్రజాభవన్
• మల్కాజిగిరి- అల్వాల్ వీబీఆర్ గార్డెన్స్
• కార్వాన్- కుల్సుంపుర ప్రాజెక్టు

శివారులో 'త్రీఫేజ్'కు ఎదురుచూపులు

ఈనాడు, హైదరాబాద్: శివార్లలో త్రీఫేజ్ కరెంట్ లైన్లు లేకపోవడంతో వినియోగదారులు ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఒకప్పుడు వెలిసిన కాలనీల్లో సైతం చాలావరకు సింగిల్ ఫేజ్ లైన్లు ఉన్నాయి. సిటీ విస్తరణతో ఈ కాలనీలు జనావాసాలతో నిండిపోయాయి. వినియోగదారుల కనెక్షన్లకు తగ్గట్టుగా ఎప్పటికప్పుడు నెట్‌వర్క్‌ను బలోపేతం చేయాల్సిన క్షేత్రస్థాయి అధికారులు.. శివారుప్రాంతాలపై ఒకింత నాన్చుడు ధోరణిని అవలంబిస్తున్నారు. బడ్జెట్ పేరుతో కాలయాపన చేస్తున్నారు. వినియోగదారులు గట్టిగా నిలదీస్తే అందుకయ్యే ఖర్చు వినియోగదారులదే అంటూ దబాయిస్తున్నారు.



వినియోగం పెరగడంతో..: నేటి ఆధునిక ఇళ్లలో ఏసీలు, ఇండక్షన్ స్టవ్‌లు, గీజర్లు, ఈవీ ఛార్జర్ల వాడకంతో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. సింగిల్ ఫేజ్‌తో ఇంట్లో వైరింగ్ వేడెక్కి కాలిపోతున్నాయి. శివార్లలో సైతం ప్రతి ఇంట్లో రెండు ఏసీలు సాధారణంగా మారాయి. ఇటీవల ఈవీలు వచ్చాయి. ఈ లోడ్‌ను తట్టుకోవాలంటే త్రీఫేజ్ కరెంట్ తప్పనిసరి. లోడ్‌కు తగ్గట్టుగా కొత్త ఉపకేంద్రాల నిర్మాణం, కొత్త ఫీడర్లు ఏర్పాటు చేస్తున్న డిస్కం.. త్రీఫేజ్ కరెంట్ లేని కాలనీలపై కూడా దృష్టి పెట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

సమస్య ఎక్కడంటే? : సరూర్‌నగర్, రాజేంద్రనగర్, హబ్సిగూడ, మేడ్చల్, సైబర్‌సిటీ విద్యుత్తు సర్కిళ్ల పరిధిలో వినియోగదారులు త్రీఫేజ్ లైన్ల కోసం ఎదురుచూస్తున్నారు. నాదర్‌గుల్ వాసులు త్రీఫేజ్ కరెంట్ కోసం సబ్‌స్టేషన్ ఎదుట ఇటీవల నిరసనకు దిగారు.





దేశంలోనే రెండో అతిపెద్దదైన ఎన్ఎండీసీ మారథాన్ నగరంలో ఆదివారం సందడిగా జరిగింది. ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్, 10కే, 5కే విభాగాల్లో సుమారు 32 వేల మంది పాల్గొన్నారు.

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్



ఇక చిటికెలో మూసీ దాటొచ్చు

అంబర్‌పేట-మూసారాంబాగ్ పైవంతెన రెడీ

పైవంతెన నిర్మాణ వ్యయం రూ.52 కోట్లు
పొడవు 400 మీటర్లు
వెడల్పు 14.5 మీటర్లు
ఎత్తు 480 మీటర్లు (సముద్ర మట్టానికి)
పిల్లర్లు 6
స్లాబులు 5

న్యూస్‌టుడే, అంబర్‌పేట

నగరవాసులు చాలాకాలంగా ఎదురుచూస్తున్న అంబర్‌పేట-మూసారాంబాగ్ మూసీనది పై వంతెనను సోమవారం సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అనంతరం అంబర్‌పేట మున్సిపల్(ఎంసీహెచ్) మైదానంలో సీఎం బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. అనేక అడ్డంకులను అధిగమించి ఎట్టకేలకు పనులు పూర్తి చేశారు. ఇది అందుబాటులోకి వస్తే చాదర్‌ఘాట్ వంతెనపై ట్రాఫిక్ భారం తగ్గి ఆ మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయి.

మూడేళ్ల సమయం

మూసీకి ఇరువైపులా ఇటు అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా, అటు మూసారాంబాగ్ వైపు బ్రిడ్జి నిర్మాణానికి వీలుగా కట్టడాలను తొలగించి రహదారిని విస్తరించాల్సి వచ్చింది. విస్తరణకు ప్రజలు ముందుకు రాకపోవడం, పరిహారం చెల్లింపు తదితర అంశాల కారణంగా పనుల్లో జాప్యం కారణంగా మూడేళ్ల సమయం పట్టింది.

గుట్టుగా.. గమ్మత్తుగా

"వారంరోజుల క్రితం జగద్గిరిగుట్ట పరిధిలో విద్యార్థులు, యువత లక్ష్యంగా గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ముఠాను పట్టుకున్నారు."

"తాజాగా శామీర్‌పేట ఠాణా పరిధిలో ఏకంగా 24 కిలోల బరువున్న 5,298 గంజాయి చాక్లెట్లను పోలీసులు స్వాధీనంచేసుకున్నారు."



• పాన్‌షాపుల్లో గంజాయి చాక్లెట్ల విక్రయం
• ఆకర్షితులవుతున్న విద్యార్థులు, యువత

ఈనాడు, హైదరాబాద్

రాజధానిలో కొన్నేళ్లుగా డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగం పెరుగుతోంది. పోలీసుల నిఘాతో స్మగ్లర్లు కొత్త మార్గాల్లో విక్రయిస్తున్నారు. తనిఖీల భయంతో మత్తు పదార్థాలను నేరుగా కాకుండా గంజాయిని చాక్లెట్ రూపంలోకి మార్చి ఆకర్షణీయ ప్యాకింగ్‌తో అమ్ముతున్నారు. ఈ కొత్త తరహా మత్తు పదార్థానికి యువత, విద్యార్థులు త్వరగా ఆకర్షితులవుతున్నారు. కొన్నిరోజులుగా గంజాయి చాక్లెట్లు వరుసగా పట్టుబడుతుండడమే అందుకు నిదర్శనం.

పాన్‌షాపులు కేంద్రంగా..

మత్తు పదార్థాల వినియోగం పెరుగుతుండడంతో తెలంగాణ ఈగల్, ఎస్‌వోటీ, హెచ్‌న్యూ, టాస్క్‌ఫోర్స్ విభాగాలు నిఘా పెంచాయి. వరుస తనిఖీలతో నిందితుల్ని అరెస్టు చేస్తున్నాయి. దీంతో స్మగ్లర్లు తనిఖీలకు చిక్కకుండా గంజాయి చాక్లెట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. శివారుప్రాంతాలు, ఇతర రాష్ట్రాల ప్రజలు, వలస కూలీలు అధికంగా ఉండే ప్రాంతాల్లోని పాన్‌షాపులు, టీస్టాల్స్ కేంద్రంగా విక్రయిస్తున్నారు. చాక్లెట్ల రూపంలో ఉండడం, తేలిగ్గా తీసుకోవడానికి వీలుగా ఉండడంతో యువత, విద్యార్థులు వినియోగదారులుగా మారుతున్నారు. ప్యాకింగ్ చిరుతిళ్ల తరహాలో ఉండడంతో తేలిగ్గా గుర్తించలేరు. పరిచయస్థులు, రోజువారీ వినియోగదారులకే విక్రయిస్తుండడంతో పట్టుకోవడం సంక్లిష్టంగా మారుతోంది. కొంతకాలం కిందట షాద్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల సమీపంలోని పాన్‌డబ్బాలో గంజాయి చాక్లెట్ల విక్రయం కలకలం రేపింది. బడి పక్కనే ఉండడంతో చిన్నారులు చాక్లెట్లు తిని తరగతికి హాజరయ్యారు. విద్యార్థులు మత్తుగా కనిపించడంతో ఉపాధ్యాయులు గుర్తించారు. నిందితుడు కొన్నినెలలుగా పిల్లలకు విక్రయించినా ఎవరూ కనిపెట్టలేకపోయారు.

అదో పెద్ద పరిశ్రమ


ఇతర రాష్ట్రాల వలస కూలీలు ఏజెంట్లుగా.. గంజాయి చాక్లెట్ల రవాణా, విక్రయం గుట్టుగా జరుగుతోంది. ముఖ్యంగా బిహార్, యూపీ, ఝార్ఖండ్ నుంచి ఎక్కువగా వస్తున్నట్లు దర్యాప్తులో బయటపడుతోంది. అక్కడ మారుమూల ప్రాంతాల్లోని మూతపడ్డ పరిశ్రమలు, ఇళ్లే కేంద్రంగా వీటిని తయారుచేస్తున్నారు. గంజాయిని పిప్పిగా మార్చి ద్రవరూపంలోని చాక్లెట్‌తో కలుపుతున్నారు. అవి గట్టి పడ్డాక చాక్లెట్ తరహాలో ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేస్తున్నారు. చాక్లెట్ తీసుకున్నాక జీర్ణం అయ్యేందుకు 2-3గంటల సమయం పడుతుంది.

చైతన్య పథం.. మహమ్మారి అంతం

ఎంఎన్‌జేకు త్వరలో మరో మొబైల్ ల్యాబ్

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రి అయిన ఎంఎన్‌జే ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో మరింత పకడ్బందీగా పరీక్షల కార్యక్రమం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా అదనంగా మరో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనం అందుబాటులోకి రానుంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఓ సంస్థ ఈ వాహనాన్ని సమకూర్చేందుకు ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఒక మొబైల్ వాహనం ఉన్నప్పటికీ ఎటూ సరిపోవడం లేదు. రెండు వాహనాలతో ఒకటి సుదూర ప్రాంతాలకు మరొకటి నగరం చుట్టూ ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మహిళల్లో ఏటా రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి క్యాన్సర్లు పెరుగుతున్నాయి.







రాయి పగిలింది.. శ్రమ మెరిసింది

గండిపేట - శంకర్‌పల్లి ప్రధాన మార్గంలో కోకాపేట నియోపొలిస్ వెళ్లే రోడ్డు మలుపు వద్ద భారీ రాళ్లను పగులగొడుతూ.. ఎత్తుతున్న కార్మికుల శ్రమైక సౌందర్యం ఉట్టిపడేలా కళాకృతులు ఏర్పాటు చేశారు. చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. – ఈనాడు, హైదరాబాద్

ఎస్టీపీలపై అధ్యయనానికి దక్షిణ కొరియాకు బృందం

ఈనాడు, హైదరాబాద్: మూసీ ప్రక్షాళన, పునరుజ్జీవంలో భాగంగా అత్యాధునిక మురుగు నీటి శుద్ధి ప్రాజెక్ట్(ఎస్టీపీ)లపై అధ్యయనం చేసేందుకు జలమండలి, మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎంఆర్‌డీసీఎల్) అధికారుల బృందం ఆదివారం దక్షిణ కొరియాకు వెళ్లింది. జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి నేతృత్వంలోని సీనియర్ ఇంజినీర్ల బృందం వారం రోజుల పాటు సియోల్ సహా ఇతర నగరాలను సందర్శించి ఎస్టీపీల పనితీరుపై అధ్యయనం చేయనుంది. మూసీ ప్రక్షాళనలో భాగంగా కొత్తగా చేపట్టే ఎస్టీపీలను భూగర్భంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో వీటిని అధ్యయనం చేయనున్నారు. ఈ బృందంలో ఎంఆర్‌డీసీఎల్ టెక్నికల్ కన్సల్టెంట్ సత్యనారాయణ, ఎస్ఈ విద్యాసాగర్, వాటర్‌బోర్డు సీజీఎం పద్మజ సహా ఇతర ఇంజినీర్లు ఉన్నారు.

క్లబ్ సభ్యులు సమాజాభివృద్ధికి పాటుపడాలి


ఓటు వేయడానికి వచ్చిన క్లబ్ సభ్యులు

మారేడుపల్లి: వెస్ట్ మారేడుపల్లిలోని న్యూ క్లబ్ అండ్ ఫ్యామిలీ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు సమాజాభివృద్ధి, సంక్షేమానికి పాటుపడాలని తద్వారా తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల దిశగా ప్రోత్స హించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. క్లబ్‌లో ఆదివారం ఎన్నికలు జరిగాయి. క్లబ్ అధ్యక్షులు, ఈసీ మెంబర్ల ఎన్నిక కోసం వీటిని ప్రతి రెండేళ్లకోసారి నిర్వహిస్తారు. ఇందులో మారేడుపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన సభ్యులు 2000 మందికిపైగా ఉన్నారు. సాయంత్రం ఎమ్మెల్యే శ్రీగణేశ్, సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 1190 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో నోముల ప్రకాశ్‌రావు విజయం సాధించారు. ఆయన సమీప ప్రత్యర్థిపై 128 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. ఈసీ కమిటీ మెంబర్లుగా నరేశ్‌రాజ్, దుబ్బాక సాయికిరణ్, జి.వినయ్‌కుమార్ ఎన్నికయ్యారు.

సికింద్రాబాద్

• సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

బస్ షెల్టర్ లేక ప్రయాణికుల తిప్పలు



వర్షం కురిసినప్పుడు తల దాచుకునేందుకు బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నగరంలో కీలకమైన అమీర్‌పేటలో బస్సులు నిలిపే చోట బస్ షెల్టర్ లేదు. ఆదివారం ఇలా వర్షంలో తడుస్తూ బస్సుల కోసం నిరీక్షించారు. కొందరు ప్రయాణికులు పక్కనే ఉన్న వస్త్ర దుకాణం వద్ద తలదాచుకున్నారు. వేసవిలో సైతం ఎండల తీవ్రతకు ఇబ్బంది పడుతున్నామని నిత్యం విధులకు వెళ్లేవారు, ఇతర ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఇక్కడ వెంటనే బస్ షెల్టర్ నిర్మించాలని కోరారు. -ఈనాడు, హైదరాబాద్

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.ఒంటిగంట మధ్య

సికింద్రాబాద్: 8008573368, కంటోన్మెంట్: 8008573361, సనత్‌నగర్: 8008573356, లాలాపేట, సంజీవరెడ్డినగర్: 8008573358, అడ్డగుట్ట, మారేడుపల్లి: 8008573365, కార్ఖానా: 8008902816, బన్సీలాల్‌పేట: 8008552571, రెజిమెంటల్‌బజార్: 8008573363, ఓయూ: 8008902818

కంటోన్మెంట్, కార్ఖానా, న్యూస్‌టుడే:

? తాడుబంద్‌లోని టెంపుల్ రాక్ ఎన్‌క్లేవ్‌లో రహదారులు గుంతలమయంగా మారాయి. **- శ్రీనివాస్, టెంపుల్ రాక్ ఎన్‌క్లేవ్**

✓ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- ఉమాశంకర్, బోర్డు చీఫ్ ఇంజినీర్**

? బాపూజీనగర్ రోడ్డు గుంతలతో ప్రమాదకరంగా మారింది. **- ప్రేమ్, బాపూజీనగర్**

✓ మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరిస్తాం. **- ఫణికుమార్, కంటోన్మెంట్ ఇంజినీర్**

ఆ ఒక్కటీ అడగొద్దు..

నిర్వహణ కరవై శౌచాలయాల మూసివేత

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ నియోజకవర్గంలో తగినన్ని శౌచాలయాలు లేకపోవడంతో పాదచారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. జీహెచ్ఎంసీ కొన్ని ప్రాంతాల్లో ఆధునిక మరుగుదొడ్లను ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణ చూసేవారు లేక మూతపడ్డాయి. వారాసిగూడ కూడలి వద్ద ఉదయం సాయంత్రం వేళల్లో వందలాది మంది వివిధ అవసరాల కోసం వస్తారు. కూలీలు పెద్దసంఖ్యలో నిరీక్షిస్తుంటారు. వీరి కోసం మూత్రశాలలు ఏర్పాటు చేయాలంటూ స్థానిక నేతలు జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. ఇటీవల ఆందోళన సైతం చేపట్టారు.

మొదటి నుంచీ నిర్లక్ష్యమే.. గతంలో జీహెచ్ఎంసీ అధికారులు వంద రోజుల అభివృద్ధి పేరుతో కొన్ని పనులను గుర్తించి వాటిని పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు. అందులో భాగంగా సికింద్రాబాద్ పరిధిలో పాతిక ఆధునిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సికింద్రాబాద్‌లోని చిలకలగూడ రైల్వే క్వార్టర్స్, సీతాఫల్‌మండి నుంచి ఓయూ వెళ్లే దారిలో, వారాసిగూడకు వెళ్లే దారిలో కమ్యూనిటీ హాలు సమీపంలో ఏర్పాటు చేశారు. నిర్వహణ కోసం కొందరిని ఏర్పాటు చేసి, వారికి డ్రెస్‌కోడ్ కూడా ఇచ్చారు. వారు వెళ్లిపోవడంతో ఆ మరుగుదొడ్లను మూసివేశారు.

● ఇప్పుడు చిలకలగూడ మున్సిపల్ మైదానం వద్ద సులభ్ కాంప్లెక్స్ ఒక్కటే దిక్కైంది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు మేల్కొని మూతపడిన శౌచాలయాలను తిరిగి అందుబాటులోకి తేవాలని పాదచారులు, ప్రయాణికులు కోరుతున్నారు.


చిలకలగూడలో తలుపులు లేకుండా..

ఇదీ పరిస్థితి..

● సికింద్రాబాద్ నుంచి చిలకలగూడ, నామాలగుండు, వారాసిగూడ, బౌద్ధనగర్ ప్రాంతాలు రెండు కిలోమీటర్లమేర విస్తరించి ఉంటుంది. ఒక్క చిలకలగూడలో సులభ్ కాంప్లెక్స్ మినహాయిస్తే ఎక్కడా మూత్రశాలలు లేవు.

● సీతాఫల్‌మండి ప్రాంతంలో రెండింటిని ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ లేకపోవడంతో మూసివేశారు. ● సీతాఫల్‌మండి సురేష్ థియేటర్, ఓయూకు వెళ్లే దారిలో ఇఫ్లూ సమీపంలో ప్యాబ్రికేటెడ్ తరహాలో ఏర్పాటు చేసినా నెల రోజుల కూడా ఉపయోగంలో లేదు. చిలకలగూడ రైల్వే క్వార్టర్స్ వద్ద కొత్తగా నిర్మించినప్పటికీ కొన్నాళ్లుగా తాళం వేసి ఉంచారు. సర్కిల్ పరిధిలో ఉన్నవి శుభ్రత లేక మూతపడ్డాయి.

మౌలిక వసతుల కల్పనకు కృషి


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్ తదితరులు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ప్రజలకు మౌలిక వసతులను కల్పించడం తన ప్రధాన బాధ్యత అని, తాగునీటి సమస్యను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. న్యూబోయిన్‌పల్లిలోని ఇక్రిశాట్, జూపిటర్ కాలనీలు, బీహెచ్ఈఎల్, మధుపాలా, అరిహంత్ ఎన్‌క్లేవ్‌లు, ఇతర ప్రాంతాల్లో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.45 లక్షలతో చేపట్టనున్న పైపులైన్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద, మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, ముప్పిడి మధుకర్, వనం రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెటరన్ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలి

కార్ఖానా, న్యూస్‌టుడే: యువకులు వెటరన్ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ పేర్కొన్నారు. మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో ఆదివారం క్రీడా పోటీలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీ గణేశ్ ఆయా క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఛైర్మన్ జంపన ప్రతాప్‌తో కలిసి పతకాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోటీల్లో 95 ఏళ్ల వయసు గల అథ్లెటిక్స్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొనడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్, వివిధ కేటగిరీల్లో జరిగిన పరుగు పోటీల్లో వెటరన్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అసోసియేషన్ నేతలు మర్రి లక్ష్మణ్ రెడ్డి, ప్రభుకుమార్ గౌడ్, దేవేందర్‌రెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాను చనిపోతూ.. ముగ్గురికి జీవం పోస్తూ



సంజీవరెడ్డినగర్: ఎస్సార్‌నగర్‌లోని బాపూనగర్ బంజారా బస్తీకి చెందిన **అజ్మీరా అనిల్‌కుమార్** (46) తాను చనిపోతూ ముగ్గురికి జీవం పోశారు. ఆయన సెక్యూరిటీ గార్డుగా ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో పక్షవాతం బారిన పడ్డారు. కుటుంబసభ్యులు ఈఎస్ఐ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆదివారం ఉదయం అనిల్‌కుమార్ చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాపూనగర్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిసింగ్ జాదవ్, అజయ్‌సింగ్ తదితరులు కుటుంబ సభ్యులను ఒప్పించారు. దీంతో నిమ్స్ జీవన్‌దాన్ విభాగం నుంచి వచ్చిన ప్రతినిధులు, వైద్యులు లివర్, రెండు కిడ్నీలను సేకరించారు.



కూలిన గోడ.. రెండు ఆటోలు ధ్వంసం

కార్ఖానా, న్యూస్‌టుడే: నిత్యం కురుస్తున్న వర్షాలకు కంటోన్మెంట్ బాలంరాయిలోని ఓ పురాతన గోడ ఆదివారం కూలిపోయింది. ఈ ఘటనలో ప్యాసింజర్ ఆటో, ట్రాలీ ధ్వంసమయ్యాయి. మరో కారు సైతం స్వల్పంగా దెబ్బతింది. గోడ కూలిన సమయంలో ఆ వాహనాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వాహనదారుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

పండగలు మన సంస్కృతికి ప్రతీకలు


పూజలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

రెజిమెంటల్ బజార్, న్యూస్‌టుడే: పండగలు మన సంస్కృతికి ప్రతీక అని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం రాంగోపాల్‌పేట డివిజన్‌లోని పలు ఆలయాల్లో నిర్వహించిన శ్రావణ మాసం బోనాల వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కళాసిగూడలోని శ్రీజూలమ్మ, నెక్లెస్‌రోడ్డు అంబేడ్కర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీలోని గాలి మైసమ్మ, ఇందిరానగర్‌లోని శ్రీకట్టమైసమ్మ అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్‌గౌడ్, డివిజన్ భారాస అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నాగరాజేశ్వరి ఆలయం వార్షికోత్సవం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సనత్‌నగర్, న్యూస్‌టుడే: స్థానిక నాగరాజేశ్వరీనగర్‌లోని నాగరాజేశ్వరి ఆలయ 34వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ కొలను బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు సనత్‌నగర్, ఎస్సార్టీ కాలనీ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్న ప్రసాదం అందజేశారు. స్థానికులు బోనాల శ్రీనివాస్ గౌడ్, సూరి స్వామి, జై నరసింహ, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ఏర్పాటు


నియామక పత్రాలను అందజేస్తున్న రాఘవరెడ్డి

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ నియోజకవర్గ నూతన కమిటీని నియమించారు. కన్వీనర్‌గా కె.సందీప్ కిరణ్, కోకన్వీనర్లుగా ఎ.గంగాధర్, పి.విజయ్‌కుమార్, ఉదయ్‌కుమార్ నియమితులయ్యారు. కమిటీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాఘవరెడ్డి, రావినూతన శశిధర్‌లు నియామక పత్రాలను అందజేశారు. కమిటీ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ భాస్కర్‌గిరి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుస్తుల పంపిణీ

పద్మారావునగర్, న్యూస్‌టుడే: పద్మారావునగర్‌కు చెందిన సైకి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్, సనత్‌నగర్, ముషీరాబాద్ ప్రాంతాల్లో కాలిబాటలపై ఉంటున్న నిరాశ్రయులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు సంజీవ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు పావని తదితరులు పాల్గొన్నారు.

బేగంపేట బ్రాహ్మణవాడిలో అగ్ని ప్రమాదం

బేగంపేట, న్యూస్‌టుడే: బేగంపేట బ్రాహ్మణవాడిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానిక సోలంకి గుల్‌మొహర్ అపార్ట్‌మెంటు నాలుగో అంతస్తులోని శర్మ అనే వ్యక్తి ఇంట్లో మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచాయి. కుటుంబసభ్యులంతా బయటకు పరుగు తీశారు. ఇంట్లోని సామగ్రికి మంటలు అంటుకుని పొగలు వ్యాపించడంతో స్థానికులు అప్రమత్తమై పోలీసులు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. బేగంపేట పోలీసులు, సికింద్రాబాద్ అగ్నిమాపక కేంద్రం నుంచి ఫైరింజన్‌తో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ప్రధాని మన్ కీ బాత్ ఆలకించిన నేతలు

పద్మారావునగర్, న్యూస్‌టుడే : ప్రధాని మోదీ 137వ మన్ కీ బాత్ ప్రసంగాన్ని భాజపా నేతలు సామూహికంగా ఆలకించారు. డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా భాజపా అధ్యక్షుడు భరత్‌గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ టి.రాజశేఖర్‌రెడ్డి, నేతలు సురేష్‌కుమార్, కేఎం కృష్ణ, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 18న యూత్ ఎంపవర్‌మెంట్ ఫెస్ట్

ఖైరతాబాద్: యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు పసాలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 18న భువనగిరి జిల్లా మోత్కూర్‌లో ఉచిత 'యూత్ ఎంపవర్‌మెంట్ ఫెస్ట్' నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విక్రమ్ సాగర్ పసాలా తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో గోడపత్రికను ఆవిష్కరించారు

రోజులు గడుస్తున్నా.. తొలగించరా?



కంటోన్మెంట్ ఐదో వార్డు పరిధిలోని వాసవి 'బి' కాలనీలో విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్నాయని చెట్ల కొమ్మలను చాలా రోజుల కిందట తొలగించారు. వాటిని అంతర్గత రహదారుల్లో ఇళ్ల పక్కనే పడేసి విద్యుత్తు సిబ్బంది చేతులు దులుపుకొన్నారు. ఇళ్లపక్క నుంచి కొమ్మలను తొలగించకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

అంధకారంలో ప్రధాన రహదారులు

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: వీధి దీపాలు వెలగకపోవడంతో బల్కంపేట, బీకేగూడ, సంజీవరెడ్డి నగర్ ప్రాంతాల్లోని పలు ప్రధాన రహదారులు అంధకారంగా మారాయి. దీనికితోడు రోడ్లపై గుంతలు ఉండటంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రాత్రిపూట వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. గుంతల వల్ల వాహనదారులూ ఇబ్బంది పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఉమేశ్ చంద్ర విగ్రహం నుంచి పాత పోలీసు స్టేషన్ చౌరస్తా వరకు ఉన్న రహదారి, సామాజిక భవనం పక్క నుంచి బాపూనగర్ వైపు వెళ్లే రోడ్డు, బీకేగూడ వార్డు కార్యాలయం నుంచి బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానం వైపు వెళ్లే రహదారి, అరవై అడుగుల రోడ్డు, ఈఎస్ఐ-బీకేగూడ రోడ్డు, ఈఎస్ఐ బస్టాప్ నుంచి బాపూనగర్ దేవాలయం నుంచి ఎస్సార్టీ కాలనీకి వచ్చే ప్రధాన రహదారుల్లో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. ఆధునిక దీపాలు ఏర్పాటు చేసినా నిర్వహణ లోపాల వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా వీధి దీపాలన్నీ వెలిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఎస్సార్‌నగర్‌లో నిరుపయోగంగా వీధి దీపాలు

మురుగు.. ముంచెత్తుతోంది



వెస్ట్ మారేడుపల్లి ప్రధాన రహదారిలోని ప్రధాన భూగర్భ డ్రైనేజీ పైపులైన్‌లో పూడిక పేరుకుపోయి మ్యాన్‌హోళ్ల వద్ద తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. కొద్దిరోజులుగా మురుగునీరు సదరు ప్రధాన రహదారి గుండా ప్రవహించి బూసారెడ్డిగూడ బస్తీలోకి చేరుతోంది. తీవ్ర దుర్గంధం, దోమలు వ్యాప్తి చెందుతుండడంతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం పాలవుతున్నారని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంటోన్మెంట్ పారిశుద్ధ్యం విభాగం అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై పశ్చిమ బెంగాల్‌వాసి మృతి

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: అనారోగ్యం కారణంగా సొంతూరుకు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఒకరు ప్లాట్‌ఫాంపై మృతి చెందాడు. పశ్చిమ బెంగాల్‌లోని శక్తిపూర్ ప్రాంతానికి చెందిన రాకేశ్ (41) మూడు నెలల కిందట బతుకుదెరువు కోసం నగరానికి వచ్చాడు. మెదక్ జిల్లా చేగుంటలో నివాసం ఉంటూ సెంట్రింగ్ వర్కర్‌గా పనులు చేసేవాడు. అనారోగ్యానికి గురైన ఆయన తిరిగి సొంతూరుకు వెళ్లేందుకు శనివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. టికెట్ తీసుకుని ప్లాట్‌ఫాంపై వేచి ఉన్నాడు. రైలు ఆలస్యంగా వస్తుందని తెలియడంతో అక్కడే ప్లాట్‌ఫాంపై విశ్రాంతి తీసుకుంటూనే మృతి చెందాడు. రైల్వే సిబ్బంది గుర్తించి జీఆర్పీ పోలీసులకు తెలియజేశారు. పోలీసులు మృతుడి జేబులో ఉన్న ఓటరు కార్డు ఆధారంగా రాకేశ్‌గా గుర్తించి అతడి బంధువులను సమాచారం అందించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

సనత్‌నగర్, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సనత్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలను పోలీసులు తెలిపారు. ఏపీలోని తిరుపతి జిల్లాకు చెందిన బత్తుల నాగరాజు 2013లో విజయ సలోమిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ నాగరాజు మోతీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల నాగరాజు గుర్తు తెలియని రసాయనం తాగి అపస్మారక స్థితికి చేరాడు. దీంతో భార్య బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లింది. అనంతరం బాధితుడిని అతని బాబాయ్ సతీశ్ బాబు మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి నాగరాజు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

గ్యాస్ సిలిండర్ లీక్.. తప్పిన ప్రమాదం


సిలిండర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

అడ్డగుట్ట, న్యూస్‌టుడే: తుకారాం గేట్ పీఎస్ పరిధి ఈస్ట్‌మారేడుపల్లిలోని డాక్టర్ మురళీధర్ అపార్టుమెంట్ రెండో అంతస్తులోని ఓ ఇంట్లో హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ అడుగు భాగం నుంచి గ్యాస్ లీక్ అయ్యింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎదురింటి వారు సదరు కుటుంబసభ్యులు, బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి సిలిండర్‌ను ఖాళీ స్థలంలోకి తీసుకొచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. తుకారాం గేట్ పోలీసులు.. సికింద్రాబాద్ తెలంగాణ అగ్నిమాపక దళం సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిలిండర్ నుంచి గ్యాస్ మొత్తం బయటకు వెళ్లిపోయిన అనంతరం పోలీసులు మహేంద్ర హిల్స్‌లోని సికింద్రాబాద్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీకి అందజేశారు.

ఘనంగా ఓయూ ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే


అనేష్ కుమార్ శర్మకు పురస్కారం అందజేస్తున్న వీసీ ఆచార్య కుమార్ మొలుగరం తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే: ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే-2026ను ఆదివారం ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించారు. 2026లో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ 31 బంగారు పతకాలు, 88 నగదు పురస్కారాలు, 27 ర్యాంకు ధ్రువపత్రాలను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఓయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి, రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన సాలిడ్ స్టేట్ ఫిజిక్స్ ల్యాబ్ (ఎస్ఎస్‌పీఎల్) డైరెక్టర్, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ అనేష్ కుమార్ శర్మకు 'విశిష్ట పూర్వ విద్యార్థి పురస్కారం-2026' అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు. కళాశాల అభివృద్ధికి ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం, ప్రిన్సిపల్ ఆచార్య పి.చంద్రశేఖర్, అధ్యాపక బృందం చేస్తున్న కృషిని ప్రశంసించారు.

గుంత పూడ్చివేతకు చర్యలు


బ్యారికేడ్లు ఏర్పాటు చేయిస్తున్న జలమండలి అధికారి

రెజిమెంటల్ బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లోని రైలు నిలయం రోడ్డులో ఆకస్మికంగా గుంత ఏర్పడటంతో జలమండలి అధికారులు అప్రమత్తమయ్యారు. గుంతను గుర్తించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో అధికారులు అక్కడికి చేరుకుని ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదానికి గురికాకుండా గుంత చుట్టూ బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. మారేడుపల్లి జలమండలి మేనేజర్ మనోహర్ నేతృత్వంలో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఇటీవల ఈ ప్రాంతంలో పైపులైన్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పైపులైన్ పనులు పూర్తయిన అనంతరం మధ్యలో మట్టి కుంగిపోవడంతో గుంత ఏర్పడినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు వెల్లడించారు.


రోడ్డుపై ఏర్పడిన గుంత

రేపటి నుంచి గోర్ ధర్మ జాగృతి మహా పాదయాత్ర

ఖైరతాబాద్: గోర్ ధర్మ జాగృతి కోసం సెప్టెంబరు 1 నుంచి మహా పాదయాత్ర చేపడుతున్నట్లు సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ మందిరం నిర్వాహకుడు భౌసింగ్ మహారాజ్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. పాదయాత్ర వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అజ్మీరా మంగ తండాలోని సేవాలాల్ మందిరం వద్ద ప్రారంభమై మహారాష్ట్రలోని పహరాదేవి మందిరం వద్ద ముగుస్తుందన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట బురిడీ

సనత్‌నగర్, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అధిక లాభాలొస్తాయని నమ్మించిన సైబర్ మోసగాళ్లు ఓ వ్యక్తి నుంచి రూ.45.67 లక్షలు కాజేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. సనత్‌నగర్‌కు చెందిన శ్రీనాథ్ చంద్రగిరి ఇటీవల ఫేస్‌బుక్‌లో ఆన్‌లైన్ షేర్ ట్రేడింగ్, పెట్టుబడులతో అధిక లాభాలొస్తాయనే ప్రకటన చూశాడు. లింక్‌పై క్లిక్ చేయగా ఓ వ్యక్తి శ్రీనాథ్‌ను వాట్సప్‌లో సంప్రదించి ఓ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాడు. సిద్ధి అగర్వాల్ పేరుతో ఉన్న ఓ నంబరుతో ఫోన్ చేయించి ఓ మహిళను శ్రీనాథ్‌కు పరిచయం చేశాడు. షేర్ ట్రేడింగ్‌లో తొలుత రూ.3.50 లక్షలు పెట్టుబడి పెట్టించి రూ.6.50 లక్షలు లాభం వచ్చినట్టు చూపారు. అందులో నుంచి రూ.84 వేలు విత్‌డ్రా చేసుకున్న శ్రీనాథ్ వారిని పూర్తిగా నమ్మాడు. అనంతరం ఎక్కువ లాభాల కోసం పలు విడతల్లో మొత్తం రూ.45.67 లక్షలను పెట్టుబడి పేరిట సైబర్ నేరగాళ్లు వసూలు చేశారు. చివరికి వారు స్పందించకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మోసం చేసి రూ.1.04 లక్షల కాజేత

బేగంపేట: సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని మోసం చేసి రూ.1.04 లక్షలు కాజేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బేగంపేట శ్యామ్‌లాల్ బిల్డింగ్స్‌కు చెందిన రాజ్‌కుమార్ ఇటీవల తన ఇంట్లోని బెడ్ మ్యాట్రెస్ విక్రయించేందుకు ఓఎల్ఎక్స్‌లో ప్రకటన ఇచ్చాడు. రోహన్ అనే వ్యక్తి ఫోన్ చేసి తాను కొనుగోలు చేస్తానని చెప్పాడు. రూ.5ను ఆయన ఖాతాకు పంపాడు. డబ్బు అందుకోవాలంటే తాను పంపిన క్యూర్ కోడ్‌ను స్కాన్ చేసి యూపీఐ పిన్ ఎంటర్ చేయాలని చెప్పాడు. నమ్మిన రాజ్‌కుమార్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పిన్ నమోదు చేశాడు. వెంటనే ఖాతా నుంచి రూ.1.04 లక్షలు డెబిట్ అయ్యాయి.

టెలిగ్రామ్ టాస్క్‌ల పేరిట విద్యార్థినికి టోకరా

బేగంపేట, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరిట టెలిగ్రామ్ గ్రూపులో చేర్చుకుని ఓ విద్యార్థినిని మోసం చేసిన ఘటన బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలంరాయికి చెందిన విద్యార్థిని హీనాను ఇటీవల మెగా అడ్వాన్స్ డెయిలీ టాస్క్ పేరుతో ఉన్న టెలిగ్రామ్ గ్రూపులోకి యూసుఫ్ శాంసన్ అనే వ్యక్తి చేర్చాడు. ప్రాపర్టీ ప్రమోషన్, గూగుల్ రివ్యూలు తదితర ఆన్‌లైన్ టాస్క్‌లు చేస్తే ఆదాయం వస్తుందని నమ్మించాడు. తొలుత కొన్ని సులభమైన టాస్క్‌లు చేయించి రూ.180 చెల్లించాడు. దీంతో బాధితురాలు ఆన్‌లైన్ టాస్క్‌లను నమ్మింది. విడతల వారీగా రూ.4.46 లక్షలు చెల్లించింది. డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా మరో రూ.1.5 లక్షలు చెల్లిస్తేనే గతంలో పెట్టుబడి పెట్టిన డబ్బు చెల్లిస్తామని స్పష్టం చేశారు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నిధులున్నా నిర్లక్ష్యం

● అభివృద్ధికి నోచని కైలాష్‌నగర్ సామాజిక భవనం

సనత్‌నగర్, న్యూస్‌టుడే: సనత్‌నగర్‌లోని కైలాష్‌నగర్ కమ్యూనిటీహాల్‌ను బహుళ ప్రయోజన సామాజిక భవనంగా తీర్చిదిద్దాలన్న ప్రతిపాదనలు ఏళ్ల తరబడి కార్యరూపం దాల్చడం లేదు. దీంతో శిథిలావస్థలో ఉన్న ఈ భవనంలో శుభకార్యాలు నిర్వహించుకునేందుకు సరైన వసతులు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సనత్‌నగర్, కైలాష్‌నగర్, సుభాష్‌నగర్, ఎస్సార్టీ కాలనీ పరిసర ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి ప్రజలు భారీ సంఖ్యలో ఉన్నారు. కైలాష్‌నగర్‌లోని కమ్యూనిటీహాల్ నిర్వహణ సరిగా లేకపోవడం, వసతుల లేమి స్థానికులకు ప్రతిబంధకంగా మారింది. ఈ సామాజిక భవనాన్ని అభివృద్ధి చేయాలని నాలుగేళ్ల కిందట అప్పటి కార్పొరేటర్ కొలను లక్ష్మితో పాటు కైలాష్‌నగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడు భోగిబాలరాజ్ తదితరులు స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన ఆయన బస్తీలో పర్యటించి కమ్యూనిటీహాల్‌ను పరిశీలించారు. దీనిని బహుళ ప్రయోజన సామాజిక భవనంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించడంతో ఈమేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు గత ప్రభుత్వం రూ.3.30 కోట్లు మంజూరు చేసింది.


శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటీహాల్

ప్రారంభం కాని పనులు

కైలాష్‌నగర్ సమాజిక భవనాన్ని జి+2 పద్ధతిలో ఆధునిక రీతిలో నిర్మించేందుకు రూ.3.30 కోట్ల వ్యయంతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్ సౌకర్యంతో పాటు మొదటి అంతస్తులో ఫంక్షన్ హాల్, రెండో అంతస్తులో డైనింగ్ హాల్ నిర్మించేలా ప్లాన్ రూపొందించారు. చుట్టూ ప్రహరీ, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించారు. కేవలం శుభకార్యాలే కాకుండా వివిధ సామాజిక కార్యక్రమాల కోసం కూడా ఈ భవనాన్ని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సంకల్పించారు. దీనిని నామమాత్రపు రుసుముతోనే స్థానికులకు అద్దెకు ఇవ్వాలని నిర్ణయించిన అధికారులు అనంతరం ఈ విషయాన్ని పూర్తిగా విస్మరించారు. నిధులు మంజూరైనా భవన నిర్మాణ పనులు నాలుగేళ్లుగా చేపట్టడం లేదు. ఈ పరిస్థితిలో సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి బహుళ ప్రయోజన సామాజిక భవనం పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.



రాఘవేంద్రస్వామి మఠం ఆరాధనోత్సవాలు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: మల్కాజిగిరిలోని రాఘవేంద్రస్వామి మఠం ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. ఆదివారం బృందావన ప్రవేశం, కనక మహా పూజ, ఫల పంచామృత అలంకరణను వేడుకగా నిర్వహించారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్షయ ఆచార, శ్రీనాథ్, జగన్నాథరావు, జ్ఞాన పరిమళ సేవ ప్రముఖులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి

అలరించిన నృత్య ప్రదర్శన

ఉప్పల్, న్యూస్‌టుడే: ఉప్పల్ మినీ శిల్పారామం ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీవారి పాదాలు భరతనాట్యం అకాడమీ గురువు నల్ల రమాదేవి శిష్య బృందం సభ్యులు కనిష్క, అద్విక, సోమశ్రీ, అక్షర, మిహిర, తాన్విహా, ధన్విక, విరోధిని నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది.



మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

మల్కాజిగిరి	93475 56399
అల్వాల్	93911 06395
నేరేడ్‌మెట్	84990 06641
మౌలాలి	8333852200

మల్కాజిగిరి, గౌతంనగర్, మౌలాలి, న్యూస్‌టుడే

? జ్యోతినగర్‌లో దోమల బెడద అధికంగా ఉంది. సాయంత్రం అయితే కిటికీలు, తలుపులు మూయాల్సిన పరిస్థితి ఉంది. – శ్రీదేవి, స్థానికురాలు

✓ దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయిస్తాం. – జకియా సుల్తానా, డీసీ, మల్కాజిగిరి

? సఫిల్‌గూడ మినీ ట్యాంక్‌బండ్‌పై, సుభాష్‌నగర్‌లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. –నాగరాజు, షేక్ హుస్సేన్

✓ వీధికుక్కలను పట్టుకుని శస్త్ర చికిత్స నిమిత్తం తరలిస్తాం. –డా.సంజీవ్‌రెడ్డి, వెటర్నరీ అధికారి, మల్కాజిగిరి

? చాణక్యపురిలో చెత్త నిల్వలు పేరుకుపోయాయి. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. – స్వప్న, స్థానికురాలు

✓ చెత్త నిల్వలను డంపింగ్ యార్డుకు తరలిస్తాం. –శ్రీనివాస్, పారిశుద్ధ్య నిర్వహణ సూపర్‌వైజర్

? ఆర్టీసీ కాలనీలో వీధిదీపాలు సరిగ్గా వెలగడం లేదు. రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. –వెంకటసుబ్బయ్య, స్థానికుడు

? ఈశ్వర్‌నగర్‌లో మురుగు సమస్య వేధిస్తోంది. – నరసింహులు, స్థానికుడు

✓ సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం. –బాలకృష్ణ ప్రసాద్, డీసీ, మౌలాలి

తీరని గూడు గోడు!

దశాబ్దాలుగా పరిష్కారం కాని యూఎల్‌సీ సమస్య

గౌతంనగర్, న్యూస్‌టుడే: గౌతంనగర్ డివిజన్‌లోని మల్లికార్జున్‌నగర్ కాలనీవాసులు సుమారు అయిదు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) సమస్య నేటికి పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మల్కాజిగిరికి పశ్చిమ ప్రాంతంలో సామాన్య, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు 1978లో మల్లికార్జున్‌నగర్ ఈస్ట్, వెస్ట్ పేరుతో కాలనీ ఏర్పాటు చేసుకున్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే, మల్లికార్జున్‌నగర్ వాసులు

నోటీసులతో మొదలు...

మల్లికార్జున్‌నగర్ 1054 వ్యక్తిగత నివాసాలతో ఏర్పడింది. అధికారుల లెక్కల ప్రకారం 867, 867/1, 868, 869 సర్వే నంబర్లలోని 216 ఇళ్లు యూఎల్‌సీ పరిధిలో ఉన్నాయి. ఆయా ఇళ్లు 1,09,811 చదరపు గజాలలో విస్తరించి ఉండగా వారందరికీ 2008లో క్రమబద్ధీకరించుకోవాలని నోటీసులు జారీ అయ్యాయి. అప్పటి మార్కెట్ విలువ రూ.100 ప్రకారం 18 మంది స్థానికులు యూఎల్‌సీ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని పొందారు. మరో 161 మంది కోర్టును ఆశ్రయించగా మిగిలిన 37 మంది ఇప్పటికీ ప్రభుత్వ జీవో కోసం ఎదురు చూస్తున్నారు. యూఎల్‌సీ పరిధిలోని ఇళ్ల ఆధునికీకరణకు సంబంధించి ప్రస్తుతం ఎటువంటి అనుమతులు రాక ఇబ్బందులు పడుతున్నారు. గత 15 ఏళ్లగా కాలనీ వాసులు తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కోర్టులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూ ఉన్నారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి యూఎల్‌సీ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పాత జీవో ప్రకారం చెల్లించేలా..

– అచ్యుతరావు, కాలనీ సంఘం కోశాధికారి



కాలనీలో అంతా మధ్యతరగతి, విశ్రాంత ఉద్యోగులం ఉన్నాం. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రూ.లక్షలు చెల్లించలేని పరిస్థితి ఉంది. గతంలో ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారమే లెక్క కట్టి ఎంత చెల్లించాలో తెలిపితే క్రమబద్ధీకరించుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. ఒరిజినల్ లే-అవుట్‌ను అధికారులు మరోసారి పరిశీలించాలి.

సీఎం దృష్టికి తీసుకెళ్లా..

– రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే, మల్కాజిగిరి

యూఎల్‌సీ సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఎల్బీనగర్ ప్రాంత వాసులకు అనుకూలంగా ఇచ్చిన జీవో మాదిరిగా ఈ ప్రాంతంలో కూడా ఇస్తే బాగుంటుంది. సమస్యను సీఎం, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాను. వారు సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

నిర్మాణ వ్యర్థాలు తరలించరూ..



మల్లికార్జున్‌నగర్ రవీంద్రభారతి అప్పర్ ప్రైమరీ పాఠశాల ఎదుట నెల రోజులుగా నిర్మాణ వ్యర్థాలు పేరుకుపోయాయి. అయినా సంబంధిత సిబ్బంది తొలగించడం లేదని స్థానికులు పేర్కొన్నారు. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మల్కాజిగిరి

అద్వైత సంగమం విజయవంతానికి పిలుపు



అయ్యప్ప ఆలయం వద్ద గురుస్వాములు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో డిసెంబరు 12న నగరంలో నిర్వహించనున్న అద్వైత సంగమం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉన్నికృష్ణన్ నంబూద్రి గురుస్వామి కోరారు. చాణక్యపురి అయ్యప్ప ఆలయంలో ఆదివారం అయ్యప్ప గురు స్వాముల సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. 32 వేల మందికి పైగా పాల్గొని ఏక కాలంలో అయ్యప్ప స్వామి శ్లోకాన్ని పఠిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సురేష్ సింగ్, ఉమాకాంత్, సతీష్, శ్రీనివాస్, వెంకటేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ గురువు బోధనలు ఆదర్శం

అల్వాల్, న్యూస్‌టుడే: శాంతి, సమానత్వం, సోదరభావాన్ని చాటిన నారాయణ గురువు బోధనలు ఆదర్శనీయం అని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కానాజిగూడలోని శ్రీనారాయణ విద్యాసంస్థలో జరిగిన నారాయణ గురువు జయంతి, ఓనం ఉత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని వర్గాల సమానత్వం కోసం నారాయణ గురువు కృషి చేశారన్నారు. నియోజకవర్గంలో ఉన్న కేరళ ప్రజలు అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్న తీరు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వారికి ఓనం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధ్యక్షుడు రాఘవేంద్ర నందన్, ప్రధాన కార్యదర్శి పద్మనాభన్ భారాస నేతలు శ్రీధర్ గౌడ్, సురేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



ఓనం వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

రక్తదానం చేసి.. అభిమానం చాటి

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకను ఆదివారం మల్కాజిగిరి కూడలిలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కోసి పంచి పెట్టారు. గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన శిబిరంలో అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. అభిమాన సంఘం తరపున నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



గాంధీ పార్కులో రక్తదానం చేస్తున్న అభిమానులు

మురుగు పరుగు

మౌలాలి డివిజన్‌లోని డాక్టర్ కృష్ణనగర్‌లో మ్యాన్‌హోల్ పొంగిపొర్లుతోంది. దీంతో మురుగంతా రోడ్డుపై పారుతోంది. దుర్వాసన కారణంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మౌలాలి



అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: (ఆదివారం నాటివి.. కిలో రూ.లో) టమాటా 23, వంగ 28, బెండ 28, పచ్చిమిర్చి 35, క్యాలీఫ్లవర్ 13, క్యాబేజీ 13, క్యారెట్ 55, దొండ 23, ఆలు 17, ఉల్లి 50, సొర 7, పొట్ల 13, బీన్స్ 65, గోరుచిక్కుడు 23, చిక్కుడు 40, దోస 13, బీర 28, కాకర 26, చామగడ్డ 26, కీర 28, క్యాప్సికం 33, బీట్‌రూట్ 35, కందగడ్డ 28, చిలగడదుంప 35, మామిడి 31, మునగ 40, ముల్లంగి 8(ఒకటి).

మంత్రి సురేఖను కలిసిన సురేష్‌యాదవ్

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: మల్కాజిగిరికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కీసర ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుడు బి.సురేష్ యాదవ్ ఆదివారం దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి ఇతర అంశాలను చర్చించినట్లు ఆయన తెలిపారు.



గుంత.. వాహనదారుల చింత

మచ్చబొల్లారంలోని అరుంధతి సామాజిక భవనం రోడ్డులో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. లింకు రోడ్డును కలిపే మలుపు వద్ద గుంత ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అల్వాల్

ముగిసిన జాతీయ క్రీడా దినోత్సవాలు



పతకాలతో విజేతలు

మేడ్చల్ కలెక్టరేట్, కీసర, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో మూడు రోజులపాటు నిర్వహించిన వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. రాష్ట్ర ప్రభుత్వం-స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాలతో జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ క్రీడా పోటీలు నిర్వహించడంతోపాటు, క్రీడల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. చివరి రోజున ఔటర్ రింగ్ సర్వీస్ రోడ్డులో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. జిల్లా క్రీడల అధికారి వై.దామోదర్‌రెడ్డి, ఖేలో ఇండియా సైక్లింగ్ కోచ్ కృష్ణ, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పాల్‌రాస్, ఉపాధ్యక్షుడు సాయి కృష్ణ, కోశాధికారి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటి ట్యాంకు

గతంలో డాక్టర్ కృష్ణనగర్‌లో అధికారులు నీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు దాన్ని ప్రారంభించలేదు. కేవలం ట్యాంకు మాత్రమే నిర్మించి వదిలేశారు. ఏళ్లగా నిరుపయోగంగా ఉంటోందని స్థానికులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి ట్యాంకును వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. - మౌలాలి, న్యూస్‌టుడే



దుర్గాభవాని ఆలయ వార్షికోత్సవం

గౌతంనగర్, న్యూస్‌టుడే: గౌతంనగర్ రైల్వే గేటు సమీపంలోని దుర్గాభవాని ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి 108 లీటర్ల ఆవు పాలతో క్షీరాభిషేకం చేశారు. అనంతరం చండీ హోమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



భక్తిశ్రద్ధలతో నవరాత్రులు నిర్వహించాలి

నల్లకుంట, న్యూస్‌టుడే: వినాయక నవరాత్రుల సందర్భంగా మండపాల వద్ద డీజే, సినిమా పాటలు, లాటరీలను నిషేధించాలని హిందూ ధర్మచక్రం వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దికుంట శ్రీకాంత్‌శర్మ డిమాండ్ చేశారు. తొమ్మిది రోజుల పాటు ఆధ్యాత్మిక వాతావరణంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని కోరారు. మండపాల్లో కేవలం భక్తి పాటలు మాత్రమే పెట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వినాయక నవరాత్రులు హిందూ సంస్కృతి సంప్రదాయాలు, ఐక్యతకు మారుపేరని అన్నారు. వేదికల వద్ద కోలాటం, భక్తి పాటలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, హోమాలు వంటివి నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలని మండపాల నిర్వాహకులను కోరారు.

నోటీసులు అందుకునేవారే అధికం

మౌలాలి సర్కిల్‌లో మ్యాపింగైంది 25 శాతమే

మౌలాలి, న్యూస్‌టుడే: సర్ ప్రక్రియలో భాగంగా విడుదల చేసిన జాబితాలో పేర్లు లేని వారికి అధికారులు నోటీసులు అందజేస్తున్నారు. మౌలాలి సర్కిల్ పరిధిలో సుమారుగా 75 శాతం మందికి నోటీసులు అందించాల్సి ఉందని తేల్చారు. వాస్తవానికి మ్యాపింగ్ కాని వారు సుమారుగా 50 శాతం మంది ఉన్నట్లు మొదట్లో నిర్ధారించారు. నోటీసులు డౌన్‌లోడ్ అయ్యి జారీ ప్రక్రియ మొదలయ్యే సరికి ఈ సంఖ్య భారీగా మారింది. పేర్లు, వయసు, ఇలా పలు వివరాల్లో తప్పులు ఉన్న వారికి సైతం నోటీసులు జారీ చేయనున్నారు. మ్యాపింగ్ అయిన ఓటర్లు 25 శాతం మంది మాత్రమే ఉన్నారు.

ఇప్పటి వరకు పంచింది కొన్నే..

మౌలాలి సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు 20 శాతం మందికి మాత్రమే నోటీసులు పంపిణీ చేశారు. నోటీసులు డౌన్‌లోడ్ చేయడంతో పాటు ప్రింటింగ్ ప్రక్రియ ఆలస్యమైనట్లు అధికారుల తెలిపారు. నోటీసుల్లో విచారణ నిర్వహించే కార్యాలయం పేరు, చిరునామాను నమోదు చేసి స్టాంప్ వేసి ఓటర్లకు అందించాల్సిన బాధ్యతను బీఎల్‌వోలకు అప్పగించారు.



మౌలాలిలో దరఖాస్తులు నింపుతున్నారిలా..

దరఖాస్తులకు అవకాశం..

ఓటు తొలగింపు విషయంలో అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఇందులో కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారే అధికంగా ఉంటున్నారు. తప్పుల సవరణ, పోలింగ్ బూత్ మార్పు తదితర దరఖాస్తులు వస్తున్నాయి. ముందుగా నోటీసుల ప్రక్రియ పూర్తి చేసి.. అనంతరం దరఖాస్తులపై దృష్టి సారించాలని సిబ్బందికి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారు ఆన్‌లైన్‌లో లేదా నేరుగా సంబంధిత కార్యాలయానికి వచ్చి ధ్రువీకరణ పత్రాలు అందించాల్సి ఉంటుంది.

నిర్లక్ష్యం చేయొద్దు: బాలకృష్ణ ప్రసాద్, మౌలాలి డీసీ

నోటీసులు అందిన వారు ఆన్‌లైన్‌లో లేదా నోటీసులో ఉన్న సంబంధిత కార్యాలయానికి వచ్చి సరైన ధ్రువపత్రాలు అందజేయాలి. దీంతో ఓటరు జాబితాలో సరైన వివరాలతో ఓటు వస్తుంది. నిర్లక్ష్యం చేస్తే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉంది. నోటీసులు అందని వారు ఆన్‌లైన్‌లోను తమ వివరాలతో లాగిన్ అయ్యి అక్కడ కూడా ధ్రువపత్రాలు సమర్పించొచ్చు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

అల్వాల్: ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్వాల్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఓ ఫార్మ కంపెనీలో ఉద్యోగం చేసే జగన్నాథం(33).. భార్య ఆశారాణితో కలిసి ఓల్డ్‌అల్వాల్‌లోని శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి ఇంటికి వచ్చిన అతడు భోజనం చేయకుండా బెడ్‌రూంలోకి వెళ్లాడు. అనంతరం అతడి భార్య రూంలోకి వెళ్లి చూడగా జగన్నాథం ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. కొన ఊపిరితో ఉన్న అతడిని స్థానికుల సహాయంతో సుచిత్రలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతి చెందాడు. ఈనెల 16 నుంచి తన భర్త మానసిక ఒత్తిడితో ఉన్నాడని ఆశారాణి ఫిర్యాదులో పేర్కొన్నారు. అతని తల్లి మృతి చెందడం వల్ల మనస్తాపం చెంది ఉండొచ్చని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కర్రే సూచిక!

రామాంజనేయనగర్‌లో మ్యాన్‌హోల్ మూత విరిగి ప్రమాదకరంగా ఉంది. ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని స్థానికులు కట్టెను ప్రమాద సూచికగా ఉంచారు. అధికారులు చర్యలు తీసుకుని మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గౌతంనగర్

రేపటి నుంచి గోర్ ధర్మ జాగృతి మహా పాదయాత్ర

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: గోర్ ధర్మ జాగృతి కోసం సెప్టెంబరు 1 నుంచి మహా పాదయాత్ర చేపడుతున్నట్లు సంత్ సేవాలాల్ మహారాజ్ మందిరం నిర్వాహకుడు భౌసింగ్ మహారాజ్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో దానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. పాదయాత్ర వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అజ్మీరా మంగ తాండాలోని సేవాలాల్ మందిరం వద్ద ప్రారంభమై నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల మీదుగా కొనసాగి మహారాష్ట్రలోని పహారాదేవి మందిరం వద్ద ముగుస్తుందన్నారు. దాదాపు 475 కి.మీ. 15 రోజులపాటు యాత్ర కొనసాగనుందని వివరించారు. లంబాడా సమాజం యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ హుస్సేన్ నాయక్, ప్రతినిధులు శ్రీనివాస్, లాలూప్రసాద్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న భౌసింగ్ మహారాజ్ తదితరులు

ఏపీకే ఫైల్ పంపి.. నగదు కొల్లగొట్టి

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: ఏపీకే ఫైల్ పంపి ఓ వ్యక్తి ఖాతా నుంచి నగదు కాజేసిన సంఘటన నేరేడ్‌మెట్ ఠాణా పరిధిలో జరిగింది. సీసీఎస్ పోలీసులు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ సఫిల్‌గూడ లక్ష్మీనగర్‌లో నివసించే విశ్రాంత ఉద్యోగి శ్రీరాములు(67)కు ఓ వ్యక్తి ఈనెల 28న బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పాడు. పింఛనుకు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తూ ఏపీకే ఫైల్ పంపాడు. అనంతరం శ్రీరాములు ఏపీకే ఫైల్‌పై క్లిక్ చేయగా... ఆయన ఖాతా నుంచి రెండు దఫాలుగా రూ.1,87,808 విత్‌డ్రా అయ్యాయి. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుబంధాల పున్నమి కవితా సంకలనం ఆవిష్కరణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: అనుబంధాల పున్నమి కవితా సంకలనం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం త్యాగరాయ గానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎనమంద్ర వరలక్ష్మి కవితా సంకలనాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా సిటీ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు డా.టి.రత్నప్రసాద్‌కు అక్షర రక్షాబంధన్ బిరుదును ప్రదానం చేసి సన్మానించారు.

నీట్ పీజీకి 197 మంది గైర్హాజరు

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 19 కేంద్రాల్లో ఆదివారం కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-(సీబీటీ) విధానంలో జరిగిన పీజీ నీట్-2026కు 197 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. 6,368 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 6,171 మంది పరీక్షలు రాశారు. నాగోల్ సీఐఎస్ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్, పీర్జాదిగూడలోని సూర్య టెక్నాలజీ పరీక్ష కేంద్రాలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి.విజయేందర్‌రెడ్డి సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కీసర పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన ఓ విద్యార్థిని అనుమతించలేదు. మేడిపల్లి తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రంలో పోలీసులు, అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ముషీరాబాద్

• ముషీరాబాద్ • అంబర్‌పేట

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



రాఘవేంద్రస్వామి మఠంలో ఎమ్మెల్యే వెంకటేశ్ దంపతులు

బర్కత్‌పుం: బర్కత్‌పురలోని రాఘవేంద్రస్వామి మఠం, బర్కత్‌పుర లింగంపల్లిలోని రాఘవేంద్రస్వామి బృందావన సమితిలో నిర్వహిస్తున్న రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బర్కత్‌పురలోని మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు.

కాచిగూడ, న్యూస్‌టుడే: రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా బాగ్‌అంబర్‌పేట భారాస నేత, మాజీ కార్పొరేటర్ బి.వెంకట్‌రెడ్డి లింగంపల్లిలోని రాఘవేంద్రస్వామి మఠాన్ని సందర్శించారు.

అనుబంధాల పున్నమి కవితా సంకలనం ఆవిష్కరణ



రత్నప్రసాద్‌కు బిరుదు ప్రదానం చేస్తున్న వేణుగోపాలరావు, చిత్రంలో వరలక్ష్మి

గాంధీనగర్, న్యూస్‌టుడే: గౌతమేశ్వర సాహితీ కళాసేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్యని సకల కళావేదిక సౌజన్యంతో డా.దూడపాక శ్రీధర్ సంపాదకత్వం వహించిన అనుబంధాల పున్నమి కవితా సంకలనం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం త్యాగరాయ గానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎనమండ్ర వరలక్ష్మి కవితా సంకలనాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా సిటీ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు డా.టి.రత్నప్రసాద్‌కు అక్షర రక్షాబంధన్ బిరుదును ప్రదానం చేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖుల వేణుగోపాలరావు, విజయ, దుర్గాభవాని పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

ముషీరాబాద్ : 80085 73400
రాంనగర్: 80085 73395
అంబర్‌పేట: 80085 73390
నల్లకుంట: 80085 73389
బర్కత్‌పుర: 98664 39000

ముషీరాబాద్, అంబర్‌పేట, న్యూస్‌టుడే:

? రాంనగర్ డివిజన్ పద్మకాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం పరిసరాల్లో వీధి దీపాలు వెలగడం లేదు.– వసంత్‌నాయుడు

✓ పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం – తిరుమల్‌రెడ్డి, సూపర్‌వైజర్

? చిక్కడపల్లిలోని కోనసీమ ద్రవిడ సంఘం కార్యాలయం వీధిలో రోడ్డు మధ్య నుంచి తాగునీరు లీకవుతోంది. –సుబ్బారావ

✓ పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం – జీవనజ్యోతి, జలమండలి మేనేజరు

? అలీకేఫ్ చౌరస్తా ప్రేంనగర్‌లో దోమల బెడదతో నెల రోజులుగా సతమతమవుతున్నాం. వెంటనే ఫాగింగ్ చేసి దోమల సమస్యను పరిష్కరించాలి. – అంజయ్య, వైద్యశాఖ విశ్రాంత ఉద్యోగి

✓ ఎంటమాలజీ విభాగం సిబ్బందిని పంపించి దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్‌కు చర్యలు తీసుకుంటాం. – మారుతీదివాకర్, ఉప కమిషనర్, జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్

ఇరుకు రోడ్లు.. వాహనాలతో పాట్లు

ఫోకస్

ముషీరాబాద్, న్యూస్‌టుడే: ముషీరాబాద్ నియోజకవర్గం ముషీరాబాద్ డివిజన్ భరత్‌నగర్ నుంచి బాపూజీనగర్ వెళ్లే మార్గం సమస్యలకు నిలయంగా మారింది. ఈ రోడ్డుకు ఇరువైపులా స్వచ్ఛ ఆటోల పార్కింగ్‌తోపాటు కార్లనూ రోడ్డు పక్కనే నిలుపుతున్నారు. రహదారి పక్కనే అక్రమ పార్కింగ్.. ఇసుక, ఇటుకల విక్రయాలు ఇలా ఈ రోడ్డు నిత్యం రద్దీగా మారుతోంది. ఉదయం స్కూళ్లు, ఆఫీసులకు వెళ్లే వారితోపాటు వాహనాదారులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈవిషయమై ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేరని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు.



ముషీరాబాద్ జీహెచ్ఎంసీ వాలీబాల్ క్రీడా మైదానం ప్రహరీ పక్కన కొందరు నిర్లక్ష్యంగా ఆటోలు, ఇతర వాహనాలను నిలుపుతున్నారు. ఎదురుగా రోడ్డు పక్కన వరుసగా మూడు చోట్ల ఇసుక. ఇటుక ఇతర గృహ నిర్మాణ సామగ్రిని విక్రయిస్తున్నారు. దీంతో తరచూ ట్రాఫిక్ జామ్ నెలకొంటోంది. ఫలితంగా ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులు నరకయాతన పడుతున్నారు.



ముషీరాబాద్ భరత్‌నగర్‌లోని నల్లపోచమ్మ ఆలయం సమీపంలో రోడ్డు పక్కనే ఓ కారు మెకానిక్ షెడ్ ఉంది. మరమ్మతుల కోసం వచ్చే కార్లను సదరు మెకానిక్ రోడ్డుకు ఓవైపు నిలిపి మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారింది. ఉదయం, సాయంత్రం వేళ్లలో సమస్య తీవ్రంగా మారడంతో స్థానికులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితిల్లోనూ అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.



భరత్‌నగర్ నుంచి బాపూజీనగర్ వెళ్లే రోడ్డుకు ఇరువైపులా స్వచ్ఛ ఆటోలను పార్కింగ్ చేస్తున్నారు. స్థానిక మొరంబొంద బస్తీలోని పేదల్లో మెజార్టీ వారు జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగంలో చెత్త సేకరణ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి జీహెచ్ఎంసీ కేటాయించిన స్వచ్ఛ ఆటోలను వారి ఇళ్ల ముందు నిలిపేందుకు స్థలం లేని కారణంగా సమీపంలోని బాపూజీనగర్ రోడ్డులో ఇరువైపులా నిలుపుతున్నారు. అంతే కాకుండా రోడ్డు కుచించుకుపోవడంతో ఇటుగా రాకపోకలు సాగించే వారు ట్రాఫిక్ కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు స్వచ్ఛ ఆటోల పక్కనే కొందరు నిర్లక్ష్యంగా చెత్తచెదారం, వ్యర్థాలను పారబోస్తున్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమల వ్యాప్తి అధికమైంది.

రోడ్డు పక్క స్వచ్ఛ ఆటోల పార్కింగ్‌తో పాటు పక్కనే కొందరు నిర్లక్ష్యంగా చెత్తచెదారం పారబోస్తున్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. అపరిశుభ్రత, దుర్వాసనతోపాటు దోమల వ్యాప్తి అధికమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో నవరాత్రులు నిర్వహించాలి



ధర్నాలో పాల్గొన్న హిందూ ధర్మచక్రం ప్రతినిధులు

నల్లకుంట: వినాయక నవరాత్రుల సందర్భంగా మండపాల వద్ద డీజే, సినిమా పాటలు, లాటరీలను నిషేధించాలని హిందూ ధర్మ చక్రం వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దికుంట శ్రీకాంత్‌శర్మ డిమాండ్ చేశారు. తొమ్మిది రోజుల పాటు ఆధ్యాత్మిక వాతావరణంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని కోరారు. మండపాల్లో కేవలం భక్తి పాటలు మాత్రమే పెట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వినాయక నవరాత్రులు హిందూ సంస్కృతి సంప్రదాయాలు, ఐక్యతకు మారుపేరని అన్నారు. వేదికల వద్ద కోలాటం, భక్తి పాటలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, హోమాలు వంటివి నిర్వహించేలా ఏర్పాటు చేసుకోవాలని మండపాల నిర్వాహకులను కోరారు. మాడుగుల శ్రీధర్, రామచంద్రమూర్తి, ఏవీఎస్ఎస్. శర్మ, అనంతుల సత్యనారాయణశర్మ, శివరాజు, శ్రీనివాసన్, సుధీర్ పాల్గొన్నారు.

ధర్మరక్షణ సభ విజయవంతానికి పిలుపు



కరపత్రాలతో ఆనంద్‌గుప్తా, అచ్చిని రమేష్, దయాకర్‌యాదవ్ తదితరులు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: సెప్టెంబరు 2న గోల్నాక అశోకా ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్న ధర్మ రక్షణ సభను విజయవంతం చేయాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి రాష్ట్ర మీడియా కన్వీనర్ ఆనంద్‌గుప్తా పిలుపునిచ్చారు. ఆదివారం చెన్నారెడ్డినగర్ రామాలయం మైదానంలో సమితి అంబర్‌పేట డివిజన్ కన్వీనర్ దయాకర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ అచ్చిని రమేష్‌తో కలిసి ప్రచార కరపత్రాలను ఆయన విడుదల చేశారు. నేతలు యశ్వంత్, మైలారం రాజు, భాస్కర్‌గౌడ్, వెంకీ, శ్రీకాంత్, నరేష్, ఎస్.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం'



మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్. ర్యాలీలో ఎండీ జహంగీర్ తదితరులు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మహేందర్ విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా అభివృద్ధికి కేటాయించిన నిధులను విడుదల చేయాలని డిమాండ్‌తో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ జహంగీర్ నేతృత్వంలో చేపట్టిన పాదయాత్రకు ఆదివారం ఛేనంబర్ చౌరస్తాలో స్వాగతం పలికిన అనంతరం ఆయన మాట్లాడారు. తాగు, సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నేతలు శ్రీనివాస్‌రావు, నరసింహ, నరేష్, కిరణ్, వరలక్ష్మి, రాములు, షబానా, సోమయ్య, శ్రీనివాస్, సుబ్బారావు పాల్గొన్నారు.

కేసీ గుప్తా 107వ జయంతి ఉత్సవాలు 1న



కేసీ గుప్తా

కాచిగూడ, న్యూస్‌టుడే: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు కేసీ గుప్తా 107 వ జయంతి ఉత్సవాలను సెప్టెంబరు 1న జైన్‌భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఇసామియాబజార్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్, ప్రాజెక్ట్ సలహాదారు కొమిరిశెట్టి అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ... తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, హైదరాబాద్ రేంజ్ డీఐజీ డి.శ్రీనివాస్ తదితరులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

ఇళ్లకు నష్టం కలగకుండా నాలా ప్రహరీ నిర్మాణానికి కృషి



ఎమ్మెల్యే గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్‌నగర్ వాసులు

ముషీరాబాద్, న్యూస్‌టుడే: భోలక్‌పూర్ డివిజన్ డీఎస్‌నగర్‌లో హుస్సేన్‌సాగర్ సర్‌ఫేస్ నాలా పక్కన కొనసాగుతున్న పేదల ఇళ్లకు నష్టం వాటిల్ల కుండా నాలా ప్రహరీ నిర్మాణం చేపట్టేలా తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. నాలా పరివాహక ప్రాంతమైన దామోదర సంజీవయ్యనగర్‌లోని పేదల ఇళ్ల పక్కనే ప్రమాదకరంగా నాలా కొనసాగుతున్నందున ప్రజల రక్షణగా ప్రహరీ నిర్మించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈక్రమంలో ఇక్కడి పేదలకు చెందిన కొందరి ఇళ్లను కొంత మేరకు కూల్చి నాలా ప్రహరీ నిర్మించాల్సి ఉన్నందున అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. దీంతో ఆందోళన చెందిన స్థానికులు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఆదివారం ఎమ్మెల్యే డీఎస్ నగర్‌లో పర్యటించి స్థానికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా స్థానికులంతా తమ ఇళ్లను కూల్చకుండా నాలా ప్రహరీ నిర్మించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. గత 50ఏళ్లకు పైగా డీఎస్‌నగర్‌లో ఉంటున్న పేదల ఇళ్లకు నష్టం కలుగకుండా అధికారులు నాలా ప్రహరీ నిర్మించాలన్నారు. ఈ విషయమై తాను జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్లకు విజ్ఞప్తి చేస్తానని హామీ ఇచ్చారు. అవసరమైతే డీఎస్ నగర్ వాసుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి, సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో భారాస నేతలు ముఠా జైసింహ, వై.శ్రీనివాస్‌రావు, శంకర్‌గౌడ్, మహ్మద్ అలీ, ఆర్.శ్రీను, దినేష్, డీఎస్‌నగర్ వాసులు రేణుక, లత, సుధాకర్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐహెచ్ఎంలో పుస్తకాల ఆవిష్కరణ



పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణిప్రాద్, సంజయ్‌ఠాకూర్ తదితరులు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్ఎం) లో పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ ప్రిన్సిపల్ సంజయ్ ఠాకూర్, ఫుడ్, బేవరేజ్ సర్వీస్ విభాగాధిపతి పునీత్ రజ్దాన్ రాసిన పుస్తకాలను రాష్ట్ర యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్ ఆదివారం డీడీ కాలనీలోని సంస్థ క్యాంపస్‌లో ఆవిష్కరించారు. కేంద్ర పర్యాటక శాఖ దక్షిణ ప్రాంతీయ డైరెక్టర్ వెంకటేశన్, అరుణ్‌కుమార్‌గుప్త, జితేంద్ర, గిరిబాబు, రత్నాకర్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు రోజుగా ప్రకటించాలి



మాట్లాడుతున్న బానోతు గణేష్‌నాయక్

నల్లకుంట, న్యూస్‌టుడే: సేవాలాల్ మహారాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం సెలవు రోజుగా ప్రకటించాలని లంబాడి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బానోతు గణేష్ నాయక్ డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలన్నారు. తండాల అభివృద్ధికి ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.5 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బాలాజీ నాయక్, కన్వీనర్‌గా శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రవీందర్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, రమేష్, లోకేష్, వెంకట్, ఇందల్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ బంధాలు ఏర్పరచుకున్న సరస్వతమ్మ



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

నల్లకుంట: తన చుట్టూ ఉన్నవారితో ఆత్మీయ బంధాలు ఏర్పరచుకున్న సరస్వతమ్మ మరణం శరీరానికి మాత్రమేనని, ఆమె పలకరింపు ప్రతి ఒక్కరిలో సజీవంగా కొనసాగుతుంటుందని వక్తలు అన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య కళానిలయంలో ఆదివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి తల్లి చావ సరస్వతమ్మ సంతాప సభలో పలువురు నేతలు ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. ఆమె కళ్లను దానం చేసి మరొకరికి చూపు ప్రసాదించడం, పరిశోధనల కోసం వైద్య విద్యార్థులకు ఆమె శరీరాన్ని అందజేయడం చరిత్రలో గుర్తుండిపోనున్నారని చెప్పారు. కార్యక్రమంలో తీగల సాగర్, కత్తి నర్సింహారెడ్డి, సుదర్శన్, మాణిక్‌రెడ్డి, వెంకట్, భాస్కర్‌రావు, చావ రవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య.. ట్రాఫిక్ ఇక్కట్లు తీరనున్నాయ్

అంబర్‌పేట-మూసారాంబాగ్ వంతెన ప్రారంభం నేడు



మ్యాపును పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు వీహెచ్, కమిషనర్ కర్ణన్, డీసీపీ రక్షితామూర్తి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: మూసీనదిపై కొత్తగా నిర్మించిన అంబర్‌పేట-మూసారాంబాగ్ వంతెన ప్రారంభంతో వాహనాల రాకపోకలతో కొన్నేళ్లుగా ఉన్న ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోనున్నాయి. సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త బ్రిడ్జిని ప్రారంభించిన అనంతరం వాహనాల రాకపోకలకు అనుమతించనున్నారు.

ఇక చుట్టూ తిరిగే పని లేదు..

వాహనదారులు అంబర్‌పేట నుంచి అటు దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్లడానికి, అక్కడి వారు ఇటు వైపు రావడానికి గోల్నాక-మలక్‌పేట రేస్‌కోర్స్ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించేందుకు వాహదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అదనంగా 2-3 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో గోల్నాక, జిందాతిలస్మత్ రోడ్డు తదితర మార్గాల్లో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. కొన్నిసార్లు ఈ మార్గంలో వెళ్లడానికి అరగంటకు పైగా సమయం పడుతుంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు అనునిత్యం ఇక్కట్ల పాలవుతున్నారు. వంతెన ప్రారంభిస్తే ఈ ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

రెండో వంతెన పూర్తయ్యే వరకు దీనిపైనే...

అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా నుంచి అటు మూసారాంబాగ్, దిల్‌సుఖ్‌నగర్ వైపు నేరుగా వాహనాల రాకపోకలకు అనుమతి ఇస్తామని కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కౌశిక్ 'న్యూస్‌టుడే' కు తెలిపారు. అలీకేఫ్ చౌరస్తా నుంచి మూసీనది పై నుంచి మూసారాంబాగ్ వైపు వెళ్లడానికి మాత్రమే ఈ వంతెనను నిర్మించారు. అటు వైపు నుంచి ఇటు రావడానికి రెండో వంతెన పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో ఒక వంతెన పైనుంచే రెండు వైపులా అనుమతించనున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ఆదివారం ఉదయం కొత్త వంతెనను పరిశీలించారు. అంబర్‌పేట ఎంసీహెచ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లను ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, పోలీస్ సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షితామూర్తి, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (శానిటేషన్) రవికిరణ్, జోనల్ కమిషనర్లు మంగతాయారు, సత్యనారాయణ, ఉప కమిషనర్ మారుతీదివాకర్, అదనపు డీసీపీ నర్సయ్య, ఓయూ ఏసీపీ జగన్, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తదితరులతో కలిసి బందోబస్తు, రూట్‌మ్యాప్‌ను సమీక్షించారు.

కళాకారులకు మరణం లేదు



పురస్కార గ్రహీతతో రామరాజు, నరసింహారావు, కృష్ణకుమారి

గాంధీనగర్: కళాకారులకు మరణం ఉండదని వారు నటించిన పాత్రల్లో ఎల్లప్పుడూ జీవించి ఉంటారని తెలుగు అకాడమి చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి వంశీ ఆర్ట్‌థియేటర్స్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో ప్రముఖ సినీనటి జమునా రమణారావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల నుంచి ఎంపిక చేసిన ప్రముఖులకు వంశీ-జమునా రమణారావు మహానంది అవార్డులను ప్రదానం చేసి సన్మానించారు. అనంతరం జమున కూతురు స్రవంతి మాట్లాడుతూ జమున వివిధ పాత్రల్లో నటించి ప్రేక్షకాదరణ పొందారన్నారు. రేలంగి నరసింహారావు, రామరాజు, జానీబాషా, జానకి, రమాచౌదరి, వెంకట్, సంతోష్‌కుమార్, డా.కృష్ణకుమారి, సుధామయి, గీతాంజలి పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుందాం



వీహెచ్, దుర్గాప్రసాద్‌రెడ్డి, నరేందర్, కృష్ణాగౌడ్, శ్రీధర్‌గౌడ్ తదితరులు

గోల్నాక, న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుని భావితరాలకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అన్నారు. ఆదివారం దుర్గానగర్‌లోని దుర్గామైసమ్మ ఆలయం ద్విదశాబ్ది ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్, నేతలు తొలుపునూరి కృష్ణాగౌడ్, దిలీప్‌కుమార్, శ్రీధర్‌గౌడ్, గోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త నారాయణగురు



హాజరైన పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసత్యంగౌడ్, కాలనీ ప్రతినిధులు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: బహుజనుల విద్యకు ప్రాధాన్యమిచ్చిన సంఘ సంస్కర్త నారాయణగురు అని పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసత్యంగౌడ్ కొనియాడారు. ఆదివారం జైస్వాల్‌గార్డెన్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నారాయణగురు జయంతి వేడుకల్లో నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. 1856లో కేరళలో దళితులకు గుడులు కాదు బడులు కావాలని ఎందరినో విద్యావంతులను చేశారని గుర్తు చేశారు. కాలనీ ఉపాధ్యక్షుడు కృష్ణ, ప్రతినిధులు ఈశ్వరయ్య, వెంకటరమణ, రామస్వామియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక, ఆధ్యాత్మిక సేవలకు గుర్తింపు



కాసుల మల్లికార్జున్

కాచిగూడ, న్యూస్‌టుడే: సామాజిక, ఆధ్యాత్మిక సేవలకు గుర్తింపు లభించిందని తెలంగాణ మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కురవి వీరభద్రస్వామి ట్రస్ట్ సభ్యులు కాసుల మల్లికార్జున్ తెలిపారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటుపడుతున్నానని తెలిపారు. యునైటెడ్ అమెరికన్ లీడర్‌షిప్, ఎక్స్‌లెన్స్ పురస్కారాన్ని అందుకున్న ఆయనను మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గంప చంద్రమోహన్ అభినందించారు.

పాఠశాల స్థలాన్ని కాపాడుకోవాలి

నల్లకుంట, న్యూస్‌టుడే: బాగ్‌లింగంపల్లిలోని ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కాపాడుకునేందుకు స్థానిక ప్రజలు ముందుకు రావాలని ఆంధ్ర ప్రాథమికోన్నత పాఠశాల ఐకాస కన్వీనర్ నైషదం సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఈ స్థలాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థాలను పరిసర ప్రాంతాల ప్రజలతో కలిసి ఆదివారం శ్రమదానం చేపట్టి శుభ్రం చేశారు. నాలుగు దశాబ్దాల క్రితం హౌసింగ్ బోర్డు పాఠశాలకు అప్పగించిందని, తాజాగా ఓ ప్రైవేటు విద్యా సంస్థకు విక్రయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్‌రెడ్డి, సురేష్, శ్రీనివాస్, మహేందర్, గజ్జెల రాజశేఖర్, నాగేశ్వర్‌రావు, రాములు, సైదులు, గోపి పాల్గొన్నారు.

కులవివక్ష వేధింపులు అరికట్టేందుకు చట్టం అవసరం



మాట్లాడుతున్న రఘునాథ్

నల్లకుంట, న్యూస్‌టుడే: ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఎదుర్కొంటున్న కులవివక్ష వేధింపులు, అవమానాలు, అన్యాయాలు అరికట్టేందుకు ప్రత్యేక చట్టం చేయాలని హైకోర్టు న్యాయవాది రఘునాథ్ అన్నారు. రోహిత్ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల మరణం దేశవ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల్లో కొనసాగుతున్న సంస్థాగత కుల వివక్షపై తీవ్రమైన చర్చకు దారి తీసిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అష్నాసింగ్, డాక్టర్ దొంత ప్రశాంత్ తదితరులు మాట్లాడుతూ.. రోహిత్ వేముల ఉద్యమం సందర్భంగా నమోదైన కేసులు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విద్యార్థి, ప్రజా, యువజన సంఘాలు, న్యాయ నిపుణులు, విద్యా వేత్తలు పాల్గొన్నారు.

నీట్ పీజీకి 197 మంది గైర్హాజరు


పరీక్ష కేంద్రంలో పోలీసులు, అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 19 కేంద్రాల్లో ఆదివారం కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-(సీబీటీ) విధానంలో జరిగిన పీజీ నీట్-2026కు 197 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. 6,368 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 6,171 మంది పరీక్షలు రాశారు. నాగోల్ సీఐఓఎస్ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్, పీర్జాదిగూడలోని సూర్య టెక్నాలజీ పరీక్ష కేంద్రాలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి.విజయేందర్‌రెడ్డి సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కీసర పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన ఓ విద్యార్థిని అనుమతించలేదు. మేడిపల్లి తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఉప్పల్

• ఉప్పల్ • మేడ్చల్

రా చెరువు కాలుష్యంపై హైడ్రా పరిశీలన


నమూనాలు సేకరిస్తున్న హైడ్రా, డీఆర్ఎఫ్ బృంద సభ్యులు

బోడుప్పల్, న్యూస్‌టుడే: బోడుప్పల్ రా చెరువును హైడ్రా ఆదివారం బృందం పరిశీలించింది. డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి చెరువులో కలుషిత జలాల నమూనాలు సేకరించారు. చెరువును పూర్తి స్థాయిలో తనిఖీ చేశారు. చెరువులోకి నాచారం, మల్లాపూర్ రసాయన పరిశ్రమల ద్వారా చేరుతున్న మురుగు, వ్యర్థ జలాలపై ఆరా తీశారు. చెరువులో ఇటీవల సుమారు 10 టన్నుల మేరకు చేపలు మృత్యువాత పడ్డాయి. అధికారులు స్థానికంగా విచారణ చేపట్టారు. పలువురు మత్స్యకారులు తమకు జరిగిన నష్టాన్ని అధికారులకు వివరించారు. తమను ఆదుకోవాలని గంగపుత్రులు మొరపెట్టుకున్నారు. చెరువు కాలుష్యంపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని హైడ్రా అధికారులు చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

(8008573370ఉప్పల్) (80085 73372 కాప్రా) (కీసర-80085 73286) (ఘట్‌కేసర్-98485 99881) (శామీర్‌పేట-94400 02249) (నాగారం-80960 04937) (మేడ్చల్‌పట్టణం-8008611399) (మేడ్చల్-98487 80696) (జవహర్‌నగర్- 99666 56700) (బోడుప్పల్-80085 73288) (హబ్సిగూడ 8008902835)

ఘట్‌కేసర్, కాప్రా, కీసర, నాచారం, బోడుప్పల్, న్యూస్‌టుడే:

? కీసర-కుషాయిగూడ రోడ్డు నుంచి మల్లికార్జున్‌నగర్ కాలనీకి వెళ్లే రోడ్డులో మూలమలుపు వద్ద గుంత ప్రమాదకరంగా ఉంది. – శ్రీనివాస్, మల్లికార్జున్‌నగర్‌కాలనీ కీసర

✓ పరిశీలించి గుంత పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. – రామలింగం, డీసీ కీసర సర్కిల్

? కొర్రెముల సబ్ రిజిస్ట్రార్ కాలనీలో రాత్రి వేళ దోమల బెడద ఉంది. – శ్రీనివాస్, కొర్రెముల

✓ నివారణ చర్యలు తీసుకుంటాం. –వాణి, డీసీ, ఘట్‌కేసర్

? సైనిక్‌పురి ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన వేగ నిరోధకాలతో ఇబ్బందులు పడుతున్నాం. – నర్సింగరావు, కందిగూడ

✓ రహదారిని పరిశీలించి, ట్రాఫిక్ పోలీసులతో కలిసి తగిన చర్యలు తీసుకుంటాం. – రవీందర్ సాగర్, డీసీ, నాచారం సర్కిల్

? కుషాయిగూడ మార్కెట్ వద్ద బస్ షెల్టర్ ఇరుకుగా మారింది. – చల్లా ప్రభాకర్, కుషాయిగూడ

✓ బస్ షెల్టర్‌ను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. – వేణుగోపాల్, డీఎం, కుషాయిగూడ డిపో

? ఐడీఏ చర్లపల్లి ప్రధాన రహదారిపై రోడ్లపై ఇసుక మేటలు వేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. –శివనాగరాజు, ఎస్వీనగర్

✓ శుభ్రం చేయిస్తాం. – వేణుగోపాల్, డీఎం, కుషాయిగూడ డిపో

? కీసర-కుషాయిగూడ రోడ్డు నుంచి మల్లికార్జున్‌నగర్‌కాలనీకి వెళ్లే రోడ్డులో మూలమలుపు వద్ద గుంత ప్రమాదకరంగా ఉంది. –శ్రీనివాస్, మల్లికార్జున్‌నగర్‌కాలనీ కీసర

✓ గుంత పూడ్చివేయిస్తాం. – రామలింగం, డీసీ కీసర సర్కిల్

వైద్యుల కొరత.. రోగుల అవస్థ

- నాచారం ఈఎస్ఐలో 141 పోస్టులకు.. 83 ఖాళీ
- 58 మంది ఉన్నా.. సేవలు చేసేది 36 మందే


ఓపీ సేవల కోసం బారులు

నాచారం, న్యూస్‌టుడే: కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ వైద్యసేవలు అందిస్తున్న నాచారం ఈఎస్ఐ(కార్మిక రాజ్య బీమా)ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దవాఖానాలో 141 మంది (సివిల్ అసిస్టెంట్ సర్జన్) వైద్యులకుగాను 58 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో 18 మంది అనధికారికంగా విధులకు దూరంగా, ఇద్దరు అసాధారణ సెలవులో, మరో ఇద్దరు పీజీ విద్య అభ్యసిస్తున్నారు. ఉన్న 36 మందితోనే వైద్యసేవలు కొనసాగుతున్నాయి. ఎనిమిదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం వైద్యుల పోస్టులు భర్తీ చేయకపోవడం.. ఉన్న వైద్యులను నాలుగు మాసాల క్రితం బదిలీ చేయడంతో సమస్య మరింత జటిలంగా మారింది. ప్రస్తుతం దవాఖానాలో 83 ఖాళీలున్నాయి. నిత్యం ఆసుపత్రికి వచ్చే 1200 మంది రోగులకు సరిపడా వైద్యులు లేక గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. దవాఖానాలోనే సేవలు పొందుతున్న 170 మంది ఇన్ పేషెంట్లకు నాలుగు మాసాలుగా సక్రమంగా వైద్యం అందని పరిస్థితి.

డిప్యూటేషన్‌పై కేటాయించాలని కోరాం:



డా.సత్యనారాయణ, ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్, నాచారం

ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్యుల కొరత గురించి ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాం. డిస్పెన్సరీలకు బదిలీ చేసిన శస్త్ర చికిత్స వైద్యులను కనీసం డిప్యూటేషన్‌పై అయినా కేటాయించాలని అధికారులకు విన్నవించాం. వైద్యుల కొరత ఉన్నప్పటికీ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం.

శస్త్రచికిత్సలకు నిరీక్షణ..

- ప్రభుత్వం నాలుగు మాసాల క్రితం చేపట్టిన వైద్యుల బదిలీలతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. దవాఖానా నుంచి 38 మంది డిస్పెన్సరీలకు బదిలీ కాగా.. ఇద్దరు మాత్రమే బదిలీపై వచ్చారు. పీడియాట్రిక్స్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాల్లో అవసరమైన స్థాయిలో నిపుణులు లేరు.
- ఆయా విభాగాల్లో శస్త్ర చికిత్సలకు అవసరమైన వైద్యులు, అనస్థీషియా నిపుణుల కొరతతో ఆపరేషన్లు మందగించాయి. దీంతో శస్త్ర చికిత్సల కోసం రోగులు నిరీక్షించాల్సిన పరిస్థితి. వైద్య సేవలపట్ల అవగాహనలేని ఈఎస్ఐ ఉన్నతాధికారుల వ్యవహారశైలి కారణంగానే దవాఖానాలో కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. శస్త్ర చికిత్సలు చేసే స్పెషలిస్టు వైద్యులను డిస్పెన్సరీలకు బదిలీ చేయడంతోనే సమస్య మరింత తీవ్రమైంది. శస్త్ర చికిత్స వైద్యం అందుబాటులో లేని డిస్పెన్సరీలకు స్పెషలిస్టు వైద్యులను బదిలీ చేయరాదని వైద్యుల సంఘం నేతలు మొరపెట్టుకున్నా పట్టించుకోకుండా బదిలీ చేయడంతోనే వైద్యుల కొరత తీవ్ర ప్రభావం చూపుతోంది.

ముగిసిన జాతీయ క్రీడా దినోత్సవాలు


పతకాలతో విజేతలు

మేడ్చల్ కలెక్టరేట్, కీసర, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో మూడు రోజులపాటు నిర్వహించిన వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ప్రభుత్వం-స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాలతో జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ క్రీడా పోటీలు నిర్వహించడంతో పాటు, క్రీడల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. చివరిరోజు ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా క్రీడల అధికారి వై.దామోదర్‌రెడ్డి, ఖేలో ఇండియా సైక్లింగ్ కోచ్ కృష్ణ, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పాల్‌రాస్, ఉపాధ్యక్షుడు సాయికృష్ణ, కోశాధికారి నరేశ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక


నియామక పత్రాలు అందజేస్తున్న లక్ష్మణ్, అంజి

నాచారం: ఎమ్మార్పీఎస్ మల్లాపూర్ యువజన సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొల్లూరి రవి, ఉపాధ్యక్షుడిగా బి.మనోజ్, ప్రధాన కార్యదర్శిగా సాయిశశాంక్, సంయుక్త కార్యదర్శిగా బి.విగ్నేష్, కార్యవర్గ సభ్యులుగా ఉదయ్, కిరణ్, సన్నీ, కుమార్, సాయిలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా బాధ్యుడు లక్ష్మణ్, నియోజకవర్గ బాధ్యుడు అంజి నియామకపత్రాలు అందజేశారు.

ముత్యాలమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



మూడుచింతలపల్లి(శామీర్‌పేట), న్యూస్‌టుడే: కొల్తూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ముత్యాలమ్మతల్లి ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆదివారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్ జాము రవి, వైస్ ఛైర్‌పర్సన్ శశిరేఖరెడ్డి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నిర్వహించే నిత్య అన్నదానానికి ఆదివారం ఉప్పల్ వాస్తవ్యులు పీకే జుటేశ్వర్‌రావు, ఉమాదేవి దంపతులు రూ.1,01,116 విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసన్నలక్ష్మికి అందజేశారు.

నృత్యాభినయం.. నయన మనోహరం



ఉప్పల్, న్యూస్‌టుడే: ఉప్పల్ మినీ శిల్పారామం ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీవారిపాదాలు భరతనాట్యం అకాడమీ గురువు నల్ల రమాదేవి శిష్య బృందం ప్రదర్శన ఆకట్టుకుంది.

అక్రమ పార్కింగ్.. ఒక్కరోజే 300 చలాన్లు

హబ్సిగూడ, న్యూస్‌టుడే: రాంరెడ్డినగర్ నుంచి టీవీ కాలనీ వరకు సర్వీసు రోడ్డును ఆక్రమించి వాహనాలు పార్కింగ్ చేయడంతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో 'సాగని విస్తరణ.. ఆగని అక్రమణ' అనే శీర్షికతో ఆదివారం ప్రచురితమైన కథనానికి ఉప్పల్ డీసీ ఆనంద్, ట్రాఫిక్ సీఐ నాగరాజు స్పందించి పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించారు. ఒక్కరోజే 300 చలాన్లను వేసినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

వైభవంగా కల్యాణోత్సవం



జవహర్‌నగర్, న్యూస్‌టుడే: జవహర్‌నగర్ పాపయ్యనగర్, గిరిప్రసాద్‌నగర్, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాపయ్యనగర్‌లో రేణుకా ఎల్లమ్మ కల్యాణం వైభవంగా జరిగింది. జవహర్‌నగర్ మాజీ మేయర్లు మేకల కావ్య, దొంతగాని శాంతిగౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సజావుగా సాగిన ఇందిరమ్మ ఇళ్ల డ్రా


లబ్ధిదారుడి పేరు ప్రకటిస్తున్న అధికారి

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: మేడ్చల్ నియోజకవర్గం పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు సంబంధించిన డ్రా ప్రక్రియ సజావుగా కొనసాగింది. ఆదివారం పోచారంలోని సద్భావన్ టౌన్‌షిప్‌లో ఉన్న హౌసింగ్ బోర్డు కార్యాలయంలో ఆ శాఖ చీఫ్ ఇంజినీర్ వెంకటరమణరెడ్డి ఆధ్వర్యంలో డ్రా ప్రక్రియ నిర్వహించారు. హౌసింగ్ బోర్డు పీడీ సిద్ధార్థ, ఈఈ నరేందర్‌రెడ్డి, పాల్గొన్నారు. అన్నోజిగూడలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మించనున్న 480 గృహాలకు డ్రా తీశారు. తొలుత ప్రభుత్వ ఒప్పంద ఉద్యోగులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించి డ్రా తీశారు. 120 ఇళ్లకు సంబంధించి వెయిటింగ్ లిస్ట్ (25 శాతం) డ్రా కూడా తీశారు.

అర్హత కలిగిన దరఖాస్తులు: 1253

జనరల్: 306, ఓబీసీలు: 77, ఎస్సీ: 67, ఎస్టీలు: 24, దివ్యాంగులు: 05, ఒప్పంద ఉద్యోగులు: 01

కేటాయింపు ఇలా..

- 480 ఇళ్లలో జనరల్ కేటగిరీకి 50శాతం, ఓబీసీలకు 16శాతం, ఎస్సీలకు 14శాతం, ఒప్పంద ఉద్యోగులకు 10శాతం, ఎస్టీలకు 5శాతం, దివ్యాంగులకు 5శాతం ఇళ్లు కేటాయించారు. ఒప్పంద ఉద్యోగుల రిజర్వేషన్లకు సంబంధించి 10శాతంలో భాగంగా 48 ఇళ్లు కేటాయించగా ఒక్క లబ్ధిదారుడే ఎంపిక కావడంతో మిగతావి జనరల్‌లో కలిపేశారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 5శాతంలో భాగంగా 24 ఇళ్లు కేటాయించగా ఐదుగురే అర్హత సాధించడంతో మిగతావి జనరల్‌లో కలిపేశారు.

పచ్చందాలు.. చూపరులు మెచ్చగా



కాదేదీ కళకి అనర్హం అన్నట్టు ఆకట్టుకుంటున్న మొక్కలు. కీసరగుట్ట మార్గంలో ఔటర్ రింగ్‌రోడ్డు సర్కిల్‌పై పెంచిన మొక్కలను ఇలా అందంగా తీర్చిదిద్దారు. జింక, ఫ్లవర్‌వాజ్, ఫౌంటెన్ వంటి ఆకారాల్లో మొక్కలు పెంచి సంరక్షిస్తున్నారు. ఆ మార్గంలో వెళ్లే వారికి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

ఇళ్ల పేరుతో దళారుల బురిడీ

బోడుప్పల్ స్థలాలే లక్ష్యంగా బేరాలు

"బోడుప్పల్, న్యూస్‌టుడే: బోడుప్పల్‌లోని ప్రభుత్వ స్థలాలే లక్ష్యంగా దళారీలు పేదలను బురిడీ కొట్టిస్తున్నారు. ఇళ్ల పట్టాల పేరుతో పేదలకు కుచ్చుటోపీ పెడుతున్నారు. సొంతింటి కలను సాకారం చేస్తామంటూ మాయమాటలతో సొమ్ము చేసుకుంటున్నారు. బోడుప్పల్‌లోని సర్వే నంబరు 63/1లో ఇళ్లు, స్థలాలు ఇప్పిస్తామంటూ పలువురు పేదలకు ఎర వేస్తున్నారు. రెక్కాడితేకాని డొక్కాడని పేదలు సొంతింటి కలను సాకారం చేసుకొనేందుకు నగా, నట్రా అమ్ముకొని అడిగినంత ముట్టజెపుతూ దగా పడుతున్నారు."

ఇవే ఆ ప్రాంతాలు:

బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ మూడు ఫేజ్‌లుగా వర్గీకరణ చెందింది. సర్వేనంబరు 63/1ని ప్రాంతాలుగా విభజించారు. అందులో అంబేడ్కర్‌నగర్, దేవేందర్‌నగర్, రాజీవ్‌నగర్, గౌతంనగర్ ఫేజ్-1,2,3గా రూపాంతరం చెందిన స్థలాల్లోని ఖాళీ జాగాలపై కన్నేసిన కొంతమంది వాటిని అమ్ముతామంటూ బేరసారాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరైతే ఏకంగా దగ్గరుండి ఇల్లు కట్టిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఈ వ్యవహారం బహిరంగంగానే జరుగుతున్నా వాటిని అడ్డుకోవడంలో స్థానిక అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలున్నాయి. అధికార పార్టీ సభ్యుల పేరుతో స్థానిక రెవెన్యూ అధికారులను బెదిరిస్తూ ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలకు తెరతీశారు. దీంతో రోడ్లు, పార్కు స్థలాలు, ప్రజోపయోగభూములు మాయమవుతున్నాయి.

- నగరానికి చెందిన ఓవ్యక్తి దేవేందర్‌నగర్‌లో ఇల్లు కొనుగోలు చేశాడు. తమకు తెలియకుండా 'మీరెలా ఇల్లు కొంటారని' ఆయన గృహ ప్రవేశం చేసిన రోజు రాత్రి సదరు వ్యక్తికి చెందిన ముఠా మూకుమ్మడి దాడి చేసింది. ఇంటి యజమాని పోలీసులను ఆశ్రయిస్తే అవతలి పక్షం వారికి రాజకీయ అండ ఉండటం.. విచారణ పేరుతో కేసు నమోదు చేసేందుకు పక్షం రోజులపైనే పట్టింది.


సర్వేనం.63/1లో రోడ్డును ఆక్రమించి చేపడుతున్న నిర్మాణం

కలెక్టర్‌కు నివేదిస్తాం: డీసీ శైలజ

"బోడుప్పల్ ప్రభుత్వ స్థలాల్లోని ఆక్రమణలు, అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తాం. అక్రమ నిర్మాణాలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అడ్డుకుంటున్నా రాత్రికిరాత్రే నిర్మాణాలు వెలుస్తున్నాయి. త్వరలోనే కూల్చివేతలు చేపడుతాం."



గుంతలతో.. వాహనదారుల ఇక్కట్లు

హెచ్‌బీకాలనీ డివిజన్ తిరుమలానగర్ ప్రధాన వీధిలో గుంతలతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. కాలనీలోని ప్రధాన వీధిలో ఇటీవల రోడ్డు మధ్యలో తవ్వేసి అధికారులు భూగర్భ డ్రైనేజీ పైపులు ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డుపై ఏర్పడిన గుంతలతో కాలనీ ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు.

– కాప్రా, న్యూస్‌టుడే

ఉపాధికని వచ్చిన కార్మికుడి ఆత్మహత్య

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: ఉపాధి కోసం నగరానికి వలసొచ్చిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జవహర్‌నగర్ ఠాణా ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన సంగ్రామ్ (30) పదిరోజుల క్రితం జవహర్‌నగర్ గబ్బిలాలపేటకు ఉపాధి నిమిత్తం వలసొచ్చాడు. స్థానికంగా ఉంటున్న మరో ముగ్గురు కార్మికులతో కలిసి ఉంటూ పనికోసం చూస్తున్నాడు. ఆదివారం మిగిలిన కార్మికులు పనికెళ్లగా సంగ్రామ్ గదిలో ఒంటరిగా ఉన్నాడు. ఆదివారం రాత్రి సీలింగ్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య కారణాలు తెలియరాలేదని, మృతుడికి భార్య, పిల్లలున్నట్లు పోలీసులు తెలిపారు.

కుమారుడితో సహా మహిళ అదృశ్యం

ఉప్పల్, న్యూస్‌టుడే: కుమారుడితో కలిసి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఉప్పల్ పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరుకు చెందిన ఓ మహిళ (26)కు ఇద్దరు కుమారులు. తన సోదరునికి రాఖీ కట్టేందుకు ఈనెల 25న ఉప్పల్‌లోని బీరప్పగడ్డకు వచ్చింది. ఆదివారం ఉదయం కుమారుడు (5)ను తీసుకుని బయటకు వెళ్లిన ఆమె అదృశ్యమైంది. సోదరుని ఫిర్యాదుతో ఠాణాలో కేసు నమోదు చేశారు.

భాజపాను మరింత బలోపేతం చేయాలి


గిరివర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న మోహన్‌రెడ్డి, నేతలు

నాచారం, న్యూస్‌టుడే: మేడ్చల్-మల్కాజిగిరి భాజపా జిల్లా అధ్యక్షుడిగా గిరివర్ధన్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆ పార్టీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నేతలు ఆయన్ను కలిసి సన్మానించారు. జిల్లాలో భాజపాను సంస్థాగతంగా బలోపేతం చేయాలని సూచించారు.

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి పాదయాత్ర

పీర్జాదిగూడ, న్యూస్‌టుడే: యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ డిమాండ్ చేశారు. భువనగిరి నుంచి శనివారం చేపట్టిన సీపీఎం మహా పాదయాత్ర రెండో రోజు ఆదివారం మేడిపల్లికి చేరుకుంది. జహంగీర్ మాట్లాడుతూ.. పాదయాత్రలో ప్రజాసమస్యలు తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నరసింహ, అనురాధ, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, ఘట్‌కేసర్ మేడిపల్లి మండలం కార్యదర్శులు సబిత, ఎన్.సృజన పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నాచారం: నాచారంలోని సుప్రభాత్ మోడల్ హైస్కూల్‌లో 'పెడల్ ఫర్ పర్పస్-సే నో టు డ్రగ్స్'పేరిట నిర్వహించిన కమ్యూనిటీ సైక్లోథాన్ ఆదివారం ఉత్సాహభరితంగా సాగింది. పాఠశాల ఛైర్మన్ నల్లా నర్సింహారెడ్డి ర్యాలీ ప్రారంభించారు. మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. అకడమిక్ డైరెక్టర్ సంపత్‌రెడ్డి, అడ్మిన్ డైరెక్టర్ కె.వి.నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ భానువిశాల్, అడ్మిన్ అధికారిణి సీహెచ్ ఆశాలత పాల్గొన్నారు.

కార్మికులకు అల్పాహారం, రెయిన్ కోట్స్ అందజేత

కాప్రా, న్యూస్‌టుడే: కాప్రా డివిజన్ సాకేత్ కాలనీలో ఆదివారం వరదనీటి కాల్వల నిర్మాణ పనులు నిర్వహిస్తున్న కార్మికులు, ఉద్యోగులకు అక్షయ లయన్స్ క్లబ్, కాలనీ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు అల్పాహారం, రెయిన్ కోట్స్, రక్షణ సామగ్రి అందజేశారు. నిర్వాహకులు ఆదిత్య కన్నన్, భార్గవి, దిలీప్, రెహమాన్, మల్లారెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు.. అడ్డుకున్న అధికారులు


అధికారులు వచ్చి వెళ్లాక మళ్లీ అక్రమంగా చేపడుతున్న మట్టి తవ్వకాలు

కీసర, న్యూస్‌టుడే: రాంపల్లిదాయరలో ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న మట్టి తవ్వకాలపై ఆదివారం రెవెన్యూ అధికారులు దాడి చేశారు. సెలవు రోజును ఆసరాగా చేసుకుని సర్వే నం.633లో మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ జీపీవో రమాకాంత్‌తో కలిసి క్షేత్ర స్థాయికి వెళ్లారు. మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేనట్లు గుర్తించారు. మట్టి తరలిస్తున్న లారీలు, యంత్రాలను పట్టుకున్న అధికారులు మూడు లారీలను మాత్రమే సీజ్ చేసి మండల తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. మిగిలిన లారీలు, యంత్రాలను వదిలేయడంపై ఆరోపణలు వ్యక్తమయ్యాయి. అధికారులు దాడి చేసి వెళ్లాక మళ్లీ మట్టి తవ్వకాలు యథావిధిగా జరగడం గమనార్హం. తవ్వకాలపై పూర్తి విచారణ జరిపి తహసీల్దారుకు నివేదిక అందజేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు.

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: ఘట్‌కేసర్ మండలం చందుపట్లగూడెంలో వెంకటాపూర్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన వ్యవసాయ భూమిలో కౌలుదారులు గడీల సంజీవరెడ్డి, గడీల ప్రభాకర్‌రెడ్డి సేద్యం చేస్తున్నారు. ఈనెల 26, 27 తేదీలలో ఎలాంటి అనుమతి లేకుండా భూమిలో మట్టి తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లతో తరలించినట్లు ఆలయ ఈవో ఎల్.భాగ్యలక్ష్మి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మారుతీనగర్ కార్యవర్గం ఎన్నిక

బోడుప్పల్, న్యూస్‌టుడే: బోడుప్పల్ మారుతీనగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా కురిచేటి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఆకునూరి రమేష్, కోశాధికారిగా ఎన్ఎస్ఆర్ మూర్తి గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

పీ అండ్ టీ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి

పీర్జాదిగూడ, న్యూస్‌టుడే: మేడిపల్లిలోని పీ అండ్ కాలనీ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడిగా జె.తిరుపతిరెడ్డి గెలుపొందారు. మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి, కాలనీవాసులు నూతన అధ్యక్షుడిని సన్మానించారు. తనను గెలిపించిన కాలనీవాసులకు తిరుపతిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మండీ హటావో.. చెంగిచర్ల బచావో

- కబేళా వద్ద యువకుల నిరసన


కబేళా వద్ద బైఠాయించిన స్థానికులు

బోడుప్పల్, న్యూస్‌టుడే: చెంగిచర్ల కబేళాను తరలించి ప్రజల ప్రాణాలు కాపాడాలంటూ ఆదివారం చెంగిచర్ల యువత జంతు వధశాల వద్ద నిరసనకు దిగింది. వధశాల ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. భారీ వాహనాల రాకపోకలతో సమస్యలు వస్తున్నాయన్నారు. కబేళా వల్ల కాలుష్యం పెరిగిందని, దుర్వాసనతో అవస్థ పడుతున్నామన్నారు. జంతువధశాల రోడ్డు ఇరుకుగా ఉండటం.. రాకపోకలకు ఇబ్బందికరంగా మారడం వల్ల గ్యార హరిబాబు అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడని తెలిపారు. కబేళాను తరలించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని నినదించారు. రోడ్లు విస్తరించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనలో చెంగిచర్ల డివిజన్ భాజపా అధ్యక్షుడు మహేష్, తెలంగాణ రక్షణ సేన బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ, భారాస నాయకుడు కొత్త సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ జంగయ్యయాదవ్ సంఘీభావం ప్రకటించారు. కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో పోలీసులు సర్ది చెప్పి పంపించారు.

కాసులు కొట్టేసి... పావులుగా మార్చి!

- బాధితులకు సైబర్ మాయగాళ్ల ఎర
- కమీషన్ ఆశచూపి ఏజెంట్లుగా తయారీ



సికింద్రాబాద్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి.. పార్ట్‌టైమ్ జాబ్‌తో అదనపు ఆదాయం వస్తుందనే ఆశతో వాట్సప్ లింక్‌ను క్లిక్ చేశాడు. టాస్క్‌లు పూర్తిచేస్తే డబ్బు రావటంతో నమ్మాడు. అదే కంపెనీలో పెట్టుబడితో జీతం, లాభం వస్తాయనే ఉద్దేశంతో విడతల వారీగా రూ.2.50లక్షలు పెట్టి నష్టపోయాడు. సొమ్ము రాబట్టుకునేందుకు కొత్త అవతారమెత్తాడు.

ఉప్పల్‌లో నివాసం ఉంటున్న స్థిరాస్తి వ్యాపారి.. ట్రేడింగ్ యాప్‌లో రూ.60 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. మొదట్లో లాభాలు రావటంతో బంధుమిత్రులకు ఆ లింక్‌లు పంపి వారు నష్టపోయేందుకు కారణమయ్యాడు. అట్నుంచి ఒత్తిడి రావటంతో బయటపడేందుకు మార్గాలు అన్వేషించాడు. టెలీగ్రామ్‌యాప్‌లో వచ్చిన సందేశానికి స్పందించాడు.

వీరిద్దరు కుటుంబ అవసరాలు.. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు మోసగాళ్ల బారిన పడ్డారు. పోయిన చోటనే రాబట్టుకోవాలనే ఉద్దేశంతో నేరస్థుల ఎరకు చిక్కారు. పోలీసుల రికార్డుల్లో నిందితులుగా మారి జైలు ఊచలు లెక్కిస్తున్నారు. నగరంలో సైబర్ మోసాలకు బలవుతోన్న బాధితులను కొందరు కేటుగాళ్లు ఏజెంట్లుగా మార్చుకుంటున్నారు. 10-20శాతం కమీషన్ ఆశచూపి వారితోనే నేరాలు చేయిస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో తెరవెనుక నడిపించిన సూత్రదారులు దర్జాగా తప్పించుకుంటున్నారు. గతంలో పదులసంఖ్యలో ఉండే వీరు ప్రస్తుతం వందలకు చేరినట్టు పోలీసు ఉన్నతాధికారి ఆందోళన వెలిబుచ్చారు. నేరస్థులకు సహకరించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మోసాలకు గురైన బాధితులు గంట వ్యవధిలో (గోల్డెన్ అవర్) పోలీసులకు ఫిర్యాదు చేస్తే నగదు రికవరీ చేసే అవకాశం ఉందని సూచించారు.

ఈనాడు, హైదరాబాద్

మస్కా కొడతారిలా..

విదేశాల నుంచి చక్రం తిప్పే సూత్రధారులు ఆనవాళ్లు తెలియకుండా పకడ్బందీ జాగ్రత్తలు తీసుకుంటారు. డిజిటల్ అరెస్ట్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, టాస్క్‌లు, బ్యాంకు ఓటీపీ, కస్టమర్ కేర్ తదితర మోసాలతో కొట్టేసిన సొమ్ము కోసం బ్యాంకు ఖాతాలు అవసరం. ఈ చీకటి కార్యకలాపాలకు బాధితులను ఏజెంట్లుగా మార్చుకునేందుకు నేరస్థులు కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. బాధితుల వాట్సప్, ఫోన్లకు సందేశం పంపుతున్నారు. షెల్‌కంపెనీలు, మ్యూల్‌ఖాతాలు, సిమ్‌కార్డులు, ఆధార్, పాన్‌కార్డులు సరఫరా చేసేందుకు సహకరిస్తే భారీగా కమీషన్ ఇస్తామని ఆశ చూపుతున్నారు. పోలీసులు, బ్యాంకుల చుట్టూ తిరగకుండా పోయిన సొమ్మును తిరిగిస్తామని నమ్మకం కలిగిస్తున్నారు. తేలికగా డబ్బు వస్తుండటంతో బంధుమిత్రులు, కాలనీలోని పేద వర్గాల బ్యాంకు పుస్తకాలు, సిమ్‌కార్డులు సేకరించి విదేశాలకు సరఫరా చేస్తున్నారని పోలీసు అధికారి వివరించారు. బంధువు మాటలు నమ్మి ఖాతా ఇచ్చిన ఆటోడ్రైవర్ జైలుపాలయ్యాడు. అతడు బెయిల్ కోసం ఆటో విక్రయించాల్సి వచ్చిందని ఒక ఇన్‌స్పెక్టర్ చెప్పారు. మ్యూల్ ఖాతాలకు సహకరించిన ఒక యువకుడిపై కేసు నమోదు కావటంతో ఉద్యోగం, వివాహ విషయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడట.

భవనాలు అసంపూర్తిగా.. పఠనం అరకొరగా..

ఈనాడు, హైదరాబాద్

పాఠకులకు పాలకులు అరచేతిలోనే వైకుంఠం చూపిస్తున్నారు. పోటీ పరీక్షలకు అనుగుణంగా గ్రంథాలయాలను తీర్చిదిద్దుతున్నామని చెబుతున్నా..ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదు. నగరంలో గ్రంథాలయ భవన నిర్మాణాలు ఏళ్లుగా సాగుతున్నాయి. 2023లోనే రూ.17కోట్లతో 12 కొత్త భవనాలు, మరో 33 గ్రంథాలయాల భవనాలు మరమ్మతులు చేయించి, ఆధునికంగా తీర్చిదిద్దాలని పనులు మొదలుపెట్టారు. మరమ్మతులు పూర్తి చేయగలిగినా... కొత్త భవనాలు మాత్రం ఇంకా సాగుతూనే ఉన్నాయి. • బాకారం గ్రంథాలయ పనులతో అక్కడున్న పుస్తకాలను రాంనగర్ గ్రంథాలయానికి తరలించారు. దిన పత్రికల సెక్షన్‌ను మాత్రం స్థానిక గుడిలో పెట్టారు.

2023లో చేపట్టినా.. ఇంకా నిర్మాణంలోనే

- ఒక్కో ప్రధాన గ్రంథాలయంలో 35వేల మంది కంటే ఎక్కువే సభ్యత్వాలు ఉన్నాయి. పోటీ పరీక్షల కోసం వచ్చే అభ్యర్థుల సంఖ్య రోజూ వేలల్లో ఉంటోంది. గ్రంథాలయాలకు ఉన్న ఆదరణతోనే ప్రాంతానికో కమ్యూనిటీ గ్రంథాలయం ఉండగా.. ప్రైవేటుగానూ ఏర్పాటవుతున్నారు.
- ఆగాపుర గ్రంథాలయంలో ఎలక్ట్రికల్ పనులు చేపట్టారు. దూద్‌బౌళి లైబ్రరీలో ఇప్పుడే బండలు పరుస్తున్నారు. ఎల్‌ఐసీ కాలనీలో చివరి దశలో పనులున్నాయి. బాకారంలో 65శాతం పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.
- 2023లో మొదలు పెట్టిన భవన నిర్మాణాలు ఇంకా కొనసాగుతున్నాయంటే పరిస్థితి అర్థంచేసుకోవచ్చు. కొన్ని 50% పనులు పూర్తి చేసుకుంటే మరికొన్ని 70 శాతమే అయ్యాయి.

నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో..

2015కి ముందు గ్రంథాలయ శాఖకే ప్రత్యేకంగా నిధులు ఉండేవి. ప్రజలు కట్టే ఆస్తి పన్నులో 8శాతం నిధులు ఈ శాఖ ఖాతాలో పడేవి.. 2015 నుంచి మాత్రం ఈ నిధులు నేరుగా రాష్ట్ర ఖజానాలో జమ కావడంతో ఆలస్యం అవుతోంది. గుత్తేదారు పనులు చేయాలి. చేసిన వరకు బిల్లు ఇస్తే అది గ్రంథాలయ శాఖ.. తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ప్రతిపాదిస్తోంది. ఆ అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి నిర్మాణాలు నిర్ధారించుకున్నాక జీహెచ్‌ఎంసీ నుంచి నిధులు విడుదల చేయాల్సి వస్తోంది. • కొత్త భవనాలు కట్టేందుకు గ్రంథాలయ సంస్థకు నిధులు లేవు. ఉన్న వాటిని నిర్వహించేందుకు సరిపోను సిబ్బంది లేరు. ఉన్న కొద్ది మందికే అదనపు పనులు అప్పగిస్తున్నారు. 'గరిష్ఠంగా రూ.2లక్షల లోపు మరమ్మతులు ఏవైనా ఉంటే అవి మాత్రం చేయించగలుగుతున్నాం. గ్రంథాలయ సెస్సు నేరుగా సంస్థ ఖాతాలో పడితే వాటిని సద్వినియోగం చేసుకోగలం. అందుకే 2015కి పూర్వం నిధులు ఎలా ఇచ్చేవారో అలాంటి పద్ధతే ఉంటే బాగుంటుంది' అని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు ఛైర్మన్ రియాజ్ తెలిపారు.

ఉత్కంఠగా జూబ్లీహిల్స్ సొసైటీ ఎన్నిక



పోలింగ్ కేంద్రం వద్ద శీనయ్య, రవీంద్రనాథ్



ఓటర్ల సందడి

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నిక ఆదివారం ఉత్కంఠగా సాగింది. బొల్లినేని శీనయ్య, బొల్లినేని రవీంద్రనాథ్ ప్యానెళ్ల మధ్య నువ్వా.. నేనా అన్నట్లు పోరు సాగింది. జూబ్లీహిల్స్ భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 వరకు పోలింగ్ సాగింది. సభ్యులు పెద్ద సంఖ్యలో వచ్చి ఓటేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి, మామ పద్మారెడ్డి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డితోపాటు చాలామంది ప్రముఖులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. రెండు ప్యానెళ్లు గెలుపుపై ధీమా వ్యక్తం చేయడంతో ఫలితంపై ఆసక్తి నెలకొంది.

గోప్యంగా ఫలితం.. మధ్యాహ్నం 3 గంటలకు పోలింగ్ ముగియగా 3.30 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఎవరు గెలుస్తారన్న ఉత్కంఠ తారస్థాయికి చేరింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఫలితాన్ని ప్రకటించవద్దని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి చంద్రమోహన్‌రెడ్డి ఫలితాన్ని గోప్యంగా ఉంచారు. సుప్రీంకోర్టు తుది ఉత్తర్వులు వచ్చాక వెల్లడిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా జూబ్లీహిల్స్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



మారథాన్‌ను ప్రారంభిస్తున్న సైబరాబాద్ సీపీ రమేశ్, బల్దియా కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితరులు

పరుగెత్తికొచ్చిన పట్నం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తెల్లవారక ముందే ఆ ప్రాంతమంతా వేలమందితో నిండిపోయింది.. కాసేపట్లోనే అంతా పరుగు పెడుతూ ముందుకు సాగారు. ఆదివారం తెల్లవారుజామున పీపుల్స్ ప్లాజా ఇందుకు వేదికైంది. ఎన్‌ఎండీసీ ఆధ్వర్యంలో '15వ ఎడిషన్ ఎన్‌ఎండీసీ హైదరాబాద్ మారథాన్-2026'లో ఆరేళ్ల చిన్నారి నుంచి అరవై ఏళ్ల వృద్ధుడి వరకు పాల్గొన్నారు. ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్, 10కే, 5కే విభాగాల్లో పరుగు గచ్చిబౌలి స్టేడియం వరకు సాగింది. • మహిళల ఎలైట్ విభాగంలో ఇథియోపియాకు చెందిన ఎమానే సెయిపు విజేతగా



నిలవగా, రెండో స్థానంలో ట్సిగా డెస్టా, మూడో స్థానంలో కెన్యాకు చెందిన టెరెసియా ఒమోసా నిలిచారు. మహిళల్లో నర్మిబెన్ ఠాకోర్, మీనాక్షి నేగి, మారిపల్లి ఉమ, భగవతి దాంగి ముందంజలో నిలిచారు. పురుషుల ఎలైట్ విభాగంలో ఇథియోపియాకు చెందిన సెబోకా నెగుస్సే టైటిల్ సాధించారు. రెండో స్థానంలో కెన్యాకు చెందిన ఫిలిక్స్ కిముటై, మూడో స్థానంలో ఫ్రాన్సిస్ చెరుయియోట్, భారతీయుల్లో గోపీ తోనకల్ నాలుగో స్థానంలో నిలిచారు. • మారథాన్‌లో అత్యధిక మహిళా భాగస్వామ్యాన్ని నమోదు చేసిన సంస్థగా నోవార్టిస్ హెల్త్‌కేర్, అత్యధికంగా వెయ్యి రిజిస్ట్రేషన్లు చేసిన సంస్థగా డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ ప్రతినిధులను సత్కరించారు.

'హైడ్రా చర్యలు అభినందనీయం'



మణికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

మణికొండ, న్యూస్‌టుడే: ప్రజా ఆస్తుల పరిరక్షణకు హైడ్రా చేస్తున్న చర్యలు అభినందనీయమని టీపీసీసీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ వాసిరెడ్డి నరేష్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం మణికొండలో 'వాక్ విత్ హైడ్రా' ర్యాలీ నిర్వహించారు. మణికొండ మర్రిచెట్టు వద్ద ప్రారంభమైన ర్యాలీ హుడా కాలనీ వరకు కొనసాగింది. వివిధ కాలనీల రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కు స్థలాలను కాపాడేందుకు హైడ్రా చేపడుతున్న చర్యలు బాగున్నాయని కొనియాడారు. తిప్పరాజు రమేష్‌బాబు, సీతారాందాస్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లను మోసం చేస్తే సహించేది లేదు



ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ నేతలను సన్మానిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: ఆటో డ్రైవర్ల సంఘాలతో గత వారం జరిపిన చర్చల్లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీ మేరకు అన్ని సమస్యలు పరిష్కరించాలని, ఆటో డ్రైవర్లను మళ్లీ మోసం చేయాలని చూస్తే సహించేది లేదని తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం పేర్కొన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో బి.వెంకటేశం, ఇతర నాయకులను వివిధ ఆటో సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. వెంకటేశం మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలన్నీ త్వరితగతిన అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని, అసెంబ్లీ, సచివాలయం, ముఖ్యమంత్రి నివాసం ముందు ఆటోలు, క్యాబ్‌లతో దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. నేతలు భిక్షపతి యాదవ్, మన్సూరు కృష్ణ, సీహెచ్ జంగయ్య, ఎస్.అశోక్, భాస్కర్, ఎండీ ఖాజా, ఎం.నరసింహ, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం... బండ్లగూడజాగీర్ ఇందిరమ్మకాలనీలో ఓ వ్యక్తి భవనం నిర్మిస్తున్నాడు. బంజారాహిల్స్‌లో నివసించే ఏసు(40) టైల్స్ వేస్తున్నాడు. ఆదివారం ఉదయం భవనం మూడో అంతస్తులో పని చేస్తూ కింద పడిపోయి.. అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి హత్య

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: స్థిరాస్తి వ్యాపారి దారుణ హత్యకు గురైన ఘటన ఫలక్‌నుమా పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ రాజేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వట్టేపల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మహబూబ్ అలీ (50) ఆదివారం రాత్రి తన ఇంటికి సమీపంలో ఉన్న అల్మాస్ హోటల్ ముందు కూర్చుని ఉన్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై దాడిచేసి కత్తులతో పొడిచి పరారయ్యారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మహబూబ్ అలీని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు

ప్రజాస్వామ్య పరిరక్షణకు దారి చూపిన జెన్‌జీ పోరాటం



మాట్లాడుతున్న ప్రొ.నాగేశ్వర్. చిత్రంలో మమత, కిరణ్, నాగరాజు, ఐషీ ఘోష్, రజనీకాంత్, అశోక్‌రెడ్డి

నల్లకుంట, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్య పరిరక్షణకు దారి చూపిన పోరాటం జెన్‌జీ పోరాటం అని ప్రొ.నాగేశ్వర్ అన్నారు. ఇటీవల దిల్లీ జంతర్‌మంతర్ వద్ద పోరాటం ఉద్యమకారులకు స్ఫూర్తిదాయకం, చారిత్రాత్మకమన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రలో జరిగిన 'జెన్ జీ పోరాటం-ఒక పరిశీలన' అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే పేపరు లీకేజీలు, పరీక్షల నిర్వహణలో అవకతవకలు, నిరుద్యోగం వంటి సమస్యలపై ప్రభుత్వాలు బాధ్యత వహించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్ మాట్లాడుతూ.. . దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు కేవలం వ్యక్తిగత సమస్యలు కావని, ప్రభుత్వ విధానాలతో ముడిపడి ఉన్నాయని చెప్పారు. విద్య కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ వైపు నడిపించే విధానాలను వ్యతిరేకిస్తూ మరిన్ని ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మమత, కిరణ్, అశోక్‌రెడ్డి, శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు సుమ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కింద మంటలు.. పైఅంతస్తుల్లో జనం

- 6 కార్లు, 3 ద్విచక్రవాహనాలు దగ్ధం
- 15 మందిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



పూర్తిగా దగ్ధమైన కార్లు



నివాసితులను బయటకు తీసుకొస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది



తగలబడుతున్న వాహనాలు

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: అర్ధరాత్రి వేళ అందరూ భవనం పైఅంతస్తుల్లో నిద్రపోగా కింద మంటలు ఎగసిపడ్డాయి. దట్టమైన పొగ 5 అంతస్తులను కమ్మేసింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరి భవనంలోని వాళ్లందరినీ సురక్షితంగా బయటకు తీసుకురావడంతో పెను ముప్పు తప్పింది. జూబ్లీహిల్స్ హుడా ఎన్‌క్లేవ్‌లోని శంశీరామ్స్ జ్యోతి డ్వెల్లింగ్ అపార్ట్‌మెంట్‌లో శనివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. భవనం స్టిల్ట్ ఫ్లోర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే 6 కార్లు, 3 ద్విచక్రవాహనాలు బుగ్గయ్యాయి. మంటలు ఎగసిపడటం, పొగ భవనాన్ని కమ్మేయడంతో నివాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందగానే ఫిల్మ్‌నగర్ అగ్నిమాపక శాఖ అధికారి పి.రమేశ్, అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.భానుప్రతాప్ అగ్నిమాపక బృందాలతో అక్కడికి చేరుకున్నారు. మంటలను ఆర్పుతూనే భవనంలో ఉన్న 15 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగినట్లు తెలిపారు.

ట్రేడింగ్‌లో లాభాల పేరిట రూ.2.20 కోట్ల బురిడీ

ఈనాడు- హైదరాబాద్: టెలిగ్రామ్‌లో పరిచయమై ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించిన సైబర్‌నేరగాళ్లు ఓ ప్రైవేటు ఉద్యోగి నుంచి రూ.2.20 కోట్లు కాజేశారు. బాధితుడి ఫిర్యాదుతో మల్కాజిగిరి సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. కేసు వివరాలివీ.. నగరంలోని కాప్రాకు చెందిన ప్రైవేటు ఉద్యోగి మల్లికార్జునరావు ఫోన్ నంబరును గుర్తుతెలియని వ్యక్తులు ఇటీవల టెలిగ్రామ్ గ్రూపులో యాడ్ చేశారు. అనిత అనే పేరుతో పరిచయం చేసుకున్న మహిళ వర్ష క్యాపిటల్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మించారు. నిజమని భావించిన ఉద్యోగి జూన్ 16వ తేదీన యాప్ డౌన్‌లోడ్ చేసుకుని రూ.10 వేలు బదిలీ చేయగా లాభం వచ్చింది. అనంతరం రూ.లక్ష పంపారు. దీనికీ లాభాలు రావడంతో దశలవారీగా ఆగస్టు 27వ తేదీ వరకు మొత్తం రూ.2.20 కోట్లు బదిలీ చేశారు. ఇందుకు రూ.22 కోట్ల లాభం వచ్చినట్లు యాప్‌లో చూపించారు. విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా అదనంగా రూ.1.5 కోట్లు పంపించాలని మెలిక పెట్టారు. ఎన్నిసార్లు అడిగినా వేర్వేరు కారణాలు చెప్పడంతో మోసపోయానని తెలుసుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

నకిలీ పత్రాలు, ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్టు



కుత్బుల్లాపూర్: యజమానుల సంతకాలు ఫోర్జరీ చేసి, నకిలీ పత్రాలతో రూ.4.2 కోట్ల విలువచేసే రెండు ప్లాట్లు విక్రయించిన మోసగాడిని సూరారం పోలీసులు అరెస్టుచేశారు. సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన బాలకృష్ణమూర్తి, మహాలక్ష్మిలకు బౌరంపేటలోని సతీష్‌సొసైటీలో రెండు ప్లాట్లు(600 చదరపు గజాలు) ఉన్నాయి. వాటిని ఇటీవల చింతల్‌కు చెందిన బేతి శ్రీనాథ్‌కు విక్రయించారు. రిజిస్ట్రేషన్ కోసం కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించుకోగా అప్పటికే ఆ స్థలం మరో వ్యక్తి పేరున రిజిస్ట్రేషన్ అయి ఉండటంతో పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై కృష్ణ కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కూకట్‌పల్లిలోని వివేకనందానగర్‌కు చెందిన **కన్నెకంటి శ్రీనివాసరావు** సంబంధిత ప్లాట్లకు మూడు నెలల క్రితం ఫోర్జరీ సంతకాలు, నకిలీ స్టాంపులతో వ్యాలిడేషన్ పత్రాలు సృష్టించి తనకు పరిచయం ఉన్న వసుంధ అనే మహిళ పేరున రిజిస్ట్రేషన్ చేశాడు. ఆ తరువాత శ్రీనివాస్‌బాబు అనే మరో వ్యక్తి సహాయంతో నెల రోజుల క్రితం ప్లాట్లను అజయ్ అనే వ్యక్తికి విక్రయించాడు. గతంలో కూడా ఇతనిపై చేవెళ్ల, దుండిగల్, నార్సింగ్ ఠాణాల్లో కేసులున్నట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు.

కిడ్నీ ఆరోగ్యంపై లూపస్ దాడి!

- చాపకింద నీరులా లూపస్ నెఫ్రైటిస్
- 90 శాతం బాధితులు మహిళలే



ఈనాడు, హైదరాబాద్: మహిళల్లో లూపస్ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. అవగాహన లేకపోవడంతో కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు అధ్యయనంలో తేలింది. ఈ వ్యాధి ముదిరి చివరికి లూపస్ నెఫ్రైటిస్‌కు దారి తీస్తోంది. చాలామంది మహిళలు ఈ సమస్య ఉన్నట్లు గుర్తించలేరు. చివరికి కిడ్నీల వైఫల్యంతో వైద్యులను సంప్రదిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ తన సొంత కణజాలాలపై దాడి చేసే ఆటో ఇమ్యూన్ రుగ్మతనే లూపస్. ఇది ఆర్థరైటీస్‌లో ఒక రకం తీవ్రమైన అనారోగ్య సమస్య. రాజధానిలోని ప్రధాన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నిర్వహించిన అధ్యయనాలు లూపస్ తీవ్రతను చాటుతున్నాయి. బాధితుల్లో 80-90 శాతం మహిళలే. ఈ వ్యాధి కారణంగా ఎలాంటి ముందస్తు లక్షణాలు, హెచ్చరిక లేకుండానే కిడ్నీలను దెబ్బతీసే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. గతంలో ఉస్మానియా ఆసుపత్రి ఆధ్వర్యంలో 144 మంది లూపస్ నెఫ్రైటిస్ రోగులపై పరిశీలన చేయగా.. 45.8 శాతం మంది రోగులు కిడ్నీల సమస్యతో బాధపడుతున్నట్లు తేలింది. వీరిలో కిడ్నీ లూపస్ నాలుగో దశలో ఉన్నట్లు బయాప్సీలో వెల్లడైంది. మరో 29.1 శాతం మందిలో కిడ్నీ పనితీరు అత్యంత వేగంగా క్షీణిస్తున్నట్లు వైద్యులు గుర్తించారు. లూపస్ వ్యాధి వల్ల ఆటో యాంటీబాడీలు తయారై రక్తంలో కలుస్తాయి. ఇవి కిడ్నీల్లోని రక్తాన్ని శుద్ధి చేసే అతిసన్నని నాళాలను దెబ్బతీస్తాయి. దీంతో అక్కడ తీవ్రమైన వాపు, ప్రోటీనూరియా మూత్రం ద్వారా బయటకు పోయి క్రమంగా కిడ్నీలు పనిచేయడం మానేస్తాయి.

ఈ సంకేతాలు ఉంటే..



ముక్కు, చెంపలు, ముఖంపై సీతాకోక చిలుక ఆకారంలో ఎర్రటి దద్దుర్లు రావడం, మూత్రంలో నురుగు, చీలమండలు, పాదాల్లో వాపు, తరచూ అలసట, దీర్ఘకాలిక కీళ్ల నొప్పులు, జుట్టు విపరీతంగా రాలడం, నోట్లో పుండ్లు ఏర్పడతాయి. ఈ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. ఒక్కసారి లూపస్ వ్యాధికి చికిత్సలు ప్రారంభిస్తే.. మళ్లీ వైద్యుల సూచనలు లేకుండా మందులను సొంతంగా ఆపేయకూడదు.

తొలి దశలోనే గుర్తిస్తే ముప్పు నివారించవచ్చు



– డాక్టర్ సీరపాణి గోపాలుని, సీనియర్ నెఫ్రాలజిస్టు, అపోలో

లూపస్‌ను గుర్తించేందుకు సాధారణ రక్త, మూత్ర పరీక్షలు సరిపోతాయి. స్టెరాయిడ్లు, మైకోఫెనోటేల్, సైక్లోఫాస్ఫమైడ్ వంటి మందులను తొలిదశలో వాడటం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. ముందుజాగ్రత్తగా సంవత్సరానికి ఒకటి లేదా రెండుసార్లు మూత్రంలో ప్రోటీన్ లీకేజీ పరీక్షలు, రక్తంలో క్రియాటిన్ పరీక్షలు చేయించుకోవాలి. ఎండ తీవ్రత వల్ల లూపస్ తీవ్రత పెరుగుతుంది. రోజూ 30 నిమిషాలు వ్యాయామం, సమతుల ఆహారం, నిద్ర, తగినన్ని నీళ్లు తాగాలి.

ఏమైపోయారో..!

బీడీసీఆర్ విశ్రాంత ఏఎస్ఎం కుటుంబంలో అనిశ్చితి

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) రైల్వే అసిస్టెంట్ స్టేషన్ మేనేజర్‌గా పని చేసిన కనకస్వామి కుటుంబంలోనూ నేపాల్ విషాదం చోటుచేసుకుంది. అతను ఇక్కడ విధులు నిర్వర్తించినప్పుడు మేదరబస్తీలో ఉన్నా.. కొంతకాలంగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వేర్వేరు ఘటనల్లో ఇద్దరు కుమారులను కోల్పోయిన అతనికి మిగిలింది కూతురు మాత్రమే. ఇటీవల నేపాల్‌లో సంభవించిన అనుకోని ఉపద్రవం ఆ కాస్త ఆసరాను తుడిచిపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న నేపాల్ ఘటనలో కనకస్వామి కూతురు దీప్తి, అల్లుడు శ్రీధర్, మనువడు అభినవ్ ఆచూకీ తెలియడం లేదనే ప్రచారంపై స్పష్టత కొరవడింది. కొన్ని రోజులుగా వారి సెల్‌ఫోన్ల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో వారు ఏమైపోయారో అనే ఆవేదన ఆ కుటుంబాన్ని విషాదంలో నింపింది. బీడీసీఆర్‌లో పని చేసిన నేపథ్యంలో ఆ వార్త దావానంలా వ్యాపించడంతో రైల్వే ఉద్యోగుల్లో సానుభూతి వ్యక్తం అవుతోంది. ముగ్గురు సంతానం కలిగిన కనకస్వామి ఇద్దరు వారసులను కోల్పోయి అల్లుడు శ్రీధర్‌ని కొడుకులా భావించి విశ్రాంత జీవితాన్ని హైదరాబాద్‌లో సాగిస్తున్న క్రమంలో మానస సరోవర్ యాత్రకు వెళ్లిన వారి ఆచూకీపై ఎలాంటి స్పష్టమైన సమాచారం అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య

ముందే వాట్సప్‌లో స్నేహితులకు సమాచారం



అంబర్‌పేట, న్యూస్‌టుడే: ప్రేమ వైఫల్యంలో ఉరేసుకుని ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. తాను చనిపోతున్నట్లు స్నేహితులకు వాట్సప్‌లో సమాచారం పంపించారు. ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం... నగరంలోని పెట్లబుర్జులో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న **నిభాష్** (25) తిరుమలనగర్‌లో నివాసం ఉంటున్నారు. అతను ఒక యువతిని ప్రేమించారు. ఆమె కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించారు. శనివారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వాట్సప్ సమాచారంతో ఆందోళనకు గురైన అతని స్నేహితులు పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం ఉదయం ఘటనా ప్రాంతానికి చేరుకోగా అతను అప్పటికే చనిపోయారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



ఆందోళన కాదు.. కూలి కోసం నిరీక్షణ

ఈ చిత్రాన్ని చూసి ఏదైనా డిమాండ్‌తో రోడ్డుపై ధర్నా చేస్తున్నారనుకుంటే పొరపాటు పడ్డట్టే. వీరంతా ఇతర రాష్ట్రాలకు చెందిన భవన నిర్మాణ కూలీలు. నిత్యం ఉదయం టోలీచౌకి చౌరస్తాకు చేరుకుని కూలి పనుల కోసం ఎదురు చూస్తుంటారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు కూడా ఇంకా పనికోసం ఎవరైనా తీసుకెళ్తారేమో అని నిరీక్షిస్తున్నారిలా.

–ఈనాడు, హైదరాబాద్

చికెన్ ధరలు			
ఫాంరేటు	117–00	డ్రెస్డ్	223–00
రిటైల్	144–00	స్కిన్‌లెస్	252–00

నేడు 'భారత్‌కో జానో' రాతపరీక్ష

తెలంగాణలో లక్ష మంది విద్యార్థుల భాగస్వామ్యం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: దేశ చరిత్ర, సంస్కృతి, విశిష్టతలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక 'భారత్‌కో జానో' జనరల్ నాలెడ్జ్ రాతపరీక్ష నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా సుమారు కోటి మంది ఈ పరీక్ష రాయనున్నారు. తెలంగాణలోని తమ 21 శాఖల పరిధిలో దాదాపు లక్ష మంది విద్యార్థులతో ఈ పరీక్షను ఒకేరోజు, ఒకే సమయంలో (ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు) నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్ర కృష్ణ పసుపులేటి, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ తెలిపారు. ఈ పరీక్షను జూనియర్ (6, 7, 8 తరగతులు), సీనియర్ (9, 10, ఇంటర్) విభాగాలుగా విభజించి నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో చిన్నతనం నుంచే దేశభక్తి, జాతీయ చైతన్యం, భారతీయ సంస్కృతి పట్ల గౌరవభావాన్ని పెంపొందించి బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ పరీక్షను విజయవంతం చేయడంలో పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

తేదీ మరచి.. పరుగున వచ్చి..



మేడ్చల్ జిల్లా కీసర సమీపంలోని ఓ పరీక్ష కేంద్రంలో ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సిన నీట్ పీజీ పరీక్ష సందర్భంగా హాల్‌లోకి అనుమతించే చివరి సమయం 8.30 కావడంతో సిబ్బంది గేటు వేసేశారు. తాళం వేస్తుండగా హాల్‌టికెట్, ఆధార్ కార్డుతో ఓ యువకుడు పరుగున వచ్చాడు. బయట వేచి ఉన్న వారంతా అయ్యో.. ఈ యువకుడు పరీక్ష రాసే అవకాశం కోల్పోతాడేమో.. అని ఆందోళన చెందారు. ఇంతలో సిబ్బంది గేటు తీసి అతన్ని లోపలికి అనుమతించటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కానీ 5 నిమిషాల్లోనే ఆ యువకుడిని సిబ్బంది బయటకు గెంటేయడంతో అక్కడున్న వారంతా ఏమైందని ప్రశ్నించగా 'నా పరీక్ష రేపు ఉంది.. తేదీ చూసుకోలేదు.. అంటు నవ్వుతూ వెళ్లిపోయాడు.

- ఈనాడు, హైదరాబాద్

46 కి.మీ. రోడ్డులో 30 మలుపులా? : కిషన్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి

చేవెళ్ల, న్యూస్‌టుడే: 46 కి.మీ. రోడ్డులో 30 మలుపులా.. ఈ తరహా జాతీయ రహదారి నిర్మాణం మరెక్కడా లేదంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్ వద్ద బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు అలైన్‌మెంట్ సరిగ్గాలేదని వ్యాఖ్యానించారు. జాతీయ రహదారిని ఇన్ని మలుపులతో నిర్మిస్తే ప్రమాదాలు జరగవా. . వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని రోడ్డు నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సూచించారు. ఎన్‌జీటీ కేసు వల్ల రోడ్డు నిర్మాణం మూడేళ్లు ఆలస్యమైందన్నారు. కొత్తగా నిర్మిస్తున్న రోడ్డును పది అడుగుల ఎత్తుగా నిర్మిస్తుండటం, సర్వీసు రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని భాజపా పట్టణ అధ్యక్షుడు అనంతరెడ్డి కేంద్రమంత్రి దృష్టికి తెచ్చారు. రోడ్డు విస్తరణకు భూములిచ్చిన రైతులకు వారి పొలాల్లోకి వెళ్లడానికి దారిలేకుండా పోయిందన్నారు. సర్వీసు రోడ్డు నిర్మాణానికి అదనంగా మరో 10 మీటర్ల భూ సేకరణ చేయాల్సి ఉంటుందని అధికారులు సమాధానమిచ్చారు. సమస్య లేకుండా చూడాలంటూ కిషన్‌రెడ్డి ఆదేశించారు. బీజాపూర్ రహదారి పనులపై త్వరలో సంబంధితశాఖల అధికారులతో సమీక్షిస్తానని తెలిపారు.

భారతీయ చరిత్రకు సరికొత్త కోణం 'హరప్పా'



పుస్తక పరిచయం చేస్తున్న చినవీరభద్రుడు ⊙ చర్చలో మాట్లాడుతున్న రచయిత సాయి పాపినేని. చిత్రంలో ప్రసాద్ సూరి, ఆదిత్య అన్నా వజ్ఝల

ఈనాడు, హైదరాబాద్: ఛాందసవాదుల నమ్మకాలు, పాశ్చాత్య చరిత్రను నమ్మే ఉదారవాదుల సిద్ధాంతాలను కాదని రచయిత సాయి పాపినేని 'హరప్పా నాగరిత'ను కళ్లుగా చేసుకుని భారతీయ చరిత్రను కొత్త కోణంలో చూపించారని రచయిత వాడ్రేవు చినవీరభద్రుడు అన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయి పాపినేని రచించిన 'హరప్పా(మన పురాణాలలో హరప్పా చరిత్ర)' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా వాడ్రేవు చినవీరభద్రుడు పుస్తకాన్ని పరిచయం చేస్తూ..'మన పురాణాలు, చరిత్ర.. పర్యావరణ, భూగోళ, జన్యు, భాషా శాస్త్రాలను తాజా అధ్యయనాలతో పోల్చి, అందులో నుంచి చారిత్రక వాస్తవాలను వెలికి తీయడానికి చేసిన ప్రయత్నమే ఈ పుస్తకం. రామాయణం, మహాభారతం ఏయే కాలాల్లో జరిగి ఉంటాయో నిర్ధారించేందుకు రచయిత ఎంతో పరిశోధన చేశారు. పురాణాల్లోని ప్రతి ఘట్టం తాలూకు కాలాన్ని శాస్త్రీయ ఆధారాలతో నిర్దేశించే ప్రయత్నం ఇందులో కనిపించింది' అని వివరించారు. అంతకుముందు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత ప్రసాద్ సూరి, తెలుగు కలెక్టివ్ కోఫౌండర్ ఆదిత్య అన్నా వజ్ఝల, రచయిత సాయి పాపినేని పుస్తకంపై చర్చించారు. అనంతరం హరప్పా మొదటి, మధ్య, తుది దశలపై ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు.

ముగిసిన అత్యాపత్య రాష్ట్ర స్థాయి పోటీలు



రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలురలో విజేత హైదరాబాద్ జిల్లా జట్టుకు అందజేస్తున్న ట్రోఫీ..



ద్వితీయ స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్టుకు అందజేస్తున్న ట్రోఫీ..

నిర్మల్ అర్బన్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అత్యాపత్య అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో హైదరాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలవగా, బాలికల్లో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాలురలో రంగారెడ్డి(ద్వితీయ), తృతీయ స్థానంలో నాగర్‌కర్నూల్, సంగారెడ్డి జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో నిర్మల్(ద్వితీయ), తృతీయ స్థానంలో రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు నిలవగా. . క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. అతిథులుగా శేఖర్, లక్ష్మణ్, పోశెట్టి, బ్రహ్మయ్య, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి భూమన్న, సంజీవ్ హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరులో జమ్ముకశ్మీర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో హాజరుకానున్నారని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు.

ఆలయాల్లో వ్యర్థాలు.. సంపదకు మార్గాలు


పట్టించుకోని దేవాదాయశాఖ

ఈనాడు, హైదరాబాద్

నగరంలోని ప్రధాన ఆలయాల్లో భక్తులు శ్రద్ధ, పవిత్ర భావంతో సమర్పించే పూలు, ప్రసాదాలు, నివేదనలు ఆలయ ప్రాంగణాల్లో ఆధ్యాత్మిక శోభను నింపుతున్నాయి. ప్రత్యేక మాసాల్లో వచ్చే టన్నులకొద్దీ పూలు, ఇతర వస్తువుల వ్యర్థాలు సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. వీటితో సంపదను సృష్టించుకునే అవకాశం ఉన్నా దేవాదాయశాఖ పట్టించుకోవడం లేదు.

• బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో సాధారణ రోజుల్లో 15వేల నుంచి 20వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. పండగ రోజుల్లో ఈ సంఖ్య లక్షకుపైనే ఉంటుంది. సగటున రోజూ ఒక టన్ను వ్యర్థాలు పోగవుతుంటాయి. పండగ రోజుల్లో ఇది 5 టన్నులకు చేరుకుంటుంది.

• జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయంలో సాధారణ రోజుల్లో సగటున 15 వేల మంది.. పండగ రోజుల్లో లక్ష మంది అమ్మవారిని దర్శించుకుంటారు. ఇక్కడ రోజూ 400 కిలోల నుంచి 800 కిలోల దాకా పూలు, కొబ్బరి వ్యర్థాలు ఉంటాయి. కొబ్బరి పీచు, ప్లాస్టిక్ ప్యాకేజింగ్ సంచులు ఇక్కడ ప్రధాన పొడి వ్యర్థాలుగా మారుతున్నాయి.



ప్రసాదాల కవర్లు, అరటి తొక్కల వ్యర్థాలు

• సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో నిత్యం 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. రోజూ 600 కిలోల నుంచి 1.2 టన్నుల వ్యర్థాలు తయారవుతాయి.

ఏం చేయాలి..: ఆలయాల వద్దే వర్మి కంపోస్ట్ కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా రోజువారీ పూల వ్యర్థాలను అక్కడికక్కడే ఎరువుగా మార్చొచ్చు. దీంతో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డులపై భారం తగ్గుతుంది.

• కొన్ని అంకుర సంస్థలు ఆలయాల నుంచి పూలను సేకరించి అగర్‌బత్తీలు, ధూప్‌స్టిక్స్ తయారు చేస్తున్నాయి. వీటి సహాయంతో రీసైక్లింగ్ సులభమవుతుంది. • ఆలయాల వద్ద ఉన్న కౌంటర్లు, పూల దుకాణాల వద్ద బయోడీగ్రేడబుల్ కవర్లను తప్పనిసరి చేయాలి.

ఇతర ఆలయాల్లో ఇలా..

• మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీ మహాకాళేశ్వర్ ఆలయంలో నిత్యం టన్నుల కొద్దీ పోగయ్యే బిల్వపత్రాలు, పూలమాలలను ప్రాసెస్ చేయడానికి ఆలయ పరిధిలోనే భారీ కంపోస్టింగ్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా తయారయ్యే సేంద్రియ ఎరువును ప్యాక్ చేసి రైతులు, భక్తుల ఇంటి తోటల కోసం తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. • ముంబయి సిద్ధి వినాయక ఆలయంలో సమర్పించే బంతిపూల నుంచి దుస్తుల పరిశ్రమకు ఉపయోగపడే సహజ రంగులు తయారు చేస్తున్నారు.

• తిరుమలలో శ్రీవారికి, పద్మావతి అమ్మవారికి సమర్పించే టన్నులకొద్దీ పూలమాలలను రీసైక్లింగ్ చేసి అగర్‌బత్తీలుగా మార్చి భక్తులకు విక్రయిస్తున్నారు. • విజయవాడ దుర్గమ్మ గుడిలో కూడా 8 రకాల అగర్‌బత్తీలు, ధూప్‌స్టిక్స్ తయారు చేస్తున్నారు. దీంతో ఆలయానికి అదనపు ఆదాయం రావడంతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతోంది.

కార్యరూపం దాల్చలేదు

రోజూ పోగయ్యే పూలను భక్తులకే పంచి పెడుతున్నాం. మిగిలిన వ్యర్థాలు సాధారణ చెత్తతో పాటే పంపుతున్నాం. రీసైక్లింగ్‌కు సంబంధించి గతంతో కొన్ని అంకుర సంస్థలు సంప్రదించాయి. కానీ అది కార్యరూపం దాల్చలేదు. – శ్రీనివాసరాజు, ఈవో, పెద్దమ్మ ఆలయం, జూబ్లీహిల్స్.

పుణ్యక్షేత్రాలకు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైలు

విజయవాడ, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రాలకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం భారత్ గౌరవ్ టూరిస్ట్ ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ ప్రాంతీయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అయోధ్య, కాశీ, బైద్యనాథ్ ధామ్ పేరుతో మొత్తం 10 పగళ్లు, 9 రాత్రులతో గల ఈ ప్యాకేజీలో రైలు అక్టోబరు 24న సికింద్రాబాద్ నుంచి బయల్దేరుతుంది. విజయవాడ, గుడివాడ, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని మీదగా పూరీ జగన్నాథ ఆలయం, కోణార్క్ సూర్య దేవాలయం, బైద్యనాథ్ ఆలయం, వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయం, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణ ఆలయాలు, సాయంత్రం గంగా హారతి, అయోధ్యలో రామజన్మభూమి, హనుమాన్ ఆలయం, సరయూ నది హారతి, ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించి రైలు నవంబరు 2వ తేదీ తిరుగు ప్రయాణం అవుతుంది. టీ, టిఫిన్, భోజనం, రవాణా, హోటల్ గదులు, ఇన్సూరెన్స్‌తో కలిపి టికెట్ ధర ఒక్కొక్కరికీ స్లీపర్ తరగతిలో రూ.17వేలు, థర్డ్ ఏసీలో రూ.26,400, సెకెండ్ ఏసీలో రూ.34,400 ఉంటుంది. టికెట్ల బుకింగ్ ఇతర వివరాల కోసం ఫోన్ నంబరు 92810 30714లో సంప్రదించాలని కోరారు.



ఆది దేవుడి ఆగమనం.. అదిరందయ్యా

వినాయక చవితి రోజున ప్రతిష్ఠించడానికి తీసుకొస్తున్న లంబోదరుడిని ఆహ్వానిస్తూ సీతాఫల్‌మండిలో శనివారం అర్ధరాత్రి తర్వాత నిర్వహించిన వినాయక 'ఆగమనం' శోభాయాత్ర వైభవంగా సాగింది. రంగురంగుల విద్యుత్ దీపాలు, బాణసంచా కాంతులు, డప్పు వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కనులవిందుగా సాగింది. సీతాఫల్‌మండి నుంచి వారాసిగూడ ప్రధాన రహదారి మీదుగా సాగిన ఈ యాత్రకు భక్తులు భారీగా తరలివచ్చారు. జై గణేశా అంటూ నామస్మరణ చేస్తూ తమతమ సెల్‌ఫోన్లలో యాత్రను బంధించారు. –ఈనాడు, హైదరాబాద్

రాజేంద్రనగర్ ఎంఐఎం ఇన్‌ఛార్జిగా ఎమ్మెల్యే ముబీన్



అబిడ్స్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఎంఐఎం పార్టీ ఇన్‌ఛార్జిగా బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్‌ను నియమిస్తూ ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పార్టీ అధికార ప్రతినిధి అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రెహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరించిన నేపథ్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ముబీన్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. మీర్జా రెహ్మత్ బేగ్ బహిష్కరణ అనంతరం రాజేంద్రనగర్ పార్టీ వ్యవహారాలకు కొత్త ఇన్‌ఛార్జిని నియమించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

ట్రాఫిక్ చిక్కుల్లో విద్యార్థి.. పరీక్ష కేంద్రానికి చేర్చిన పోలీసులు



ప్యాట్రోలింగ్ వాహనంలో వికాస్‌ను కేంద్రానికి తీసుకెళ్తున్న పోలీసులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: నీట్ పీజీ పరీక్ష రాసేందుకు బయలుదేరి ట్రాఫిక్‌లో చిక్కుకున్న ఓ విద్యార్థిని రాయదుర్గం పోలీసులు తమ వాహనంలో పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. కొంపల్లికి చెందిన వికాస్ ఆదివారం ఉదయం నీట్ పీజీ పరీక్ష రాసేందుకు తండ్రి ప్రవీణ్‌తో కలిసి షేక్‌పేట జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలోని కేంద్రానికి కారులో ఓఆర్ఆర్ మీదుగా బయలుదేరారు. గచ్చిబౌలి ఫ్లైఓవర్ సమీపంలో మారథాన్ నేపథ్యంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. దీంతో వారు స్థానిక పోలీసుల సాయం కోరారు. స్పందించిన రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ భూపతి, ట్రాఫిక్ రాణా ఆర్ఐ హన్మిరెడ్డిలు ప్యాట్రోలింగ్ వాహనం ఏర్పాటు చేశారు. సకాలంలో కేంద్రానికి తీసుకెళ్లి, పరీక్ష రాసేలా చూశారు.

ఎన్‌హెచ్-65పై వాహనాల రద్దీ



అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద హైదరాబాద్ వైపు వాహనాల వరుస

అబ్దుల్లాపూర్‌మెట్: రాఖీ పండగతో పాటు వారాంతపు సెలవులు కలిసి రావడంతో శుక్రవారం స్వగ్రామాలకు వెళ్లిన నగరవాసులు.. ఆదివారం మధ్యాహ్నం నుంచి తిరుగు ప్రయాణం కావడంతో ఎన్‌హెచ్ 65పై నగరం వైపు మార్గం రద్దీగా మారింది. పండగలు, వరుస సెలవుల ప్రారంభం రోజు హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 65)పై సొంతూళ్లకు వెళ్లే వారితో విజయవాడ మార్గం.. సెలవులు ముగిసే రోజు హైదరాబాద్ వైపు మార్గంలో వేల కార్లు, ఇతర వాహనాల వరుస కట్టి ప్రయాణిస్తుండటంతో రద్దీగా మారుతోంది. దీనికి తోడు ఎన్‌హెచ్ 65 విస్తరణ పనులు హైదరాబాద్ శివారు కొత్తగూడెం నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వరకు మాత్రమే జరిగి.. ప్రధాన కూడలి ప్రాంతంలో అసంపూర్తిగా ఉండటం, అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి నగరం దిశగా రెండు వైపులా సర్వీస్ రోడ్లను పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో ఈ ప్రాంతం నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది.

సుపరిపాలనతోనే గ్రామాభివృద్ధి: సీతక్క



గోడపత్రిక ఆవిష్కరణలో మంత్రి సీతక్క, బ్రహ్మకుమారి ప్రతినిధులు

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: సమాజ అభివృద్ధికి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కీలకమని, విలువలతో కూడిన సుపరిపాలన ద్వారానే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని మంత్రి సీతక్క అన్నారు. సర్పంచులు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి విభాగం అధికారుల కోసం బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ శిక్షణకు సంబంధించిన గోడ పత్రికను ఆదివారం గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'సు-శాసనం ద్వారా గ్రామ స్వరాజ్యం వైపు' అనే థీమ్‌తో రూపొందించిన శిక్షణ కార్యక్రమం ద్వారా గ్రామీణ పాలనను మరింత బలోపేతం అవుతుందన్నారు. సర్పంచుల్లో, అధికారుల్లో నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి శిక్షణ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శాంతి సరోవర్ డైరెక్టర్ కుల్‌దీప్, ప్రతినిధులు అంజలి, అరుంధతి, వంశీధర్ పాల్గొన్నారు.

గిడుగు పురస్కారాల ప్రదానం



ప్రశంసాపత్రం ఇస్తున్న టీడీ.జనార్దన్, బిక్కి కృష్ణ

నల్లకుంట, న్యూస్‌టుడే: గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్, శంకర్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో గిడుగు జాతీయ పురస్కారాలు అందజేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో భాషా, సేవా, కళారంగాల్లో కృషి చేసిన సుమారు 75 మందికి పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా తెదేపా జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ టీడీ.జనార్దన్ పాల్గొని ప్రతిభావంతులకు శాలువా కప్పి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. కవి డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎలమంచి ధనలక్ష్మి, జీవన్‌లాల్, జల్లి విద్యాధర, సీతాలక్ష్మి, డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ ఎలిపి రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆగాఖాన్ ట్రస్టుకు కుతుబ్‌షాహీ టూంబ్స్

పునరుద్ధరణ పనులతో పాటు నిర్వహణ బాధ్యతల అప్పగింత

గోల్కొండ, న్యూస్‌టుడే

చారిత్రక కుతుబ్‌షాహీ టూంబ్స్ (కుతుబ్‌షాహీ హెరిటేజ్ పార్క్) నిర్మాణాల పునరుద్ధరణ పనులతో పాటు నిర్వహణ బాధ్యతలను ఇకపై ఆగాఖాన్ ట్రస్టు చేపట్టనుంది. దీనికి సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ, ఆగాఖాన్ ట్రస్ట్, కులీకుతుబ్‌షా అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీలు పది సంవత్సరాల కాలపరిమితికి ఎంఓయూ కుదుర్చుకున్నట్లు సమాచారం. ఆగస్టు 1 నుంచి హెరిటేజ్ పార్కు బాధ్యతలను ఆగాఖాన్ ట్రస్టు చేపట్టాల్సి ఉన్నా.. పేపర్‌వర్క్ పెండింగ్‌లో ఉండటంతో కొంత ఆలస్యమైనట్లు సమాచారం.

106 ఎకరాలు.. 100కు పైగా నిర్మాణాలు

చారిత్రక కుతుబ్‌షాహీ టూంబ్స్ 106 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇక్కడ ఏడు కుతుబ్‌షాహీ రాజుల టూంబ్స్‌లతో పాటు ఇతర నిర్మాణాలు 100కు పైగా ఉన్నాయి. ఇక్కడి నిర్మాణాల కన్జర్వేషన్, రిస్టోరేషన్ పనుల కోసం 2013లో ఆగాఖాన్ ట్రస్టు, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య పది సంవత్సరాల కోసం ఒప్పందం కుదిరింది. ఈ పనులు ఇంకా కొనసాగుతున్నాయి.

టూంబ్స్‌ను ఆనుకుని దక్కన్ పార్కు ఉంది. ప్రస్తుతం ఇందులో కేంద్ర నిధులతో ఎంటర్‌ప్రిటేషన్ సెంటర్ పనులు జరుగుతున్నాయి.



కొత్తగా ఏర్పాటు చేసిన టికెట్ కౌంటర్

చురుగ్గా సాగుతున్న పనులు

కుతుబ్‌షాహీ హెరిటేజ్ పార్కుతో పాటు దక్కన్ పార్కును ప్రభుత్వం ఆగాఖాన్‌ట్రస్టుకు కట్టబెడుతుండటంతో ఆగాఖాన్ ట్రస్టు దీనికి సంబంధించిన పనుల్లో నిమగ్నమైంది. ఇప్పటి వరకు టూంబ్స్, దక్కన్ పార్కుల్లోకి ప్రవేశించేందుకు రెండు చోట్ల టికెట్ తీసుకుంటున్నారు. ఇకమీదట రెంటికి కలిపి ఒకే టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయనున్నారు. దక్కన్ పార్కు ప్రవేశ ద్వారం వద్ద ఇప్పటికే టికెట్ కౌంటర్‌ను సిద్ధం చేశారు. ఇక్కడ కుతుబ్‌షాహీ హెరిటేజ్ పార్కు బోర్డును ఏర్పాటు చేస్తున్నారు. టూంబ్స్ నిర్వహణ బాధ్యతలను హెరిటేజ్ తెలంగాణ ఉద్యోగులు చూస్తుండగా.. దక్కన్ పార్కు నిర్వహణ బాధ్యతలను కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సిబ్బంది చూస్తున్నారు. టూంబ్స్‌లో శాశ్వత ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లోని సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది మొత్తం 31 ఉన్నారు.



కుతుబ్‌షాహీ టూంబ్

కాంట్రాక్ట్ విధానం రద్దు చేయాలి



సాంబశివరావుకు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

హిమాయత్‌నగర్: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని, ఈ పద్ధతుల్లో పని చేస్తున్న వారి కోసం వెంటనే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చాలీచాలని జీతాలిస్తూ శ్రమదోపిడీ చేస్తున్నారన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.నరసింహ, రామ రాజేశ్ ఖన్నా మాట్లాడుతూ.. కనీస వేతనాల కోసం 1195, 1190, 1187 జీవోలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈమేరకు సంఘం నాయకులు కూనంనేనికి వినతిపత్రాన్ని అందజేశారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ముషీరాబాద్: స్వాంతన ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కోర్సులను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ ప్రతినిధి శిరీష కోరారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పేద, మధ్యతరగతి యువత, నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. డేటా అనలిటిక్స్, ఏఐ టూల్స్, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, పవర్‌పాయింట్, ఏఐటూల్స్, బేసిక్ పైథాన్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్నెట్ పరిజ్ఞానం, ఇంగ్లీషు టైపింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 3 నెలలు కొనసాగే శిక్షణకు త్వరలో బ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయన్నారు. 18-27 ఏళ్ల యువత అర్హులన్నారు. వివరాలకు 8688914603లో కానీ, గంగపుత్ర కాలనీలోని ట్రస్టు కంప్యూటర్ శిక్షణకేంద్రంలో సంప్రదించాలని కోరారు.

ఎల్.బి.నగర్

•ఎల్.బి.నగర్ • మలక్‌పేట

బోనమెత్తి.. భక్తితో కొలిచి




నాగోలు, న్యూస్‌టుడే: నాగోలులో అమ్మవార్లకు ఆదివారం బోనాలు సమర్పించారు. మహంకాళి, పోచమ్మ, కట్టమైసమ్మ అమ్మవార్లతో పాటు బొడ్రాయికి బోనాలు సమర్పించారు. మహిళలు భారీగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం ఆధ్వర్యంలో ఆయా ఆలయాల కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ప్రత్యేక పూజలు చేశారు.

అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మహేశ్వరం: జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ల పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి శాంతిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 నుంచి సెప్టెంబరు 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. హయత్‌నగర్ పరిధిలో 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు.

మన్ కీ బాత్.. స్ఫూర్తిదాయకం: భాజపా



మోదీ ప్రసంగాన్ని తిలకిస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, నేతలు

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమం స్ఫూర్తిదాయకమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం హస్తినాపురంలో మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. 'దేశ ప్రగతి - ప్రజల భాగస్వామ్యం' సామాజిక బాధ్యత వంటి అంశాలపై స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని అందించారని పలువురు నేతలు పేర్కొన్నారు. ఇందులో భాజపా రాష్ట్ర ప్రధానకార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ రూరల్ ఇన్‌ఛార్జి సామ రంగారెడ్డితో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

చెరువుల చెర.. నీరు చేరేదెలా

• కబ్జాల తొలగింపు లేక బోసిపోతున్న జల వనరులు

• మురుగు నిండి.. దుర్వాసనతో తల్లడిల్లి

న్యూస్‌టుడే: మన్సూరాబాద్, ఎల్.బి.నగర్, కర్మన్‌ఘాట్

నగరంలోని చెరువులు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. ఉన్న వనరులు కాస్త మురుగుతో నిండిపోతున్నాయి. వర్షాలు పడినా చుక్కనీరు చేరేలా ఎక్కడా లేకుండా కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని 12 చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలు ఇంకా సాగుతున్నాయి. పాతవి తొలగించలేదు.. కొత్తవాటిని అడ్డుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో మురుగు చేరి.. దుర్వాసనతో సమీప కాలనీవాసులు తల్లడిల్లుతున్నారు. అయినా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడానికి ఎవరూ ప్రయత్నం చేయడం లేదు.



చిన్న చెరువులో వ్యర్థాలు

మాయమవుతున్నా.. అంతే

❖ మన్సూరాబాద్ డివిజన్‌లో పెద్ద చెరువు, చిన్న చెరువుల పరిరక్షణలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. హైడ్రా సిబ్బంది నలుగురు రెండు షిఫ్టుల్లో పర్యవేక్షణ చేసినా ఆక్రమణలను ఆపలేకపోయారు. కేవలం చెరువుల వద్ద హాజరు వేసుకొని, ఫొటోలకే పరిమితమవుతున్నారు. ❖ చిన్న చెరువులో ట్రాక్టర్లతో వ్యర్థాలు తెచ్చి పోస్తున్నారు. ఎగువన చంద్రపురికాలనీ నుంచి వచ్చే నాలాను మళ్లించడంతో చెరువులోకి వరద చేరడం లేదు. చుట్టూ ఉన్న కాలనీల్లో నిర్మించిన కాలువల ద్వారానే వరద వచ్చే అవకాశం ఉంది. వాటికి అడ్డంకులున్నాయి. ❖ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో గదులు నిర్మించినా అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ❖ పెద్ద చెరువులో వనస్థలిపురం వైపు నుంచి వచ్చే నాలా నుంచి వరదనీటితో పాటు మురుగు చేరుతోంది. సమీపకాలనీల్లో మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు చెరువులోకే వస్తోంది. ❖ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో పశువులు కట్టేసి, శ్మశాన వాటికల పేరుతో ఆక్రమిస్తున్నారు. కొందరు షెడ్లు వేశారు. 2016లో సుందరీకరణ పనులు చేసినా నామమాత్రంగానే ఉన్నాయి. ❖ **లేఖరాశాం.. అశోక్, సైట్ ఇన్‌ఛార్జి ఎన్‌టీడీ** కంచె తొలగించడంతో వ్యర్థాలు వాహనాల్లో తెచ్చి వేస్తున్నారు. కంచె నిర్మాణానికి రెవెన్యూ అధికారులకు లేఖ పెట్టాం. ఇకపై జరగకుండా చూడాలని హైడ్రాకు సమాచారమిచ్చాం. చిన్నచెరువు బఫర్‌జోన్‌లో ఆక్రమణలపై గతంలోనే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు లేఖ రాశాం.

పేరు	విస్తీర్ణం	ఎఫ్‌టీఎల్ ఆక్రమణ	నిర్మాణాలు	బఫర్ జోన్	ఆక్రమణ	నిర్మాణాలు
చిన్న చెరువు:	6.27 ఎకరాలు,	0	0	1.6 ఎకరాలు	0.3 ఎకరాలు	4
పెద్ద చెరువు:	29.17 ఎకరాలు	7.50 ఎకరాలు	49	9.82 ఎకరాలు	7.47 ఎకరాలు	52

మిగిలించి మూడున్నర ఎకరాలే..



పరిశీలన

బతుకమ్మకుంట ఇలా..

పేరు: బతుకమ్మకుంట చెరువు
డివిజన్: సాహెబ్‌నగర్
చెరువు విస్తీర్ణం: ఆరున్నరెకరాలు
ప్రస్తుతం ఉన్న విస్తీర్ణం: మూడున్నర ఎకరాలు

బతుకమ్మ చెరువు కబ్జాలకు గురైంది. ఉన్న చెరువును కాస్త చెరబట్టాలని ప్రయత్నిస్తే సమీప కాలనీల వాసులు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. మూడేళ్ల క్రితం పునరుద్ధరించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చెరువులో వ్యర్థాలు, చెత్త పడేస్తున్నారు.

ఇదీ పరిస్థితి: చెరువు కట్ట ఎత్తు తక్కువగా ఉండటంతో పాటు పూడిక పేరుకుపోయింది. కొంతనీరే నిలువ ఉంటోంది.

ఒకటి,రెండు వర్షాలకే చెరువు నిండిపోతోంది..

సాహెబ్‌నగర్‌లోకి వెళ్లేందుకు మధ్యలో మట్టి రోడ్డు ఉంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో కాలనీలు వెలిశాయి. చెరువు సుందరీకరణ జరిగితే వనస్థలిపురం వాసులకు మంచి తాటకం అందుబాటులోకి రానుంది. ఒకటి, రెండు వర్షాలకే చెరువు నిండిపోతోంది.

మురుగు వదిలి.. ఇబ్బందులు పెంచి



మురుగు చేరి నలుపుగా మారిన నీరు

మురుగు, వ్యర్థాలు చేరి బైరామల్‌గూడ చెరువు దుర్గంధం వెదజల్లుతోంది. ఎల్బీనగర్, మహేశ్వరం నియోజక వర్గాల్లోని బీఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం, హస్తినాపురం, మీర్‌పేట, జిల్లెలగూడ డివిజన్ల పరిధిలోని వందలాది కాలనీల నుంచి వచ్చే మురుగునీరు పోవడానికి రూ. కోట్లు పోసి బైరామల్‌గూడ చెరువు సమీపం నుంచి ప్రత్యేక ట్రంక్‌లైన్ నిర్మాణం చేపట్టారు. అయినా వ్యర్థాలు అడ్డుపడడంతో మురుగు నేరుగా చెరువులోకి వెళ్తోంది. చూసేందుకు నిండుకుండలా ఉన్నా.. అంతా మురుగునీరే.

• **చెరువు విస్తీర్ణం:** 6.14 ఎకరాలు, • **ఇన్నర్‌రింగ్ రోడ్డుకు:** ఎకరం, • **సాగర్‌రోడ్డుకు:** ఎకరం, • పై వంతెనకు అర ఎకరం, • **కబ్జా:** నివాసాలతో పాటు ఇతర నిర్మాణాలతో ఎకరం పోయింది.

సమస్య వీరికే..: కాకతీయ కాలనీ, శాతవాహననగర్, సాయినగర్, బైరామల్‌గూడ, సాగర్‌ఎన్‌క్లేవ్, రెడ్డి కాలనీ, మల్లికార్జుననగర్ కాలనీ వాసులు చెరువు నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు.

చేయూత దరఖాస్తులకు నేడే ఆఖరు

మలక్‌పేట, న్యూస్‌టుడే: చేయూత పెన్షన్ దరఖాస్తుల గడువు సోమవారం ముగియనుంది. నిరుపేదలు, వితంతువులు, దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బల్దియా మలక్‌పేట, మూసారాంబాగ్ సర్కిళ్ల కార్యాలయాల వద్ద సంబంధిత సమాచారంతో బ్యానర్లు ప్రదర్శించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

ఎల్బీనగర్	76759 19030
మలక్‌పేట	80085 73284
హయత్‌నగర్	98336 64897
కర్మన్‌ఘాట్	94400 32872
దిల్‌సుఖ్‌నగర్	93910 57113
చంచల్‌గూడ	80085 73307
నాగోల్	80085 73317
మన్సూరాబాద్	80089 02838
మూసారాంబాగ్	79933 00559
చైతన్యపురి	99663 56515

న్యూస్‌టుడే: హయత్‌నగర్, మన్సూరాబాద్, మూసారాంబాగ్, దిల్‌సుఖ్‌నగర్

? లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని శ్రీవెంకటేశ్వర కాలనీ కమాన్ వద్ద కంకరపరిచి రోడ్డు వేయలేదు.
–సురేందర్ రెడ్డి, శ్రీవెంకటేశ్వర కాలనీ

✓ గుత్తేదారుకు చెప్పి తొందరగా రోడ్డు వేయిస్తాం -శ్రీకాంత్, డీఈ ఆర్అండ్‌బీ, హయత్‌నగర్

? మన్సూరాబాద్ నుంచి జీఎస్ఐ వెళ్లేదారిలో వీధి దీపాలు వెలగడం లేదు.
–టి.రాజు, త్యాగరాయనగర్.

✓ పరిశీలించి మరమ్మతులు చేయిస్తా.
–యోగేందర్, సూపర్‌వైజర్, ఎంఎంసీ

? ఓల్డ్ మలక్‌పేట శ్రీపురం కాలనీలో మ్యాన్‌హోల్ నుంచి మురుగు రోడ్డుపైకి వస్తోంది. – రాజేశ్, శ్రీపురం కాలనీ

✓ తక్షణమే సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయిస్తాను – కృష్ణమోహన్, డీజీఎం, మూసారాంబాగ్ సర్కిల్

? గడ్డి అన్నారం డివిజన్ పరిధి గౌతమ్‌నగర్ కాలనీ విమల విహార్ అపార్ట్‌మెంట్ మలుపు వద్ద వీధి దీపం వెలగడం లేదు.
– పాండు, గౌతమ్‌నగర్.

✓ సిబ్బందిని పంపి మరమ్మతులు చేయిస్తాం. – సాయికుమార్, ఏఈ, వీధిదీపాల విభాగం, గడ్డిఅన్నారం

గుంతలు పడి.. ప్రమాదకరంగా మారిన రోడ్డు



చింతలకుంట పరిధిలోని ఇంజినీర్స్ కాలనీలోని రోడ్ నంబర్-3లో మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేశారు. చుట్టూ రోడ్డు మట్టితో పూడ్చారు. వర్షాలకు గోతులు పడ్డాయి. రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. – **చింతలకుంట, న్యూస్‌టుడే**

ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించాలి



ఉపకారవేతనం పొందిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, న్యూస్‌టుడే: ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వనస్థలిపురంలోని కాపు సంక్షేమసంఘం భవనంలో సత్యసాగర మాణిక్యాంబ కాపు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకారవేతనాలను ఇచ్చారు. ఇందులో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గుర్తించి 17 మందికి ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పు అందించడం అభినందనీయమన్నారు. వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనారోగ్యంతో బాధపడుతున్న 75 మందికి ప్రతి నెలా రూ.1000ల చొప్పున 18 నెలలుగా అందిస్తున్నామని ట్రస్టు ఛైర్మన్ బొలిశెట్టి నరసింహరావు అన్నారు. ఇందులో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, భారాస డివిజన్ అధ్యక్షుడు అరవింద్‌రెడ్డి, ట్రస్టు ప్రతినిధులు సుబ్బరాయన్, రామారావు, తోటవెంకటేశ్వర్లు, నాగభూషణం, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమర్థుడైన వ్యక్తినే డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నుకోవాలి



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు మోహన్

సాగర్‌రోడ్డు, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లా దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లా.. అలాంటి జిల్లాకు సమర్థుడైన వ్యక్తిని జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకోవాలని ఏఐసీసీ పరిశీలకుడు, కర్ణాటక ఎమ్మెల్సీ పీవీ మోహన్ అన్నారు. లింగోజిగూడ డివిజన్‌లో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియలో భాగంగా ఆదివారం సంఘటన్ సృజన్ అభియాన్ పేరుతో సమావేశం నిర్వహించారు. ఇందులో టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న పిల్లల ఉద్యానం ప్రారంభం

సాగర్‌రోడ్డు: లింగోజిగూడ డివిజన్‌లోని శ్రీనివాసనగర్ కాలనీలో రూ.12 లక్షలతో నిర్మించిన చిన్న పిల్లల ఉద్యానాన్ని ఆదివారం మాజీ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులతో మాట్లాడారు.

పౌరుల ప్రయోజనాలే లక్ష్యంగా సేవల విస్తరణ

మలక్‌పేట, న్యూస్‌టుడే: పౌర స్పృహను పెంపొందిస్తూ వారి ప్రయోజనాలకు స్వచ్ఛంద సంస్థలు తమ సేవలు విస్తరించాలని ఐక్య వేదిక చీఫ్ కో-ఆర్డినేటర్ అలయ్ గోవింద్‌రాజ్ కందాల అన్నారు. ఆదివారం అస్మాన్‌గఢ్ డివిజన్ ఎస్బీహెచ్ గడ్డిఅన్నారం-2 కాలనీలో శ్రీనివాస సామాజిక భవనంలో 'హైదరాబాద్ ఐకాన్స్ అలయన్స్ క్లబ్' సైదాబాద్ మండలంలో ప్రారంభించారు. సైదాబాద్ మండల క్లబ్ 30 మంది స్వచ్ఛంద సేవకులతో ఏర్పాటైంది.

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా మధు

తుర్కయంజాల్: అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఆదివారం ప్రకటించారు. అధ్యక్షుడిగా మధు, ప్రధాన కార్యదర్శిగా పి.శివకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తెలిపారు.

ఆర్థిక పురోగతికి పరస్పర సహకారం అవసరం



మాట్లాడుతున్న మహిళా ప్రముఖ్ కాంచన

మలక్‌పేట, న్యూస్‌టుడే: ఒకరినొకరు సహకరించుకుంటూ ఆర్థికంగా పురోగతి సాధించడంతో మేలు జరుగుతుందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం అస్మాన్‌గఢ్‌లోని సరస్వతీ పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం 18వ సర్వసభ్య సమావేశం సరస్వతీనగర్ కాలనీలోని వైదేహి ఆశ్రమంలో జరిగింది. సేవిక సమితి తెలంగాణ ప్రాంత మహిళా ప్రముఖ్ కాంచన, సహకార భారతి తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు యెక్కటి ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్త వేస్తే.. జరిమానా తప్పదు



చింతలకుంట పరిధిలోని ఆర్టీసీ కాలనీ రోడ్ నంబర్-5లో చెత్త వేయొద్దని, వేస్తే జరిమానా విధిస్తామని ఎంఎంసీ అధికారులు హెచ్చరిక సూచిక పెట్టారు. అయినా ప్రజలు చెత్త వేస్తున్నారు. –చింతలకుంట న్యూస్‌టుడే

గోతులు పడి.. రాకపోకలకు ఇబ్బందిగా మారి



నాగోలు నుంచి ఎల్‌బీ నగర్ మార్గంలో కామినేని వంతెన పక్కనున్న సర్వీస్ మార్గం గోతులమయమయ్యింది. ఇలా మరమ్మతులు చేయగానే అలా వాహనాలు వెళ్తున్నాయి. చిన్న వర్షం పడినా నీళ్లు నిలిచి రోడ్డు ధ్వంసమవుతోంది. వాహనదారులు చాలా ఇబ్బంది పడుతున్నారు.

మ్యాన్‌హోళ్లలో పూడికతీత పనులు

స్పందనకు వందనం



కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: ఎట్టకేలకు డ్రైనేజీలో పేరుకుపోయిన పూడిక తీసే పనులు మొదలు పెట్టారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీరమణ కాలనీ, సంతోషిమాత కాలనీతో పాటు తదితర కాలనీల్లో పూడిక పేరుకుపోయి. మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు రోడ్లపైకి వస్తోంది. ఈ సమస్యపై ఈనాడులో 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ఈ నెల 30న ప్రచురితం అయ్యింది. స్పందించిన వర్క్ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు ఆదివారం గల్పర్ వాహనంతో నివారణ చర్యలు చేపట్టారు.



భాజపా రాష్ట్ర సాంస్కృతిక విభాగం సభ్యుడి నియామకం

నాగోలు, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర సాంస్కృతిక విభాగం సభ్యుడిగా నాగోలుకు చెందిన ప్రముఖ పౌరాణిక పద్య నాటక రంగస్థల నటుడు, గాయకుడు చల్లగాలి వెంకటరాజును నియమించారు. రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్ నాగపురి రాజమౌళి ఉత్తర్వులు ఇచ్చారు.

సంగీత నృత్య నీరాజనం



నాట్యం చేస్తున్న విద్యార్థినులు

ఎల్.బి.నగర్, న్యూస్‌టుడే: సంస్కార భారతి, ఎస్‌కేఎన్ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వనస్థలిపురంలోని బాంబూ ట్రీ పార్కులో 150 మంది విద్యార్థినులతో వందేమాతరం గీతానికి కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్, సంస్కార భారతి అధ్యక్షురాలు అనంతలక్ష్మి, ఎస్‌కేఎన్ కళాక్షేత్రం నిర్వాహకులు వెంకట్, కృష్ణకుమారిలు, కో ఆర్డినేటర్ డా. శూలపాణి, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు నిర్వాహకులు బి.నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మలక్‌పేట, న్యూస్‌టుడే: పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సైదాబాద్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌లోని బర్ధమాన్ పరిధి హత్కల్నాలోని నిభుజి బజార్‌కు చెందిన షేక్ ఇమ్రాన్ (32), పర్వీన ఖాతూన్ దంపతులు ఐదేళ్ల క్రితం నగరానికి వచ్చారు. సరస్వతీనగర్ డివిజన్ పరిధి శంకేశ్వర్‌బజార్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం. గడ్డిఅన్నారం డివిజన్ పీఅండ్‌టీ కాలనీలోని బంగారు దుకాణంలో పాలిషర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. తలనొప్పిగా ఉందని ట్యాబ్లెట్ వేసుకున్నాడు. అపస్మారక స్థితిలోకి చేరుకోవడంతో కుటుంబసభ్యులు దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. సైదాబాద్ ఏఎస్సై సుందర్‌లాల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆశల గూడు.. లక్కీగా దక్కే చూడు

లక్కీ డ్రాలో ఇళ్లను పొందిన లబ్ధిదారుల్లో వెల్లివిరిసిన సంతోషం

చంచల్‌గూడ, న్యూస్‌టుడే : ఇందిరమ్మ ఇండ్లను పొందిన పేదలు సంతోషంతో కేరింతలు కొడుతున్నారు. కొంతమంది లబ్ధిదారులు కన్నీటి పర్యంతమయ్యారు.

అదృష్టవంతుడిని..



కేసపాక లక్ష్మణ్

20ఏళ్లుగా సింగరేణి కాలనీలో ఉంటున్నాం. నా భార్య దివ్యాంగురాలు. ఇద్దరు పిల్లలు. ప్రైవేటులో ఉద్యోగం చేస్తున్నాను. ఇంత అదృష్టం నన్ను వరిస్తుందని ఎన్నడూ అనుకోలేదు.

మురికివాడల్లో ఉన్నాం..



కొర్రి శారద

డ్రా తీసిన సమయంలో నా పేరు పిలువగానే ఒక్కసారి నన్ను నేను నమ్మలేక పోయాను. చాలా కాలంగా నేను, నా భర్త సొంత ఇల్లు లేక మురికివాడల్లో ఉంటున్నాం. రోజూ పనికి వెళ్తే కానీ డబ్బు రాదు. కూడబెట్టిన డబ్బుతో దరఖాస్తు చేసుకున్నాం. ఈ రోజు భగవంతుడు దయ తలిచాడు.

కష్టపడి దరఖాస్తు చేశా..



యారపాక పద్మ

చిన్ననాటి నుంచి మా తల్లిదండ్రులతో సరూర్‌నగర్, అంబేడ్కర్ నగర్‌లో ఉంటున్నాం. నాకు ఇద్దరు పిల్లలు, నా భర్త డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇంటికి దరఖాస్తు చేసేందుకు చాలా శ్రమతో కష్టపడాల్సి వచ్చింది. నా పేరు పిలిచి మాట్లాడమని అంటే నోట మాట రాలేదు.

లబ్ధిదారుల ఎంపిక పూర్తి



వేదికపై అధికారులతో ఎమ్మెల్యే బలాల

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: పేదల ఆశల గూడు లక్కీ డ్రాలో దక్కింది. నగరంలోనే ఇల్లు రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మలక్‌పేట నియోజకవర్గానికి చెందిన ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక లక్కీ డ్రాను ఆదివారం సైదాబాద్‌లోని ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి వివరాలు దరఖాస్తుదారులకు తెలిపారు. వేదికపైకి అధికారులను కాకుండా ఇతరులను అనుమతించడంతో భాజపా నాయకులు అభ్యంతరం తెలిపారు. హౌసింగ్ బోర్డు ఈఈ, కిరణ్‌బాబు, తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ లక్కీ డ్రాను పరిశీలించారు. కార్యక్రమం ముగింపు దశలో మలక్‌పేట శాసనసభ్యుడు అహ్మద్ బలాల వచ్చారు. సంతోష్‌నగర్ ఏసీపీ సుఖదేవ్‌సింగ్ ఠాకూర్, సీఐ నాగరాజులు బందోబస్తు పర్యవేక్షించారు. 480 ఇళ్లకు 3151మంది దరఖాస్తులు చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. దివ్యాంగుల విభాగంలో 24 ఇళ్లుండగా..10 మంది దరఖాస్తు చేసుకోవడంతో అందరికీ ఇళ్లు కేటాయించినట్టు తెలిపారు. ఔట్ సోర్సింగ్ (ప్రత్యేక విభాగం) వారికి 48 ఉంటే.. నలుగురు దరఖాస్తు చేసుకున్నారు. 120 ఇళ్ల వెయిటింగ్ జాబితాకు సంబంధించిన డ్రా కూడా అధికారులు నిర్వహించారు.

మలక్‌పేట నియోజకవర్గంలో కేటాయించిన ఇళ్లు ఇలా..

	దివ్యాంగులు	జనరల్	ఓబీసీ	ఎస్సీ	ఎస్టీ	ఇతరులు
కేటాయింపు	24	240	77	67	24	48
దరఖాస్తులు	10	332	2482	251	72	4

నాగోలులో ఆసక్తికరంగా...!



లాటరీ తీస్తున్న అధికారులు

నాగోలు, న్యూస్‌టుడే: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని బండ్లగూడలో ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపికకు ఆదివారం నిర్వహించిన లక్కీ డ్రా ఉత్కంఠగా సాగింది. బండ్లగూడలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మిస్తున్న అపార్టుమెంట్లలో ఫ్లాట్ల కేటాయింపుకు 752మంది దరఖాస్తు చేసుకున్నారు. లక్కీ డ్రాలో 480మందిని ఎంపిక చేశారు. ఇక్కడి రాజీవ్ స్వగృహ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈ డ్రాలో తమ పేరు వస్తుందా.. సొంతింటి కల నెరవేరుతుందో లేదోనంటూ దరఖాస్తుదారులు ఆసక్తిగా ఎదురుచూశారు. ● ఎస్సీ విభాగానికి 67, ఎస్టీ- 24, బీసీ- 77, వికలాంగులకు 24, ఇతర విభాగాలకు 240 ఫ్లాట్లను కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ హౌసింగ్ బోర్డు జనరల్ మేనేజర్ మధుకర్‌రెడ్డి, హౌసింగ్ బోర్డు సౌత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాబూరావు హాజరయ్యారు.





చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

చార్మినార్, న్యూస్‌టుడే: చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని న్యూజిలాండ్ ఉదాసీన్ మఠం ప్రతినిధులు సందర్శించారు. భాగ్యలక్ష్మి అమ్మవారికి న్యూజిలాండ్ ఉదాసీన్ మఠం ప్రతినిధి బాబా సుయాన బృందం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించిన ఉదాసీన్ మఠం ప్రతినిధులను ఆలయ ట్రస్టీ శశికళ సన్మానించారు.



పూజల్లో న్యూజీ ఉదాసీన్‌మఠం ప్రతినిధులు

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్ • చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

ఐహెచ్‌ఎంలో పుస్తకాల ఆవిష్కరణ

అంబర్‌పేట, న్యూస్‌టుడే: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం)లో పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ ప్రిన్సిపల్ సంజయ్ ఠాకూర్, ఫుడ్, బెవరేజ్ సర్వీస్ విభాగాధిపతి పునీత్ రజ్దాన్ రాసిన పుస్తకాలను రాష్ట్ర యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్ ఆదివారం డీడీ కాలనీలోని సంస్థ క్యాంపస్‌లో ఆవిష్కరించారు. కేంద్ర పర్యాటక శాఖ దక్షిణ ప్రాంతీయ డైరెక్టర్ వెంకటేశన్, అరుణ్‌కుమార్‌గుప్త, జితేంద్ర, గిరిబాబు, రత్నాకర్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణిప్రాద్, సంజయ్‌ఠాకూర్ తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట: 8008573324, కార్వాన్: 8008573341, నాంపల్లి: 8008573338, గోషామహల్: 8008573334, యాకుత్‌పుర: 8008573307, చార్మినార్: 9100581018.

కూరగాయల ధరలు

మెహిదీపట్నం రైతుబజార్‌లో

మెహిదీపట్నం, న్యూస్‌టుడే: (ఆదివారం నాటి ధరలు, కేజీ రూ.ల్లో) టమాట 21, వంకాయ 28, బెండకాయ 28, పచ్చిమిర్చి 35, కాకరకాయ 26, బీరకాయ 28, క్యాబేజీ 13, బీన్స్ 65, క్యారెట్ 55, దొండ 23, చిక్కుడు కాయ 40, గోకరకాయ 28, బీట్‌రూట్ 35, క్యాప్సికం 33, ఆలుగడ్డ 17, కీర 18, దోసకాయ 16, సొరకాయ 7, పొట్లకాయ 13, ఉల్లిగడ్డ 42, చామగడ్డ 26.

కళాకారులకు మరణం లేదు



పురస్కార గ్రహీతతో వంశీ రామరాజు, రేలంగి నరసింహారావు, కృష్ణకుమారి

గాంధీనగర్, న్యూస్‌టుడే: కళాకారులకు మరణం ఉండదని వారు నటించిన పాత్రల్లో ఎల్లప్పుడూ జీవించి ఉంటారని తెలుగు అకాడమి ఛైర్మన్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో ప్రముఖ సినీనటి జమునా రమణారావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల నుంచి ఎంపికచేసిన ప్రముఖులకు వంశీ- జమునా రమణారావు మహిళారత్న అవార్డులను ప్రదానం చేసి సన్మానించారు. అనంతరం జమున కూతురు స్రవంతి మాట్లాడుతూ జమున వివిధ పాత్రల్లో నటించి ప్రేక్షకాదరణ పొందారన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు రేలంగి నరసింహారావు, వంశీ రామరాజు, జానీబాషా, జానకి, రమాచౌదరి, వెంకట్, సంతోష్‌కుమార్, డా.కృష్ణకుమారి, సుధామయి, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో జాప్యం.. తొలగని గందరగోళం

దారుస్సలాం- గోషామహల్ మార్గం అందుబాటులోకి వచ్చేదెప్పుడో?

గోషామహల్, న్యూస్‌టుడే: నగరంలో అత్యంత రద్దీగా ఉండే అంతర్గత రహదారి అది. ప్రముఖ హోల్‌సేల్ వ్యాపార కేంద్రమైన బేగంబజార్ మార్కెట్లకు సరుకు రవాణా చేసే వాహనాలకు కీలక మార్గం. నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగించే దారుస్సలాం- గోషామహల్ మార్గం ఇప్పుడు మూడు నెలలుగా మూతపడటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ధూల్‌పేటలో తయారయ్యే వినాయక విగ్రహాలను వివిధ ప్రాంతాలకు తరలించేందుకు ఈ మార్గమే ప్రధాన ఆధారం. బేగంబజార్ హోల్‌సేల్ మార్కెట్లకు సరుకు రవాణా చేసే వాహనాలకు ఈ రహదారి అత్యంత కీలకం.



మూడు నెలలుగా కొనసాగుతున్న నాలా పనులు

వారం రోజుల్లో తెరవడం సాధ్యమేనా?

వినాయక చవితి నాటికి రహదారిని అందుబాటులోకి తీసుకురావాలంటే పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాల్సి ఉంది. మరో వారం రోజుల్లో పనులు పూర్తి చేసి రహదారిని తెరవాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుత పనుల వేగాన్ని చూస్తే అది సాధ్యమవుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పరిస్థితి తీవ్రతను గుర్తించిన జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు ఇటీవల రహదారి, నాలా నిర్మాణ పనులను పరిశీలించారు. వినాయక చవితి వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సెప్టెంబరు తొలివారం లోగా పనులు పూర్తి చేసి రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారును ఆదేశించారు. అయినా క్షేత్రస్థాయిలో పనుల్లో ఆశించినంత వేగం కనిపించడం లేదు.

నిమజ్జనానికి ప్రత్యామ్నాయాలు చూడాల్సిందేనా?

వినాయక విగ్రహాల తరలింపు, అనంతరం నిమజ్జన కార్యక్రమాల సమయంలో ఈ మార్గం అందుబాటులో లేకపోతే భారీగా ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉంది. విగ్రహాల రవాణాకు ప్రత్యామ్నాయ మార్గాలను అధికారులు ముందుగానే గుర్తించాల్సి ఉంటుంది. మూడు నెలలుగా రహదారి మూసివేయడంతో తమ రోజువారీ జీవనం తీవ్రంగా ప్రభావితమైందని స్థానికులు వాపోతున్నారు. సరుకు రవాణా వాహనాలు సమయానికి మార్కెట్లకు చేరుకోకపోవడంతో వ్యాపార కార్యకలాపాలపై ప్రభావం పడుతోందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఆందోళనలు.. రాస్తారోకోలు చేసినా..

రహదారి సమస్యపై వివిధ రాజకీయ పార్టీలు, స్థానిక సంఘాలు పలుమార్లు ఆందోళనలు చేపట్టాయి. రాస్తారోకోలు నిర్వహించి అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. పనుల్లో జాప్యంపై స్థానికులు విమర్శిస్తున్నారు. దారుస్సలాం- గోషామహల్ రహదారిపై నాలా నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేసి రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోతే జీహెచ్‌ఎంసీ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, స్థానిక వ్యాపార సంఘం జేఏసీ కన్వీనర్ ఆల పురుషోత్తం రావు హెచ్చరించారు. నెల రోజుల్లో పూర్తిచేయాల్సిన పనులు మూడు నెలలు గడిచినా పూర్తికాకపోవడం అధికారుల పర్యవేక్షణ లోపానికి నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రసూతి ఆసుపత్రిలో శ్రావణ మాసం బోనాలు

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఆదివారం శ్రావణమాసం బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి.



బోనాల వేడుకల్లో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.అనురాధ, సిబ్బంది

బ్యాండ్ మేళాలు, శివసత్తుల పూనకాలు, సిబ్బంది నృత్యాల మధ్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.అనురాధ సంప్రదాయబద్ధంగా మహిళా ఉద్యోగులతో కలిసి బోనం ఎత్తి ఆసుపత్రి ఆవరణలోని బంగారు మైసమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాలు, తొట్టెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వేడుకల్లో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, ప్రధానకార్యదర్శి ఎం.నరసింహా, ఉప ప్రధానకార్యదర్శి హసీనా బేగం, కార్యదర్శి పి.పార్వతి పాల్గొని సంఘం ఆసుపత్రి అధ్యక్షురాలు వినోదా, నాయకులు పెద్ద పద్మ, చంద్రకళ, విజయలక్ష్మి, శైలజ తదితరులతో కలిసి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ముగిసిన క్రీడా దినోత్సవ కార్యక్రమాలు

నారాయణగూడ, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాట్) ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా 'ఖేలేగా భారత్- జీతేగా భారత్' నినాదంతో నిర్వహించిన క్రీడా, ఫిట్‌నెస్ కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఆయన సేవలను స్మరించడంతో పాటు క్రీడా ప్రాధాన్యం, క్రీడాస్ఫూర్తి, ఆరోగ్యకర జీవన విధానాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు సాట్స్ అధికారులు వివరించారు. 'ఏక్ ఘంటా ఖేల్‌కే మైదాన్‌మే' కార్యక్రమం పేరిట ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ తదితర పోటీలతో పాటు '29 ఛాలెంజ్', 'పాస్ ది బాల్ ఛాలెంజ్', 'మీట్ ది ఛాంపియన్స్' వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. మహిళలు, యువత, వయోధికులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. వేడుకల ముగింపు సందర్భంగా 'స్పెషల్ సండేస్ ఆన్ సైకిల్', రన్‌లు, వాకథాన్‌లు నిర్వహించినట్లు వివరించారు.

నిబంధనలు పాటిద్దాం.. ప్రమాదాలను నివారిద్దాం

కార్వాన్, న్యూస్‌టుడే: ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిబంధనలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని కుల్సుంపురా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. కుల్సుంపురా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం గుడిమల్కాపూర్‌లో రోడ్డు భద్రతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించటం, కార్లల్లో సీటు బెల్టు పెట్టుకోవటం భారం కాదనీ.. ప్రమాదాలు జరిగినప్పుడు అవే మన ప్రాణాల్ని కాపాడే సాధనాలన్నారు. ప్రమాదాల నివారణపై పిల్లలు, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌ల వల్ల నిండు ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని వివరించారు. రోడ్డుపై ఆకతాయి పనులు చేయటం, నిర్లక్ష్యంగా నడవటం లేదా వాహనం నడపటం వల్ల నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, స్కూలు బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు, ప్రయాణిస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మైనర్లు వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని చెప్పారు. గుడిమల్కాపూర్‌లోని కూరగాయలు, పూల మార్కెట్లకు రాకపోకలు సాగించేవారు నియమ నిబంధనలను పాటించాలని సూచించారు.



అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ తదితరులు

పండగలకు ఆర్టీసీ బస్సుల్లో టికెట్ రేట్ల పెంపుపై ఆందోళన

కేశవగిరి, న్యూస్‌టుడే: పండగలు, ప్రత్యేక సందర్భాల్లో ఆర్టీసీ బస్సుల్లో టికెట్ రేట్లు పెంచుతున్నారంటూ ప్రయాణికులు చాంద్రాయణగుట్టలో ఆదివారం ఆందోళనకు దిగారు. కల్వకుర్తి నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సుల్లో సాధారణ రోజుల్లో రూ.150కి ఒక టికెట్ ఇస్తారు. పండగలు వచ్చిన సందర్భంలో రెండు మూడురోజుల పాటు రద్దీ పెరగడంతో టికెట్ల రేట్లు అమాంతంగా పెంచేస్తున్నారని కల్వకుర్తికి చెందిన ప్రయాణికులు అభ్యంతరం తెలిపారు. పండగ ప్రత్యేక బస్సులంటూ తమ వద్ద నుంచి రూ.50 అదనంగా ఛార్జీ వసూలు చేయడమేంటని ప్రయాణికులు చాంద్రాయణగుట్ట వద్ద బస్సును నిలిపి కండక్టర్‌తో వాదనకు దిగారు. తమకు ఉన్న ఆదేశాల మేరకే టికెట్ రేట్లు పెరిగాయని చెప్పినా శాంతించలేదు. బస్సు నుంచి దిగి రోడ్డుపై ఆందోళన చేపట్టారు. తోటి ప్రయాణికులకు ఆలస్యం అవుతుందనడంతో ఆందోళన విరమించారు.

హైదరాబాద్ సగర సంఘం కార్యవర్గం ఎన్నిక

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం అధ్యక్షుడిగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి అంజయ్యనగర్‌కు చెందిన రవి ఎన్నికయ్యారు. ఆదివారం సూరారంలోని వీబీపీ ఫంక్షన్‌హాల్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మారుతీసాగర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎ.రామ్మోహన్ సాగర్ ఆధ్వర్యంలో సంఘం ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా వెంకట్రాములు, కోశాధికారిగా సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను రాష్ట్ర సగర సంఘం నాయకులు పర్యవేక్షించారు.

విగ్రహాలు తరలించేందుకు వాహనాలు సమకూర్చాలని వినతి

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: గణేశ ఉత్సవాల్లో విగ్రహాలను తరలించడానికి వాహనాలను సమకూర్చాలని భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి ప్రతినిధులు ఆర్టీఏ అధికారులను కోరారు. ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్, కార్యదర్శులు ఆలె భాస్కర్, కొడి మహేందర్, సంయుక్త కార్యదర్శి రూప్‌రాజ్ తదితరులు ఆదివారం ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో జాయింట్ కమిషనర్ వెంకటరమణను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఏటా నిమజ్జన ఊరేగింపునకు వాహనాలు దొరకక ఉత్సవ నిర్వాహకులు పడే ఇబ్బందులను వివరించారు. ఈనెల 25న జరిగే సామూహిక ఊరేగింపునకు విగ్రహాలను తరలించడానికి వాహనాలు సమకూర్చాలని కోరారు.



ఆర్టీఏ జాయింట్ కమిషనర్ వెంకటరమణకు విన్నవిస్తున్న గణేశ ఉత్సవ సమితి ప్రతినిధులు

ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. పూడిక తీతకు, మరమ్మతులకు వీలుగా తాగునీటి, డ్రైనేజీ పైపులైన్లపై జలమండలి, కచ్చామోరీ పైపులైన్‌పై జీహెచ్‌ఎంసీ మ్యాన్‌హోళ్లు ఏర్పాటు చేశాయి. మ్యాన్‌హోళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడం, వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో తరచుగా మ్యాన్‌హోళ్లు ధ్వంసమవుతున్నాయి. మ్యాన్‌హోళ్ల నిర్మాణం, మూతల ఏర్పాటు కాంట్రాక్టర్లకు, అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. కాంట్రాక్టరు తూతూమంత్రంగా మ్యాన్‌హోళ్ల నిర్మాణం, మరమ్మతు పనులు చేసి చేతులు దులుపుకొంటున్నారు. తరచుగా మ్యాన్‌హోళ్లు కుంగిపోతున్నాయి. మూతలు పగిలిపోతున్నాయి. మ్యాన్‌హోళ్ల మరమ్మతు మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. పాతబస్తీలోని గౌలిపురా సరస్వతీనగర్, హనుమాన్‌నగర్, కాల్వగడ్డ, శివాజీనగర్, ఉప్పుగూడ, రక్షపురం కాలనీ, సాయిబాబానగర్ తదితర ప్రాంతాల్లో పలుచోట్ల మ్యాన్‌హోళ్లు ధ్వంసమయ్యాయి. మ్యాన్‌హోళ్లు కుంగిపోయి, పైమూతలు విరిగిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్ల మరమ్మతుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గౌలిపురా సరస్వతీనగర్‌లో కుంగిపోయిన మ్యాన్‌హోల్



కాల్వగడ్డలో ధ్వంసమైన మూత

పీవీ ఎక్స్‌ప్రెస్ వేకు కొత్తందాలు

మెహిదీపట్నం, న్యూస్‌టుడే: పీవీ ఎక్స్‌ప్రెస్ వేకు అధికారులు కొత్త అందాలు దిద్దుతున్నారు. మెహిదీపట్నం ప్రధాన రహదారిలో గతంలో ఈ పనులు చేపట్టిన అధికారులు ప్రస్తుతం రింగురోడ్డులో ప్రారంభించారు. పిల్లర్ నెంబరు 79 నుంచి (ర్యాంపు నుంచి) 110 వరకు పిల్లర్లను తీర్చిదిద్దే పనులు ప్రారంభించారు. పిల్లర్లకు వివిధ రకాల మొక్కలతో వర్టికల్ గార్డెన్ పనులు జరుగుతున్నాయి. సాంగ్ ఆఫ్ ఇండియా, ఫిలోడెండ్రం, బ్రింగ్ లాంటి మొక్కలతో పాటు మరికొన్ని రకాలు ఇందులో ఉన్నాయి. పలు పిల్లర్లను రంగులతో తీర్చిదిద్దారు. వర్షాలు పడుతుండడంతో కార్మికులు చకచకా పనులు చేస్తున్నారు. నాలుగైదు రోజుల్లో వర్టికల్ గార్డెన్ పనులు పూర్తి చేస్తామని కార్మికులు చెప్పారు. ఇవి పూర్తయితే పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్లు కనువిందు చేయడం ఖాయం.



మొక్కలు సిద్ధంచేస్తున్న కార్మికులు



పిల్లర్లకు పచ్చందాలు



ఆకర్షణీయమైన రంగులతో..

నోటీసులు అందుకున్న ఓటర్లు వెంటనే ఆధారాలివ్వాలి

గోల్కొండ, న్యూస్‌టుడే: ఎస్ఐఆర్‌లో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు వెంటనే సంబంధిత అధికారికి ఆధారాలు సమర్పించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం గోల్కొండలోని జీఎంకే గార్డెన్‌లో మజ్లిస్ పార్టీ నాయకులు, బూత్‌లెవల్ వర్కర్లకు ఎస్ఐఆర్‌లో భాగంగా నోటీసుల విషయమై అవగాహన కల్పించారు. పార్టీ నాయకులు నోటీసులు అందుకున్న ఓటర్లకు దిశానిర్దేశం చేయాలని అన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు 12 గుర్తింపు కార్డుల్లో ఒక దానిని సంబంధిత అధికారికి అందించాలని అన్నారు. దీనిపట్ల నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పీఏ సయ్యద్ ముష్తాక్ అహ్మద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్

రేపటి నుంచి గోర్ ధర్మ జాగృతి మహా పాదయాత్ర

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: గోర్ ధర్మ జాగృతి కోసం సెప్టెంబరు 1 నుంచి మహా పాదయాత్ర చేపడుతున్నట్లు సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ మందిరం నిర్వాహకుడు భౌసింగ్ మహారాజ్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో దానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. పాదయాత్ర వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అజ్మీరా మంగ తండాలోని సేవాలాల్ మందిరం వద్ద ప్రారంభమై నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల మీదుగా కొనసాగి మహారాష్ట్రలోని పహరాదేవి మందిరం వద్ద ముగుస్తుందన్నారు. దాదాపు 475 కి.మీ. 15 రోజులపాటు యాత్ర కొనసాగనుందని వివరించారు. లంబాడా సమాజం యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ హుస్సేన్ నాయక్, ప్రతినిధులు శ్రీనివాస్, లాలూప్రసాద్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న భౌసింగ్ మహారాజ్ తదితరులు

కులవివక్ష వేధింపులు అరికట్టేందుకు చట్టం అవసరం

నల్లకుంట, న్యూస్‌టుడే: ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఎదుర్కొంటున్న కులవివక్ష వేధింపులు, అవమానాలు, అన్యాయాలు అరికట్టేందుకు ప్రత్యేక చట్టం చేయాలని హైకోర్టు న్యాయవాది రఘునాథ్ అన్నారు. రోహిత్ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల మరణం దేశ వ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల్లో కొనసాగుతున్న సంస్థాగత కుల వివక్షపై తీవ్రమైన చర్చకు దారితీసిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అప్పాసింగ్, డాక్టర్ దొంత ప్రశాంత్ తదితరులు మాట్లాడుతూ.. రోహిత్ వేముల ఉద్యమం సందర్భంగా నమోదైన కేసులు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విద్యార్థి, ప్రజా, యువజన సంఘాలు, న్యాయ నిపుణులు, విద్యా వేత్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘునాథ్

చిరుజల్లుల్లో పర్యాటకుల పులకింత



చారిత్రక చార్మినార్ పరిసరాల్లో ఆదివారం చిరుజల్లులు కురిసినా పర్యాటకుల సందడి తగ్గలేదు. వారాంతం కావటంతో గొడుగులు వేసుకుని వచ్చి చార్మినార్‌ను వీక్షిస్తూ.. వేడివేడి ఇరానీ చాయ్ తాగుతూ ఉల్లాసంగా గడిపారు.

సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించాలి

నల్లకుంట: సేవాలాల్ మహారాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం సెలవు రోజుగా ప్రకటించాలని లంబాడి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బానోతు గణేష్‌నాయక్ డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలన్నారు. తండాల అభివృద్ధికి ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.5 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బాలాజీ నాయక్, కన్వీనర్‌గా శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రవీందర్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మొరాయిస్తున్న సర్వర్.. ఓటర్లకు తిప్పలు

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: సర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవడానికి నానా ఇక్కట్లు పడుతున్నారు. మ్యాపింగ్ కాకపోవడం, సర్వర్ మొరాయిస్తుండడంతో సిబ్బందికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. డాక్యుమెంట్లు సమర్పించే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. నోటీసులో సూచించిన డాక్యుమెంట్లు అందజేసినా అది లేదు.. ఇదికాదు అంటూ బీఎల్‌వోలు చెబుతున్నారు. దీంతో ఓటర్లు డాక్యుమెంట్లు తీసుకురావడానికి నానా హైరానా పడుతున్నారు. అప్పట్లో బీఎల్‌వోలు చెప్పిన విధంగా ఎన్యూమరేషన్ ఫారాలు నింపి ఇచ్చినప్పటికి తమకు నోటీసులు అందాయని పలువురు ఓటర్లు వాపోతున్నారు. అడిగిన డాక్యుమెంట్లు ఇవ్వని పక్షంలో కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారని, దీంతో రోజుల తరబడి బీఎల్‌వోల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. బీఎల్‌వోలకు తగిన శిక్షణ ఇవ్వకుండా క్షేత్రస్థాయిలోకి పంపడంతో సమస్యలు వస్తున్నాయని, సర్వర్ కూడా మొరాయిస్తుండడంతో ఓటర్లు ఇబ్బంది పడుతున్నారని భారాస సీనియర్ నేత జమ్మిచెట్టు రాజు పేర్కొన్నారు. సర్వర్ సమస్యతో పాటు ఓటర్లకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



ఉప్పుగూడ తానాజీనగర్‌లో దరఖాస్తులు సమర్పిస్తున్న ఓటర్లు

ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో క్లీన్ అండ్ గ్రీన్

నాంపల్లి, న్యూస్‌టుడే: నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జీహెచ్‌ఎంసీ, హైడ్రా మాన్‌సూన్ అలెర్ట్ టీమ్ సిబ్బంది కలిసి ఆదివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. జీహెచ్‌ఎంసీ డీఎంసీ ఉమాప్రకాశ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శివానంద్, అసిస్టెంట్ ఈఈ సాయిరాంరెడ్డి, అర్బన్ బయోడైవర్సిటీ ఏడీ రహీన, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ (హైడ్రా గోల్కొండ) బి.చరణ్ కుమార్, శానిటేషన్ సిబ్బంది తదితరుల నేతృత్వంలో ఈ కార్యక్రమం కొనసాగింది. కళాశాల క్రీడా స్థలం, ప్రాంగణమంతా సుమారు రెండు అడుగుల మేర పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. కళాశాల యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదుకు స్పందించిన జీహెచ్‌ఎంసీ, హైడ్రా సిబ్బంది కలిసి కళాశాల ప్రాంగణంలోని చెత్త, వ్యర్థాలను, చెట్ల కొమ్మలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.



కళాశాల ఆవరణలో చెత్త తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ, హైడ్రా సిబ్బంది

ఉద్యోగం.. శిక్షణ పేరుతో మోసం

గోషామహల్, న్యూస్‌టుడే: ఉద్యోగం, శిక్షణ అవకాశాలు కల్పిస్తానంటూ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన ఓ యువతిని మోసం చేసి రూ.2.25 లక్షలు వసూలు చేసిన వ్యక్తిని గోషామహల్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శ్రవణ్ కుమార్ తెలిపిన ప్రకారం.. బాధితురాలు పోకాల వైష్ణవికి 2025లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రవీణ్‌కుమార్ పరిచయమయ్యాడు. ఉద్యోగం, శిక్షణ అవకాశాలు కల్పిస్తానని నమ్మించి శిక్షణకు సంబంధించిన ఖర్చుల పేరుతో ఫిబ్రవరి 22, 2025న బాధితురాలి ఇంటికి వెళ్లి, బాండ్ పేపర్ రాయించుకుని రూ.1.50 లక్షలు తీసుకున్నాడు. అనంతరం మే 2025లో డాక్యుమెంట్ వెరిఫికేషన్ పేరుతో మరో రూ.50 వేలు వసూలు చేశాడు. జులై 9న డీడీ కోసం మరో రూ.25 వేలు ఆన్‌లైన్‌లో బదిలీ చేయించుకున్నాడు. మొత్తంగా రూ.2.25 లక్షలు తీసుకున్న అనంతరం స్పందించకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు గోషామహల్ పోలీసులు కేసు నమోదు చేసి ఆగస్టు 29న నిందితుడిని అరెస్టు చేసి, అతడి ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఉద్యోగాలు, శిక్షణ, రిక్రూట్‌మెంట్, డిఫెన్స్ అకాడమీ అడ్మిషన్లు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల పేరుతో సోషల్ మీడియా ద్వారా సంప్రదించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.

రాజేంద్రనగర్

•రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

యోగాతో మానసిక ప్రశాంతత


కేశంపేటలో యోగాపై అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

కేశంపేట, న్యూస్‌టుడే: నిత్యం యోగా సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని కేశంపేట సీఐ నరహరి తెలిపారు. ఆదివారం కేశంపేటలో యోగా కేంద్రాన్ని పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు సూరం రామయ్య ప్రారంభించారు. స్థానిక నాయకులు బొజ్జం శ్రీశైలం, తలసాని వెంకట్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, అనసూయమ్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


పోచమ్మ ఆలయ వేడుకల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, న్యూస్‌టుడే: యువత భక్తి మార్గంలో ముందుకు సాగాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. వెలిజర్ల గ్రామంలో ఆదివారం పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సర్పంచి బాబూనాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, జాంగారి రవి, దొడ్డి శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.● కంసాన్‌పల్లి గ్రామంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించే డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సర్పంచి గోపాల్‌రెడ్డి, భరత్‌సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజేంద్రనగర్: 8008573330	చేవెళ్ల : 9866948348
మణికొండ: 6305837226	షాద్‌నగర్: 8008573907
శంషాబాద్: 9963096353	బండ్లగూడజాగీర్: 8008573269

మణికొండ, చేవెళ్ల, మణికొండ, కొందుర్గు, న్యూస్‌టుడే:

? మణికొండలోని శివపురి కాలనీ, హనుమాన్ నగర్ కాలనీల్లో పది రోజులుగా తాగునీటి సరఫరా సరిగ్గా ఉండటం లేదు. సరఫరా సమయం చాలా తగ్గించారు. నీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. – విద్యాసాగర్, శివపురి కాలనీ, మణికొండ

✓ ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. – మాజిద్, జలమండలి మేనేజర్, మణికొండ

? చేవెళ్ల నుంచి కందవాడ వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే చెత్త వేస్తుండటంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం.
– వెంకటేశ్, కందవాడ

✓ రోడ్డు పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం.
– నరేందర్, మున్సిపల్ మేనేజర్, చేవెళ్ల

? మణికొండలోని శివపురి కాలనీలో దోమల సమస్య తీవ్రంగా ఉంది.
–దేవేందర్, శివపురి కాలనీ, మణికొండ

✓ వెంటనే సిబ్బందిని పంపించి ఫాగింగ్ చేయిస్తాం. –డా.రవి, ఎంటమాలజీ విభాగం అధికారి

? పొలాల్లోకి వెళ్లే బాటలు నిర్మించాలి
–అంజయ్య, కొందుర్గు

✓ ఉపాధి హామీలో దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తాం –నర్సింగ్‌రావు, ఏపీవో, కొందుర్గు

కొత్త పింఛన్లు.. చిగురిస్తున్న ఆశలు

చేవెళ్ల, చేవెళ్ల రూరల్, న్యూస్‌టుడే:

కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తుండటంతో అర్హులైన పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి. చాలా కాలంగా పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులతో పాటు ఇతర అర్హులు దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వృద్ధాప్య పింఛను కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించకపోవడంతో వారు నిరుత్సాహపడుతున్నారు.

స్థానికంగా దరఖాస్తు చేసుకునే అవకాశం..

ప్రభుత్వం గతంలో 'ఆసరా' పేరిట ఇచ్చే పింఛన్లను 'చేయూత' పింఛన్లుగా మార్చింది. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా స్థానికంగా పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చని అధికారులు తెలిపారు. దరఖాస్తు పత్రంతో పాటు లబ్ధిదారుని ఫొటో, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, ఆహార భద్రత కార్డు (రేషన్‌కార్డు) నకలు సమర్పించాల్సి ఉంటుంది. వితంతువులు భర్త మరణ ధ్రువపత్రం ఇవ్వాలి. 18 సంవత్సరాలు అంతకన్నా ఎక్కువ వయసు ఉన్న వారు అర్హులు. దివ్యాంగులకు సదరం ధ్రువపత్రం తప్పనిసరి. ఒంటరి మహిళలు విడాకుల పత్రం, కోర్టు ఆర్డర్ లేదా విడిపోయినట్లు తెలిపే పత్రంతో పాటు తహసీల్దారు స్థాయి అధికారి విచారణ నివేదిక సమర్పించాలి. కార్మికులు కల్లు గీత సహకార సంఘం సభ్యత్వం ధ్రువీకరణ లేదా ఎక్సైజ్‌శాఖ ధ్రువపత్రం అవసరం. 50 సంవత్సరాల పైబడిన వారు అర్హులు. డయాలసిస్ బాధితులు నిరంతరం డయాలసిస్ చికిత్స పొందుతున్నట్లు వైద్య ధ్రువపత్రం, ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టుకు సంబంధించిన నమోదు పత్రాలు జత చేయాల్సి ఉంటుంది.

మండలాల వారీగా ప్రస్తుతం పింఛన్లు పొందుతున్న వారు..

మండలం	లబ్ధిదారుల సంఖ్య
చేవెళ్ల	4242
మొయినాబాద్	3271
షాబాద్	6417
శంకర్‌పల్లి	5062
మున్సిపాలిటీలు...	
చేవెళ్ల	2413
మొయినాబాద్	2774
శంకర్‌పల్లి	1782

ఏళ్లుగా ఎదురు చూపులు..

పింఛన్ పొందడానికి అర్హత ఉన్నప్పటికీ కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో ఏళ్లుగా లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. నెలనెలా అందే పింఛన్ తమకు చిన్నపాటి ఆర్థిక భరోసా కల్పిస్తుందని వారు చెబుతున్నారు. మందులు, నిత్యావసరాలు, ఇతర వ్యక్తిగత ఖర్చులకు పింఛను ద్వారా వచ్చే డబ్బులు ఉపయోగపడతాయని,


మున్సిపల్ కార్యాలయం వద్ద దరఖాస్తుదారులు

ప్రభుత్వం ప్రకటించిన కొత్త పింఛన్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేసి ఆర్థిక భరోసా కల్పించాలని కోరుతున్నారు. ఇప్పటి వరకు చేవెళ్ల డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 2 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. దరఖాస్తు చేయని వారు గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

–యాదగిరి, చేవెళ్ల మున్సిపల్ కమిషనర్



చేయూత పింఛన్ల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువపత్రాలు జత చేయాలి. సందేహాల నివృత్తి కోసం మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశాం. ఇప్పటికే పింఛన్లు పొందుతున్న వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. కొత్త వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

రాజశ్యామల అమ్మవారి ఆలయ నిర్మాణ పనుల పరిశీలన


త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని సత్కరిస్తున్న పీఠాధిపతులు

నార్సింగి, న్యూస్‌టుడే: కోకాపేటలో రాజశ్యామల అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి ఆదివారం పరిశీలించారు. విశాఖ శారదా పీఠం, నియోపోలీస్ కమిటీ సభ్యులు.. గవర్నర్‌కు స్వాగతం పలికారు. శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి, ఉత్తర పీఠాధిపతులు స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామిని త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు. రెండు ఎకరాలలో జరుగుతున్న ఆలయ నిర్మాణ పనుల పురోగతిని వారు గవర్నర్‌కు వివరించారు. ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న ఆగమ పాఠశాల, గోశాల, అన్నదాన భవనం గురించి తెలిపారు. అనంతరం గవర్నర్.. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆధ్యాత్మిక విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు.. గవర్నర్‌కు ఆశీస్సులు అందించి, తీర్థప్రసాదాలను అందించారు.

సందడిగా క్రీడా పోటీలు


విజేతలతో రామకృష్ణ సేవాసమితి సభ్యులు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: హైదరాబాద్ రామకృష్ణమఠం సహకారంతో ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. శ్రీరామకృష్ణ సేవా సమితి నేతృత్వంలో ఆదివారం కబడ్డీ పోటీలు పద్మశాలిపురం బస్తీలో జరిగాయి. అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. రవి పబ్లిక్ స్కూల్(మొదటి), సాయి మోడల్ స్కూల్(ద్వితీయ), స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల(తృతీయ) విద్యార్థులు బహుమతులు దక్కించుకున్నారు.

నీట్ పీజీ ప్రశాంతం


హిమాయత్‌నగర్‌లో..

మొయినాబాద్, న్యూస్‌టుడే: నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం చిలుకూరు రెవెన్యూలోని గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో 120 మంది విద్యార్థులకుగాను 119 మంది, హిమాయత్‌నగర్ పరిధిలోని వీజేఐటీలో వంద మందికి 96, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో 120కి గాను 118 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష కొనసాగింది. చేవెళ్ల జోన్ డీసీపీ యోగేశ్‌గౌతం, మొయినాబాద్ డివిజన్ ఇన్‌ఛార్జి ఏసీపీ కిషన్‌గౌడ్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఇన్‌స్పెక్టర్ వై.మల్లికార్జున్‌రెడ్డి ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆలయ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు

కేశంపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని దవళగిరి వేంటేశ్వరస్వామి ఆలయ భూమికి దాతలు రామ్మోహన్‌రావు, తలసాని పవన్‌కుమార్‌రెడ్డి, అమరేష్‌యాదవ్ ఆర్థిక సహకారంతో ఆదివారం ఫెన్సింగ్ వేయించారు. సర్పంచి బొజ్జం సంతోష ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బొజ్జం శ్రీశైలం, మంచె కృష్ణయ్య, తలసాని రమణారెడ్డి, సతీష్, అంజయ్య, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌పట్టణం, న్యూస్‌టుడే: షాద్‌నగర్ ఐసీడీఎస్ పరిధిలో 26 అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ ఉదయ తెలిపారు. అర్హత గల అభ్యర్థులు సోమవారం నుంచి వచ్చే నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మట్టి టిప్పర్ల స్వాధీనం

కేశంపేట, న్యూస్‌టుడే: పాపిరెడ్డిగూడ గ్రామ శివారులో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. శనివారం రాత్రి పోలీసులు ఈ టిప్పర్లను గుర్తించారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేవు. దీంతో టిప్పర్ల యజమానులు జర్పుల శంకర్, నెనావత్ బాబు, డ్రైవర్లు ధీరేందర్‌యాదవ్, అజిత్‌యాదవ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

రహదారి పనులకు శ్రీకారం

చేవెళ్ల: ఖానాపూర్‌లో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం సర్పంచి సింధూర, ఉప సర్పంచి ఇందిరమ్మ ప్రారంభించారు. భాజపా గ్రామ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్, జనార్ధన్‌రెడ్డి, విజయ్, శేఖర్ పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న సర్పంచి సింధూర

లక్ష్మీనగర్ పార్కులో ఉచిత వైద్యశిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: అత్తాపూర్ లక్ష్మీనగర్ పార్కులో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇండో ఎపెక్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో రోగులకు డాక్టర్ వీచిక అన్నపురెడ్డి.. పరీక్షలు నిర్వహించారు. లక్ష్మీనగర్ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోగులకు ఆహార నియమాల గురించి శిరీష వివరించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ధర్మరక్షక్, పార్కు అధ్యక్షులు లక్ష్మీమహేందర్, ప్రభాకర్, కనకయ్య, కె.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో ట్రాఫిక్ ఇక్కట్లు


బారులు తీరిన వాహనాలు

బీజాపూర్, కంది-షాద్‌నగర్ ప్రధాన రహదారులు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. చేవెళ్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. ఉదయం, సాయంత్రం ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల రాకపోకలు స్తంభించిపోతున్నాయి. శంకర్‌పల్లి కూడలి, బస్టాండు, షాబాద్ కూడలి, మార్కెట్‌యార్డు వద్ద తరచూ వాహనాలు నిలిచిపోతున్నాయి. అధికారులు చొరవ తీసుకుని ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, చేవెళ్ల

అనుమానంతో మహిళ దారుణ హత్య

కేసును ఛేదించిన పోలీసులు

రాజాపూర్, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ సమీపంలో మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 18న జరిగిన ఈ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆదివారం రాజాపూర్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. రాజ్‌గఢ్ జిల్లా కచికేడికి చెందిన చోటేఖాన్ లారీ డ్రైవర్. మూడేళ్ల కిందట లారీ నడుపుతుండగా.. షాద్‌నగర్‌లో మహిళ పరిచయమైంది. ఆమె రెండేళ్ల కిందట లాలీ(35) అనే మహిళను చోటేఖాన్‌కు పరిచయం చేసింది. వనపర్తి జిల్లా ఏదుల మండలం సింగాయపల్లి తండాకు చెందిన లాలీకి భర్త, ఇద్దరు పిల్లలున్నా బాలానగర్‌లోని అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారు.

పరిచయం ప్రేమగా మారి..

చోటేఖాన్, లాలీ పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరు కలిసి మద్యం తాగేవారు. లాలీ బాలానగర్‌లో లారీ ఎక్కి చోటేఖాన్‌తో కలిసి బెంగళూరు, నాగ్‌పూర్, తమిళనాడుకు వెళ్లేవారు. అయితే ఆమె వేరే వ్యక్తులతో శారీరక సంబంధం పెట్టుకుందనే అనుమానంతో చోటేఖాన్ పలుమార్లు మందలించాడు. అతడి భార్య కూడా చనిపోవడంతో లాలీని పెళ్లి చేసుకొని, స్వగ్రామంలో ఉండేందుకు నిర్ణయించుకున్నాడు. ఈ విషయం ఆమెకు చెప్పినా చూద్దాంలే అని బదిలిచ్చేవారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య చాలాసార్లు గొడవలు జరిగాయి.

దుప్పట్లో చుట్టి... చోటేఖాన్ లారీతో ఈ నెల 15న కేరళ నుంచి హరియాణాకు బయలుదేరాడు. మార్గంమధ్యలో ఆరు మద్యం సీసాలు కొనుగోలు చేశాడు. 18న బాలానగర్ సమీపంలోని ఓ పంక్చర్ దుకాణం దగ్గర లారీ ఆపి, లాలీకి ఫోన్ చేశాడు. హరియాణకు వెళ్తున్నానని, రావాలని కోరగా.. మరో లారీ వద్ద ఉన్నానని, ఐదు నిమిషాలు ఆగాలని ఆమె సమాధానమిచ్చారు. అనుమానం వచ్చి ఆమె ఉన్న చోటకు వెళ్లగా.. వేరే వ్యక్తులతో కనిపించారు. దీంతో ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. అదే రోజు అర్ధరాత్రి ఆమెను లారీలో ఎక్కించుకున్నాడు. ఎందుకు మోసం చేశావని గొడవ పెట్టుకున్నాడు. అప్పటికే తాగిన మత్తులో ఉన్న చోటేఖాన్ క్షణికావేశంలో కూరగాయల కత్తితో ఆమె గొంతుపై పొడిచాడు. చనిపోయిందని నిర్ధారించుకొని మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి, రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ సమీపంలో రహదారి పక్కన పడేశాడు. అనంతరం లారీతో బెంగళూరు వైపు పారిపోయాడు. 19న స్థానికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అద్దె గదిలో సిమ్‌కార్డు, కాల్‌రికార్డు, సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును 10 రోజుల్లోనే ఛేదించిన జడ్చర్ల గ్రామీణ సీఐ మహేష్, రాజాపూర్ ఎస్సై రాజశేఖర్, సిబ్బందిని అభినందించారు.

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా మధు

తుర్కయంజాల్, న్యూస్‌టుడే: అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఆదివారం ప్రకటించారు. అధ్యక్షుడిగా మధు, ప్రధాన కార్యదర్శిగా పి.శివకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర ఉత్తర్వులు జారీచేశారు.

తుల్జాభవానీకి పూజలు

నార్సింగి: నార్సింగిలో నూతనంగా నిర్మించిన తుల్జాభవానీ దేవి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, సాయిరాం, మహేందర్ గౌడ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి దుర్మరణం

కాటేదాన్, న్యూస్‌టుడే: మైలార్‌దేవుపల్లి వెంకటేశ్వరకాలనీలో నివాసం ఉంటున్న కృష్ణారెడ్డి(68) శనివారం సాయంత్రం ఇంటికి కాలినడకన వస్తుండగా డీసీఎం ఢీకొట్టింది. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. డ్రైవర్ సోహెల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తత అవసరం

చేవెళ్ల, న్యూస్‌టుడే

కొన్ని రోజులుగా చిరుజల్లులు పడుతుండటం, వాతావరణంలో మార్పులు, పారిశుద్ధ్య లోపాలు, నిలువ నీటి కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రజలు జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలతో ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో పదుల సంఖ్యలో చికిత్సకు చేరుతున్నారు. ముఖ్యంగా వైరల్ ఫీవర్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి నిత్యం 300-400 మంది వరకు బయటి రోగులు వస్తుండగా.. వారిలో ఎక్కువ మంది సీజనల్ వ్యాధుల బారిన పడ్డ వారేనని వైద్యులు చెబుతున్నారు.


ప్రభుత్వాసుపత్రిలో రోగులు

పరిశుభ్రత ముఖ్యం.. వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలి. దోమలు ఇళ్లలోకి రాకుండా తెరలు ఉపయోగించాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వేడిగా ఉన్న ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలి. బయట దొరికే తినుబండారాల జోలికి కొన్ని రోజుల పాటు వెళ్లకపోవడం మంచిది. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుంటే వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయొద్దు



–డా.రాజేంద్రప్రసాద్, చేవెళ్ల ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్

జ్వరం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, నీరసం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రస్తుతం వైరల్ ఫీవర్‌తో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. మందులు వాడితే నాలుగు రోజుల్లో సాధారణ పరిస్థితికి చేరుకోవచ్చు. ఇంట్లో ఒకరికి జ్వరం వచ్చినా మిగిలిన వారు అప్రమత్తంగా ఉండాలి.

ఓపెన్ డ్రైనేజీలతో దోమల బెడద



శంకర్‌పల్లి మున్సిపాలిటీ మైనారిటీ కాలనీలోని ఓపెన్ డ్రైనేజీలు భయపెడుతున్నాయి. మురుగు ఓపెన్ కాలువల్లో మడుగులుగా నిలుస్తుండటంతో దోమలు పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా వ్యాధులు ప్రబలుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు పరిశీలించి భూగర్భ మురుగుకాలువల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, శంకర్‌పల్లి

వాహనం నంబరు మార్చిన వ్యక్తిపై కేసు

శంషాబాద్, న్యూస్‌టుడే: ఆమనగల్లు మండలం ముర్తుజాపల్లికి చెందిన వోర్సు రమేశ్.. ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకునేందుకు కారు నంబరు మార్చి రాకపోకలు సాగిస్తున్నాడు. ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు తనిఖీల్లో ఈ కారు పత్రాలు తనిఖీలు చేయగా ఈ విషయం వెలుగుచూసింది. అతనిపై కేసు నమోదు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆర్జీఐఏ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రమోద్‌కుమార్ తెలిపారు.

ఘనంగా బోనాల ఉత్సవం

బండ్లగూడజాగీర్, షాబాద్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ సర్కిల్ కిస్మత్‌పూర్, బండ్లగూడజాగీర్ డివిజన్లలో మల్లన్న బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బోనాల ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శాసనమండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్, మాజీ మేయర్ బి.మహేందర్‌గౌడ్, తెలంగాణ రక్షణ సేన నాయకుడు నీరుడు సర్వేశ్ ముదిరాజ్, గోకరి సురేశ్‌గౌడ్, పాపయ్యయాదవ్ తదితరులు హాజరయ్యారు.

● మల్లారెడ్డిగూడ, కొమరబండ గ్రామాల్లో ఆదివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు సబితా రెడ్డి, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.


బండ్లగూడజాగీర్‌లో మాజీ మేయర్ మహేందర్‌గౌడ్


కిస్మత్‌పూర్‌లో స్వామిగౌడ్


మల్లారెడ్డిగూడలో..


కొమరబండలో..

సైకిళ్లు తొక్కి.. క్రీడాస్ఫూర్తి చాటి


సైకిళ్లు తొక్కుతున్న చిన్నారులు

సరూర్‌నగర్, న్యూస్‌టుడే: సైకిల్ పెడళ్లతో ఆరోగ్య సందేశాన్ని పంచుతూ.. క్రీడాస్ఫూర్తిని చాటుతూ.. జాతీయ క్రీడా దినోత్సవాన్ని క్రీడాకారులు వినూత్నంగా జరుపుకొన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 'సండే ఆన్ సైక్లింగ్' కార్యక్రమంలో వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్న చిన్నారులు, యువత, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిని రంగారెడ్డి జిల్లా యువజన, క్రీడల అధికారిణి ఎస్.స్వర్ణలత అభినందించారు. సైక్లింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నవారికి పతకాలు అందజేశారు.

మహేశ్వరం

•మహేశ్వరం • ఇబ్రహీంపట్నం • కల్వకుర్తి

తీజ్ పండగ.. బంజారాల సంప్రదాయానికి ప్రతీక: ఎమ్మెల్యే


బంజారా మహిళలతో మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్, న్యూస్‌టుడే: బంజారాల సంప్రదాయానికి 'తీజ్' పండగ ప్రతీక అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ పరిధిలోని ఇంజాపూర్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించిన తీజ్ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను బంజారా నాయకులు సత్కరించారు.

కొత్త పింఛన్లకు 23,854 దరఖాస్తులు

☛ నేటితో ముగియనున్న గడువు

విభాగాల వారీగా దరఖాస్తుల వివరాలు	
ఒంటరి మహిళలు	904
వితంతువులు	16,444
దివ్యాంగులు	5,056
చేనేత కార్మికులు	151
గీత కార్మికులు	1,299
మొత్తం	23,854

మహేశ్వరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న చేయూత పింఛన్ల పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు సోమవారం వరకు గడువు ఉంది. కొత్త పింఛన్లు మంజూరు కాక దాదాపు నాలుగేళ్లు గడుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా ఏడు కేటగిరీల్లో రెండు లక్షల చేయూత పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది. ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వితంతువులు, గీత, చేనేత కార్మికులు, డయాలసిస్ రోగులు తదితరుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోంది.

● జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 23,854 మంది వివిధ కేటగిరీల్లో దరఖాస్తులు సమర్పించారు. ఇందులో ఎక్కువగా వితంతువుల నుంచి వచ్చినట్లు గణాంకాలను బట్టి తెలుస్తోంది. దరఖాస్తుల సమర్పణకు ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉండటంతో సోమవారం మరిన్ని వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

కాలనీ.. కష్టాల కహానీ

పొంగుతున్న మ్యాన్‌హోళ్లు.. మురుగుమయంగా రోడ్లు


మురికి కూపంగా మారిన ఇన్‌కమ్ ట్యాక్స్ కాలనీ

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఆర్కేపురం, ఎన్టీఆర్‌నగర్ డివిజన్లలో మురుగు వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఏ కాలనీని చూసినా మురుగు పొంగుతున్న మ్యాన్‌హోళ్లే దర్శమిస్తున్నాయి. ఆర్కేపురం ఇన్‌కమ్ ట్యాక్స్ కాలనీ రోడ్డు నంబర్లు 5, 4, 3ల మీదుగా వెళ్లే ఓపెన్ స్టార్మ్ వాటర్ నాలా గత 10 ఏళ్లుగా తరచూ మట్టి, ప్లాస్టిక్, చెత్త, వ్యర్థాలతో పూడుకుపోతోంది. దీనివల్ల మురుగు నీరు నిలిచి దుర్వాసన వ్యాపించడం, దోమల బెడద, అపరిశుభ్రత ఏర్పడటంతో పాటు, భారీ వర్షాల సమయంలో రోడ్లపైకి మురుగు నీరు చేరుతోందని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గతంలో జీహెచ్ఎంసీ, ప్రస్తుత ఎంఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులకు కాలనీ ప్రతినిధులు అనేక సార్లు వినతులు, ఫిర్యాదులు సమర్పించినా శాశ్వత పరిష్కారం లభించడం లేదని వాపోతున్నారు. నాలాలో చెత్త వేయడం కూడా సమస్యను తీవ్రతరం చేస్తోంది. ఓపెన్ నాలాను శాశ్వతంగా మూసివేసి.. కాలనీలోని సహజ వాలును ఉపయోగించుకొని రోడ్డు నంబర్లు 5, 4, 3ల మీదుగా వర్షపు నీటిని భూగర్భ పైపులైన్ ద్వారా బయట ఉన్న ప్రధాన స్టార్మ్ వాటర్ డ్రైనేజీకి అనుసంధానం చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


సిరినగర్ కాలనీలో..

పురాతన బావి కలుషితం

రోడ్డు నంబరు 2లోని సొసైటీ పార్కు సమీపంలో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కారణంగా మురుగునీరు పార్కులోకి చేరి చారిత్రక పురాతన బావి కలుషితమవుతోంది. ప్రస్తుతం జోనల్ కమిషనర్, సరూర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో బావి పునరుద్ధరణ, సంరక్షణ పనులు జరుగుతున్నాయి. అయితే డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లేకుండా బావిని సంరక్షించడం సాధ్యం కాదని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలు

ఇన్‌కమ్ ట్యాక్స్ కాలనీ, అల్కాపురి కాలనీ, హరిపురి కాలనీ, ఎన్టీఆర్‌నగర్, సిరినగర్ కాలనీ, వాస్తు కాలనీ, చిత్రా లేఅవుట్ కాలనీ.

అధిక సామర్థ్యమున్న పైపులైన్లు ఏర్పాటు చేయాలి: రాజేశ్రీరామారావు, కాలనీ సంఘం ప్రధాన కార్యదర్శి

గతంలో కాలనీలో సుమారు 200 ఇళ్లు ఉండగా... ప్రస్తుతం 75కు పైగా అపార్ట్‌మెంట్లు ఏర్పడటంతో డ్రైనేజీ వ్యవస్థపై భారం బాగా పెరిగింది. కాలనీలో అధిక సామర్థ్యమున్న డ్రైనేజీ పైపులైన్లను ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

మహేశ్వరం	80085 73290
ఇబ్రహీంపట్నం	80085 73295
ఆమనగల్లు, కడ్తాల్	98481 98888
పెద్దఅంబర్‌పేట	80085 73302
సరూర్‌నగర్, ఆదిభట్ల	80085 73294
యాచారం	80085 73297
బాలాపూర్	80085 73293
అబ్దుల్లాపూర్‌మెట్	80085 73301

న్యూస్‌టుడే– తుర్కయంజాల్, మంచాల

? తొర్రూర్ డివిజన్ మునగనూర్-తొర్రూర్ గ్రామాల మధ్య ఇటీవల వేసిన సీసీ రోడ్డు పక్కన మట్టి పోయలేదు. వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. –రాజు

✓ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. –చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈ, ఆదిభట్ల సర్కిల్

? మంచాల మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయ సముదాయంలో ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. –నాగేష్, లోయపల్లి

✓ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. –మధు, సీఐ, మంచాల

ఏకాభిప్రాయంతోనే డీసీసీ అధ్యక్షుడి ఎంపిక



మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి పీవీ మోహన్. చిత్రంలో ఎమ్మెల్యే రంగారెడ్డి, చల్లా నర్సింహారెడ్డి

తుర్కయంజాల్, న్యూస్‌టుడే: నాయకులు, కార్యకర్తల ఏకాభిప్రాయంతోనే డీసీసీ నూతన అధ్యక్షుడిని ఎంపిక చేయనున్నట్లు ఏఐసీసీ కార్యదర్శి పీవీ మోహన్ అన్నారు. ఆదివారం ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ బ్రాహ్మణపల్లి సమీపంలోని ఓ రిసార్టులో సంఘటన్ సృజన్ అభియాన్ నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పీవీ మోహన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేసే సమర్థులైన నాయకుడినే డీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తామని పేర్కొన్నారు. సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు తమ అభిప్రాయాలు చెప్పారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఈవీ శ్రీనివాసరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి తదితరులు పాల్గొన్నారు.

వెంకట క్రాంతికిరణ్‌కు గిడుగు జాతీయ పురస్కారం

కడ్తాల్ (ఆమనగల్లు), న్యూస్‌టుడే: కడ్తాల్ మండలం రావిచెడ్ గ్రామానికి చెందిన పుట్టపాక వెంకట క్రాంతికిరణ్‌కు ప్రతిష్ఠాత్మక గిడుగు జాతీయ పురస్కారం వరించింది. వెంకట క్రాంతికిరణ్ రచించిన కే(కె)కలు వచన కవితా సంకలనాన్ని గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ ఈ ఆవార్డుకు ఎంపిక చేసింది. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం రాత్రి గిడుగు రామమూర్తి ఫౌండేషన్, శంకరం ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు భాషా అభివృద్ధికి కృషి చేస్తున్న పలువురు ప్రముఖులకు పురస్కారాలు అందజేశారు.

కూరగాయల మార్కెట్‌లో వసతులు మృగ్యం


మంచాల రోడ్డులో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం పురపాలక సంఘం పరిధిలో రెండు చోట్ల కూరగాయల మార్కెట్లు ఉన్నాయి. సాగర్ రహదారి పక్కన కూరగాయల మార్కెట్‌లో అన్ని వసతులు ఉన్నాయి. ఇక్కడ రైతుల నుంచి కూరగాయలు కొన్న కమీషన్ ఏజెంట్లు క్రయవిక్రయాలు జరుపుతారు. మంచాల రోడ్డులో ఉన్న మార్కెట్‌కు ప్రతిరోజు వేకువజామున 4 గంటలకు దాదాపు 200 మందికి పైగా రైతులు వచ్చి కూరగాయలు అమ్ముతుంటారు. ఇక్కడ షెడ్లు, శౌచాలయాలు, మూత్రశాలలు లేక రైతులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

దేవతలగుట్ట ఆంజనేయస్వామి ఆలయ ముఖద్వారం ప్రారంభం

బాలాపూర్, న్యూస్‌టుడే: దేవతలగుట్ట స్వయంభూ శ్రీఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మాజీ మేయర్ చిగురింత పారిజాత అన్నారు. బడంగ్‌పేట డివిజన్‌లోని ఆర్‌సీఐ ప్రధాన రహదారి నుంచి ఆలయానికి వెళ్లే దారిలో నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని ఆదివారం ఆమె స్థానికులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వి.ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పి.రాజేందర్‌రెడ్డి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కె.నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ బాలాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎన్.శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్ పీజీ


కొత్తగూడెంలోని నీట్ పీజీ పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ అనంతరం లోపలికి పంపుతున్న సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామపంచాయతీ పరిధి కొత్తగూడెంలోని టీసీఎస్ అయాన్ డిజిటల్ జోన్ సెంటర్ 1, 2లలో ఆదివారం నీట్ పీజీ ప్రశాంతంగా ముగిసింది. సెంటర్-1లో మొత్తం 920 మంది విద్యార్థులకు గాను 901 మంది హాజరయ్యారు. సెంటర్-2లో 920 మందికి 888 మంది పరీక్ష రాశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే పరీక్ష కేంద్రంలోని అనుమతించారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేయగా.. వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి పర్యవేక్షించారు.

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం పురపాలక పరిధి శేరిగూడలోని శ్రీచక్ర కళాశాలలో ఆదివారం జరిగిన నీట్ పీజీ ప్రశాంతంగా ముగిసింది. 920 మంది విద్యార్థులకు గాను 899 మంది హాజరయ్యారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

హత్య చేసి.. చెరువులో పడేసి!

పహాడీషరీఫ్, న్యూస్‌టుడే: ఓ వ్యక్తిని హత్య చేసి చెరువులో పడేసిన ఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఠాణా పరిధిలోని బడంగ్‌పేట కార్పొరేషన్ వెంకటాపూర్ గ్రామం బురాన్‌ఖాన్ చెరువులో మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి పోలీసులు వెళ్లి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడికి సుమారు 40 ఏళ్లుంటాయి. వివరాలు తెలియరాలేదు. ఎవరో అతడిని హత్య చేసినట్లు తలపై, గొంతుపై గాయాలున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈశ్వరప్పకు నివాళి

జాపాల(మంచాల), న్యూస్‌టుడే: సీపీఎం జిల్లా నాయకుడు బకున ఈశ్వరప్ప వర్ధంతిని ఆయన స్వగ్రామం జాపాలలో కుటుంబ సభ్యులు, అభిమానులు ఘనంగా జరుపుకొన్నారు. ఈశ్వరప్ప స్థూపం వద్ద ఘనంగా నివాళి అర్పించారు. వివిధ పార్టీల నాయకులు యాదయ్య, బీమయ్య, ఐయిలయ్య, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహంలో రక్షాబంధన్

ఆర్కేపురం, న్యూస్‌టుడే: మలక్‌పేట అగర్వాల్ సమాజ్ సత్యశక్తి మహిళా శాఖ ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహంలో ఆదివారం రాఖీ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గృహంలోని విద్యార్థులకు వాషింగ్ మిషన్, కుక్కర్లు, స్టేషనరీ, రేషన్ వస్తువులను వితరణ చేశారు. లక్ష్యసాధనపై విద్యార్థులకు డాక్టర్ రాహుల్ అగర్వాల్, జితేష్ అగర్వాల్ అవగాహన కల్పించారు. తెలంగాణ అగర్వాల్ సమాజ్ సెంట్రల్ కమిటీ ట్రెజరర్ రాజగోపాల్, గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్, కమిటీ సభ్యులు మహాత్మా, శ్రీనివాస్, సత్యశక్తి మహిళా శాఖ అధ్యక్షురాలు రాణీ మిత్తల్, కార్యదర్శి నీతీ అగర్వాల్, ఉపాధ్యక్షురాలు పుష్పా అగర్వాల్, సంయుక్త కార్యదర్శి కవితా అగర్వాల్ పాల్గొన్నారు.

సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తే ఉన్నత స్థాయికి..


ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు

బాలాపూర్, న్యూస్‌టుడే: ఏ పనైనా సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మీర్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు డా.గుర్రం ప్రభాకర్‌రెడ్డి పదవీ విరమణ సభ ఆదివారం జిల్లెలగూడలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఒక సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసే వారు జీవితంలో ఎందులోనైనా రాణిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఖమ్మం ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ట్రైకార్ ఛైర్మన్ రాంచందర్ నాయక్, సెక్రటేరియట్ సీఆర్‌వో వెంకన్న, ఆర్కియాలజీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డా.రాములు నాయక్, కళాశాల ప్రిన్సిపల్ ఆవుల వెంకన్న, వికారాబాద్ ఎంపీడీవో వినయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ శివచంద్ర పాల్గొన్నారు.

సంపాదనను ఎలా వినియోగిస్తున్నామన్నదే ముఖ్యం


మాట్లాడుతున్న చిన్నజీయర్ స్వామి

ఆదిభట్ల, న్యూస్‌టుడే: అర్థ అంటే సంపద అని.. సంపాదించిన ధనాన్ని ఎలా వినియోగిస్తున్నామన్నదే ముఖ్యమని చినజీయర్‌స్వామి అన్నారు. కొంగరకలాన్‌లో ఆదివారం నిర్వహించిన అర్క్ అర్థ, అర్క్ ఆర్యమ ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. అనవసర వినోదాలపై ఖర్చు చేసినప్పుడు సంపద వృథా కావచ్చని, సమాజానికి మేలు చేసే కార్యక్రమాలకు వినియోగిస్తే దానికి సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. అర్క్ గ్రూప్ ఛైర్మన్ గుమ్మి రామ్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు, ప్రాజెక్టు నిర్వాహకులు పాల్గొన్నారు.

నోటీసులు అందుకున్న ఓటర్లు వివరాలు సరిచేసుకోవాలి

మంచాల, న్యూస్‌టుడే: ముసాయిదా ఓటరు జాబితాలో వివరాలు తప్పుగా నమోదైన వారికి నోటీసులు అందిస్తున్నట్లు మంచాల తహసీల్దార్ ప్రసాద్‌రావు తెలిపారు. నోటీసులు అందుకున్న వారంతా పంచాయతీ కార్యదర్శి, బీఎల్‌వోల వద్ద సరిచేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 12 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

లింగరావుపల్లిలో 'సర్' గ్రామసభ

తలకొండపల్లి, న్యూస్‌టుడే: లింగరావుపల్లి గ్రామంలో తహసీల్దార్ రమేష్ కుమార్ ఆదివారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) గ్రామసభ నిర్వహించారు. సభలో ఓటర్లకు బీఎల్‌వోలు నోటీసులను అందించారు. ఆర్ఐ శ్రవణ్‌కుమార్, సర్పంచి శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు


ఆమనగల్లులో..


తారామతిపేట్‌లో..


మంచాల మండలం జాపాలలో బోనాల సందడి


యాచారం మండలం కుర్మిద్దలో

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: నాగోల్ సర్కిల్ కుంట్లూర్ డివిజన్ పరిధిలోని తారామతిపేట్ గ్రామంలో ఆదివారం బోనాల ఉత్సవాలు కనులపండువగా జరిగాయి. గ్రామంలోని పోచమ్మ తల్లి, మాతా మహంకాళి అమ్మవార్ల ఆలయాలతో పాటు బీరప్ప స్వామి బోనాల జాతర వైభవంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి బోనాలు తీసిన గ్రామస్థులు ఆలయాల్లో సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

యాచారం, న్యూస్‌టుడే: మండలంలోని యాచారం, గున్‌గల్, కుర్మిద్ద, చింతపట్ల, మాల్, నల్లవెల్లి, మేడిపల్లిలో ఆదివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోతరాజుల ఆటపాటలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ దేవతలకు సమర్పించారు.

ఆమనగల్లు, న్యూస్‌టుడే: ఆమనగల్లులో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో కంఠమేశ్వర స్వామి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బాజాభజంత్రీలు, శివసత్తులు, పోతరాజుల నృత్యాలు, కళాకారుల ఆటపాటలతో బోనాలను ఊరేగిస్తూ ఆలయాలకు చేరుకుని సమర్పించారు. మిషన్ భగీరథ కమిషన్ మాజీ వైస్ ఛైర్మన్ ఉప్పల వెంకటేశ్ గుప్తా, కౌన్సిలర్ రమేశ్, గౌడ సంఘం నాయకులు అల్లాజీగౌడ్, రవీందర్‌గౌడ్, నిరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.



రోడ్డు వేశారు.. క్యూరింగ్ మరిచారు

పెద్దఅంబర్‌పేట్ డివిజన్ కుంట్లూర్‌లోని శివాలయం సమీపంలో ఇటీవలే సీసీ రోడ్డు వేశారు. సిమెంటు రోడ్డు పటిష్ఠంగా ఉండాలంటే కనీసం మూడు వారాల పాటు చేయడం అవసరం. కానీ, ఇక్కడ నీళ్లు పోసేందుకు మట్టితో కట్టలు కట్టించిన గుత్తేదారు నీళ్లు మాత్రం పోయడం లేదు. –న్యూస్‌టుడే, పెద్దఅంబర్‌పేట్

సంగీత నృత్య నీరాజనం


నాట్యం చేస్తున్న విద్యార్థినులు

ఎల్.బి.నగర్: సంస్కార భారతి, ఎస్‌కేఎన్ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వనస్థలిపురంలోని బాంబూ ట్రీ పార్కులో 150 మంది విద్యార్థినులతో వందేమాతరం గీతానికి కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాస్కీగౌడ్, సంస్కార భారతి అధ్యక్షురాలు అనంతలక్ష్మి, ఎస్‌కేఎన్ కళాక్షేత్రం నిర్వాహకులు వెంకట్, కృష్ణకుమారిలు, కో ఆర్డినేటర్ డా.శూలపాణి, వండర్ బుక్ ఆఫ్ రికార్డు నిర్వాహకులు బి.నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మహేశ్వరం, యాచారం, న్యూస్‌టుడే: జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ల పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి శాంతిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 నుంచి సెప్టెంబరు 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఆమనగల్లు ప్రాజెక్టు పరిధిలో 31, చేవెళ్ల పరిధిలో 29, హయత్‌నగర్ పరిధిలో 3, ఇబ్రహీంపట్నం పరిధిలో 21, మహేశ్వరంలో 10, శేరిలింగంపల్లిలో 5, షాద్‌నగర్‌లో 26 కలిపి మొత్తం 125 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. మొత్తం పోస్టుల్లో ఎస్టీలకు 28, ఎస్సీలకు 11, ఇతరులకు 86 కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు https:///www.wdcw.tg.nic.in వెబ్‌సైట్‌ని చూడాలని కోరారు.

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో కవాడిపల్లి 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు నాగోల్ సర్కిల్ పరిధిలోని తారామతిపేట్ అంగన్‌వాడీ-2 కేంద్రంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హయత్‌నగర్ సీడీపీవో ఎస్.రేణుక తెలిపారు.



రోడ్డుపై నీరు నిలిచి ఇక్కట్లు

మంగల్‌పల్లి గేటు వద్ద సాగర్ రహదారి పక్కన ఇబ్రహీంపట్నం వైపు బస్సులు నిలిపే బస్టాపు వద్ద చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై నీరు రోజుల తరబడి వర్షం నిలిచిపోతోంది. ప్రయాణికులు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. –న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

భాజపా రాష్ట్ర సాంస్కృతిక విభాగం సభ్యుడి నియామకం

నాగోలు, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర సాంస్కృతిక విభాగం సభ్యుడిగా నాగోలుకు చెందిన ప్రముఖ పౌరాణిక పద్య నాటక రంగస్థల నటుడు, గాయకుడు చల్లగాలి వెంకటరాజును నియమించారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆదేశాల మేరకు రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్ నాగపురి రాజమౌళి ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు.

మన్ కీ బాత్.. స్ఫూర్తిదాయకం: భాజపా

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి నిర్వహించే 'మన కీ బాత్' కార్యక్రమం స్ఫూర్తిదాయకమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు పేర్కొన్నారు. ఆదివారం భాజపా రంగారెడ్డి అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో హస్తినాపురం వీక్షించారు. 'దేశ ప్రగతి - ప్రజల భాగస్వామ్యం' సామాజిక బాధ్యత వంటి అంశాలపై స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని అందించారని పలువురు నేతలు పేర్కొన్నారు. ఇందులో భాజపా రాష్ట్ర ప్రధానకార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మెడ్చల్ రూరల్ ఇన్‌ఛార్జి సామ రంగారెడ్డితో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆర్థిక పురోగతికి పరస్పర సహకారం అవసరం

మలక్‌పేట, న్యూస్‌టుడే: ఒకరినొకరు సహకరించుకుంటూ ఆర్థికంగా పురోగతి సాధించడంతో మేలు జరుగుతుందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం అస్మాన్‌గఢ్‌లోని సరస్వతీ పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం 18వ సర్వసభ్య సమావేశం సరస్వతీనగర్ కాలనీలోని వైదేహి ఆశ్రమంలో జరిగింది. సేవిక సమితి తెలంగాణ ప్రాంత మహిళా ప్రముఖ్ కాంచన, సహకార భారతి తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు యెక్కటి ఉపేందర్‌రెడ్డి, సహకార భారతి తెలంగాణ ప్రాంత ప్రముఖ్ కుడుముల పాండురంగారెడ్డి, అధ్యక్షుడు కాటమోని రమాదేవి పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా మధు

తుర్కయంజాల్, న్యూస్‌టుడే: అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఆదివారం ప్రకటించారు. అధ్యక్షుడిగా మధు, ప్రధాన కార్యదర్శిగా పి.శివకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర ఉత్తర్వులు జారీచేశారు.

కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా 1న చలో దిల్లీ

మంచాల, న్యూస్‌టుడే: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక పాలనకు నిరసనగా సెప్టెంబరు 1న చలో దిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు, సీపీఐ నేత కొంతం మాధవరెడ్డి తెలిపారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వాలీబాల్ టోర్నీలో పటేల్ చెర్వుతండా విజయం


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న బీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ బూడిద రామ్‌రెడ్డి, ఏడుకొండలు, రాఘవరెడ్డి తదితరులు


ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: చక్కగా చదువుకునే పేద విద్యార్థులకు, క్రీడాకారులకు బీఆర్‌ఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందని ఛైర్మన్ బూడిద రామ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలో సాయి కీర్తన్‌రెడ్డి లెగసీ నిర్వహణలో నెల రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నీ ఫైనల్ నిర్వహించారు. ఇందులో పటేల్ చెర్వుతండా జట్టు విజయం సాధించగా.. చింతపట్ల, సీతారాంపేట్, తుర్కయంజాల్ జట్లు వరుసగా రెండు, మూడు, నాలుగో స్థానాల్లో నిలిచాయి. ఆ జట్లకు నగదు బహుమతులతో పాటు షీల్డులను అందజేశారు. అనంతరం యువత, విద్యార్థులతో మాదకద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ద మిషన్ ఫౌండర్ ఏడుకొండలు, పీఈటీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాఘవరెడ్డి, ఉప్పరిగూడ సర్పంచి బోసుపల్లి శ్రీవేణి, మాజీ ఉపసర్పంచి బూడిద నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

ఖైరతాబాద్
• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

నయనమనోహరంగా నృత్య విన్యాసం



రవీంద్రభారతి, న్యూస్‌టుడే: యువనర్తకి **పార్థవి రెడ్డి** రంగప్రవేశం ఆద్యంతం నయనమనోహరంగా సాగింది. ఆదివారం రవీంద్రభారతిలో నిశ్రింకల డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పార్థవి రెడ్డి ప్రదర్శించిన అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈమె నాట్య గురువులు సాయి వెంకట గంగాధర్, లక్ష్మి వెంపడప్పల మార్గదర్శకత్వంలో పదేళ్లుగా కూచిపూడి నృత్య శిక్షణ పొందారు. శ్రీదేవి నృత్యాలయ (చెన్నై) వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ షీలా ఉన్నికృష్ణన్ జ్యోతి వెలిగించి ప్రదర్శనను ప్రారంభించారు. శ్రీవిష్ణు రాజం భజే, రాగమాలిక రాగం, శివస్తుతి, బాలగోపాల తరంగం, దశావతారం వంటి అంశాలను అద్భుతంగా ప్రదర్శించి మెప్పించింది.

యువకుడి అవయవదానం.. ముగ్గురికి పునర్జన్మ



కన్నెబోయిన ప్రవీణ్

నిమ్స్, న్యూస్‌టుడే: జీవన్మృతుడైన ఓ యువకుడి అవయవదానం.. ముగ్గురికి పునర్జన్మనిచ్చేలా చేసింది. జనగాం జిల్లా గానుగుపహాడ్‌కు చెందిన కన్నెబోయిన ప్రవీణ్ (24) ఆర్‌ఎంపీ వైద్యుడు. ఈ నెల 27న తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అడవిపంది అడ్డు వచ్చి అదుపుతప్పి కిందపడిపోయారు. తీవ్రంగా గాయాలవడంతో కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు బ్రెయిన్‌డెడ్ అయినట్లు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌వోటీటీవో (రాష్ట్ర అవయవ, కణజాల మార్పిడి సంస్థ-జీవన్‌దాన్) వైద్య బృందం ఆయన తండ్రి అంజయ్య, కుటుంబీకులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. వారు అంగీకరించడంతో రెండు కిడ్నీలు, కాలేయం సేకరించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు శస్త్రచికిత్స ద్వారా అమర్చినట్లు నోడల్ అధికారి శ్రీభూషణ్‌రాజు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
యూసుఫ్‌గూడ	80085 73352
బంజారాహిల్స్	80085 73348
పంజాగుట్ట	8008573350
రహ్మత్‌నగర్	80085 73351
షేక్‌పేట	80085 73413

షేక్‌పేట, బంజారాహిల్స్, న్యూస్‌టుడే:

? వినాయకనగర్ కాలనీలోని తాగునీటి పైపులైన్లలో మురుగు చేరుతోంది. నల్లా విప్పితే నీరు రంగు మారి దుర్గంధంతో వస్తోంది. –కిషోర్, వినాయకనగర్

✓ మురుగు నీరు ఎలా చేరుతోందో పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. –వైష్ణవి, మేనేజర్, జలమండలి

? బంజారాహిల్స్ రోడ్డు నం.1లోని అంబేడ్కర్ విగ్రహం ఉన్న ప్రదేశం సమీపంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ కుంగిపోయింది. రాకపోకలు అధికంగా సాగే ఈ దారిలోని సమస్యను పరిష్కరించండి. – వీరాస్వామి

✓ సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – శరత్‌కుమార్‌రెడ్డి, జలమండలి డీజీఎం

? బంజారాహిల్స్‌లో పోలీస్‌స్టేషన్ ఉన్న వీధిలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతంలో చీకటిపడిన తర్వాత రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంది. సమస్యను పరిష్కరించండి.– లక్ష్మీకాంత్, ప్రైవేటు ఉద్యోగి

✓ ఆ ప్రదేశంలో గతంలో సమస్య తలెత్తితే పరిష్కరించాం. సమస్య ఉత్పన్నమైనట్లు మా దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – మోహన్‌రావు, జీహెచ్‌ఎంసీ ఏఈ

సమన్వయ లోపం.. సమస్యలే నిత్యం

షేక్‌పేట, న్యూస్‌టుడే

ప్రభుత్వ విభాగాల సమన్వయ లోపం వల్ల అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. షేక్‌పేట, ఓయూ కాలనీ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మురుగునీటి పైపు లైన్‌లను పరిశీలించకుండానే వాటిని ధ్వంసం చేస్తూ తవ్వకాలు సాగించి రోడ్లు వేస్తున్నారు. ముందే పైపు లైన్‌లు, మ్యాన్‌హోల్స్ నిర్మించకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి.

● షేక్‌పేట మారుతీనగర్‌లో ఐదు నెలల కిందట సీసీ రోడ్డు నిర్మించారు. సిమెంట్ వేసేటప్పుడు మురుగునీటి మ్యాన్‌హోల్‌లోకి చేరకుండా కనీస జాగ్రత్తలు తీసుకోలేదు. హడావుడిగా రోడ్డుపై వేసి చదును చేశారు. కాంక్రీట్ మ్యాన్‌హోల్స్‌లోకి చేరి గడ్డ కట్టింది. దీంతో మురుగునీరు ముందుకు సాగక రోడ్లపైకి వస్తోంది. ఈ క్రమంలో వీధి నంబర్లు 13, 14లో నిత్యం మురుగు సమస్య తలెత్తుతోంది. రోడ్డు వేయక ముందు అక్కడ అసలు ఈ సమస్యే ఉత్పన్నమయ్యేది కాదు.

● తాజాగా ఓయూ కాలనీలో నెల రోజుల కిందట సీసీ రోడ్డు నిర్మించారు. అక్కడా మురుగునీటి వ్యవస్థ ధ్వంసమైంది. దాని ఫలితంగా మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయి. చేసేది లేక జలమండలి అధికారులు అక్కడ కొత్తగా వేసిన సీసీ రోడ్డును తవ్వి మ్యాన్‌హోల్స్‌ను పునరుద్ధరిస్తున్నారు. ● రాహుల్ కాలనీలో తవ్విన రోడ్డునే తవ్వుతూ వరదనీటి పైపులైన్ నిర్మాణం చేపడుతున్నారు.

● వినోబానగర్‌లో ఓ వీధిలో అవసరం లేకపోయినా అధికారులు మురుగునీటి పైపులైన్ నిర్మించి రోడ్డును ధ్వంసం చేశారు. పునరుద్ధరించినా అస్తవ్యస్త పనులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ అభివృద్ధి పనులు చేపడితేనే ప్రయోజనం ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.



ఓయూ కాలనీలో మ్యాన్‌హోల్ పునరుద్ధరణకు కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డును తవ్వారిలా..

ఇదీ పరిస్థితి.. షేక్‌పేట ఓయూ కాలనీ, మారుతీనగర్, ఆదిత్యానగర్, రాహుల్ కాలనీ, సూర్యానగర్ కాలనీల్లో రోడ్లు, మురుగునీటి మ్యాన్‌హోల్స్ పనులు చేపడుతున్నారు. ముందే మురుగునీటి వ్యవస్థ నెట్ వర్క్, మ్యాన్‌హోల్స్‌ను పరిశీలించి అవి దెబ్బ తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దీనికి జీహెచ్‌ఎంసీ అధికారులు జలమండలితో సంప్రదించాల్సి ఉండగా అలా జరగడం లేదు.

రేపటి నుంచి గోర్ ధర్మ జాగృతి మహా పాదయాత్ర



కరపత్రం ఆవిష్కరిస్తున్న భౌసింగ్ మహారాజ్ తదితరులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: గోర్ ధర్మ జాగృతి కోసం సెప్టెంబరు 1 నుంచి మహా పాదయాత్ర చేపడుతున్నట్లు సంత్ సేవాలాల్ మహారాజ్ మందిరం నిర్వాహకుడు భౌసింగ్ మహారాజ్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో దానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. పాదయాత్ర వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అజ్మీరా మంగ తాండాలోని సేవాలాల్ మందిరం వద్ద ప్రారంభమై నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల మీదుగా కొనసాగి మహారాష్ట్రలోని పహారాదేవి మందిరం వద్ద ముగుస్తుందన్నారు. దాదాపు 475 కి.మీ. 15 రోజులపాటు యాత్ర కొనసాగనుందని వివరించారు. లంబాడా సమాజం యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ హుస్సేన్ నాయక్, ప్రతినిధులు శ్రీనివాస్, లాలూప్రసాద్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ ఎంపవర్‌మెంట్ ఫెస్ట్‌ను విజయవంతం చేయండి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మహిమ, శంకర్, విజయానంద్, అర్జున్, విక్రమ్ సాగర్, రాజా, రమణ

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: యువతలో విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు పసాలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 18న భువనగిరి జిల్లా మోత్కూర్‌లో ఉచిత 'యూత్ ఎంపవర్‌మెంట్ ఫెస్ట్' నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విక్రమ్ సాగర్ పసాలా, సహ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అర్జున్ మదాసు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో వారు కార్యక్రమం గోడపత్రికను ఆవిష్కరించారు. ఫెస్ట్‌లో విద్యార్థులు, యువత, విద్యావేత్తలు, నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిటీ ప్రతినిధులను ఒకే వేదిక పైకి తీసుకొచ్చి విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సాంకేతికత, నాయకత్వం, వ్యక్తిగత అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఫౌండేషన్ పిల్లలు, యువత, మహిళలు, రైతులు, వృద్ధులకు విద్య, సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, సామాజిక అభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఫెస్ట్‌లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఫౌండేషన్ సీఈవో గోకుల్ రమణ, ప్రోగ్రామ్ డైరెక్టర్ రాజా, రీజినల్ కోఆర్డినేటర్ పసాలా విజయానంద్, ప్రతినిధులు శంకర్, జి. మహిమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఇందిరమ్మ క్యాంటీన్



ఫుట్‌పాత్‌పై భోజనాల వడ్డన



క్యాబిన్ లోపల పందికొక్కులు తవ్విన మట్టి

నారాయణగూడ క్రైస్తవ సీమెట్రి ఫుట్‌పాత్‌పై ఉన్న ఇందిరమ్మ క్యాంటీన్ క్యాబిన్ శిథిలావస్థకు చేరుకుంది. రోజూ 250 మంది వరకు ఇక్కడ రూ.5ల భోజనం తింటారు. క్యాబిన్‌లో పందికొక్కులు చేరి మట్టిని తవ్వేసి అధ్వానంగా మార్చేశాయి. రోజూ ఉదయం వచ్చే సిబ్బంది మట్టిని బయట ఎత్తిపోస్తున్నా పరిస్థితిలో మార్పు ఉండటం లేదు. తెల్లవారి వచ్చేసరికి మళ్లీ మట్టి ఉంటోంది. ఇప్పటివరకు చిన్నపాటి ట్రాలీ కంటే ఎక్కువ మట్టే అక్కడి నుంచి తొలగించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అడుగు భాగమంతా దెబ్బతినటంతో క్యాబిన్ ఒకవైపు కుంగిపోయింది. లోపల భరించలేని దుర్వాసన కూడా వస్తోంది. అనారోగ్యకర వాతావరణంలో భోజనాలు వడ్డిస్తే ఎవరైనా తింటారా? అందుకే సిబ్బంది ఫుట్‌పాత్ పైనే భోజనాలు వడ్డిస్తున్నారు. అసలే వర్షాకాలం, ఎప్పుడు జల్లులు కురుస్తున్నాయో.. ఎప్పుడు ఎండ వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. సిబ్బంది చెట్టు కొమ్మల నీడలో నిలబడి భోజనం వడ్డించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు ఏడాదిగా చెబుతున్నా క్యాబిన్‌ను మార్చటం లేదు. మూడు వారాలుగా రోడ్డు పైనే భోజనాల వడ్డన కొనసాగుతోంది. అధికారులు సమస్యను త్వరగా పరిష్కరించాలని అక్కడికి భోజనం చేసేందుకు వస్తున్నవారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హిమాయత్‌నగర్

విగ్రహాల తరలింపునకు ఇబ్బందుల్లేకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జేటీసీ వెంకటరమణ

సోమాజిగూడ: ఉత్సవ విగ్రహాల తరలింపు విషయంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తామని జేటీసీ వెంకటరమణ అన్నారు. గణేశ్ ఉత్సవాల విజయవంతానికి ఆదివారం ఆయన ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉత్సవ విగ్రహాల తరలింపునకు సంబంధించి వాహనాల కేటాయింపుపై చర్చించారు. సమావేశంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ సెక్రెటరీ జనరల్ డా.ఆర్.శశిధర్ పాల్గొన్నారు.

కె.రాజిరెడ్డి మృతి జలమండలి కార్మికులకు తీరని లోటు

ఖైరతాబాద్ : జలమండలి సీనియర్ కార్మిక నేత కె.రాజిరెడ్డి మృతి కార్మికులకు తీరని లోటని జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం రాజిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయం వద్ద పూలమాల ఉంచి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. దీర్ఘకాలంగా జలమండలి ఉద్యోగులు, కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం రాజిరెడ్డి అలుపెరగని కృషి చేశారని పేర్కొన్నారు.

సాంస్కృతిక శాఖకు నిధుల కేటాయింపు పెంచాలి



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కోలేటి దామోదర్ గుప్తా, లలిత, కృష్ణారావు, బి.సత్యప్రసాద్ తదితరులు

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ఏ ప్రభుత్వంలో అయినా సాంస్కృతిక శాఖ నామమాత్రమే అన్నట్లుగా ఉంటుందని, దానికి తగిన నిధులు కేటాయిస్తేనే మన సంస్కృతి, కళలను కాపాడుకోవచ్చని రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 'జయహో భారత్'- 'శ్రావణ మాసం - సుస్వరనాదం' శీర్షికన ప్రత్యేక సాంస్కృతికోత్సవాన్ని నిర్వహించారు. కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అతిథులుగా కోలేటి దామోదర్ గుప్తా, నటుడు శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు కళాకారులకు ఆర్థికంగా ఆదుకోకపోయినా ఫర్వాలేదని, కళావేదికలను ఉచితంగా ఇస్తే చాలని పేర్కొన్నారు. అకాడమీ అధ్యక్షురాలు లలిత, సామాజికవేత్త కృష్ణారావు, బనారస్ యూనివర్సిటీ సంగీతం, ప్రదర్శన కళలశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.బి.సత్యవరప్రసాద్, సంగీత నాట్యగురువులు తదితరులున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట బురిడీ

సనత్‌నగర్, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అధిక లాభాలొస్తాయని నమ్మించిన సైబర్ మోసగాళ్లు ఓ వ్యక్తి నుంచి రూ.45.67 లక్షలు కాజేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. సనత్‌నగర్‌కు చెందిన శ్రీనాథ్ చంద్రగిరి ఇటీవల ఫేస్‌బుక్‌లో ఆన్‌లైన్ షేర్ ట్రేడింగ్, పెట్టుబడులతో అధిక లాభాలొస్తాయనే ప్రకటన చూశాడు. లింక్‌పై క్లిక్ చేయగా ఓ వ్యక్తి శ్రీనాథ్‌ను వాట్సప్‌లో సంప్రదించి ఓ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాడు. సిద్ధి అగర్వాల్ పేరుతో ఉన్న ఓ నంబరుతో ఫోన్ చేయించి ఓ మహిళను శ్రీనాథ్‌కు పరిచయం చేశాడు. షేర్ ట్రేడింగ్‌లో తొలుత రూ.3.50 లక్షలు పెట్టుబడి పెట్టించి రూ.6.50 లక్షలు లాభం వచ్చినట్టు చూపారు. అందులో నుంచి రూ.84 వేలు విత్‌డ్రా చేసుకున్న శ్రీనాథ్ వారిని పూర్తిగా నమ్మాడు. అనంతరం ఎక్కువ లాభాల కోసం పలు విడతల్లో మొత్తం రూ.45.67 లక్షలను పెట్టుబడి పేరిట సైబర్ నేరగాళ్లు వసూలు చేశారు. చివరికి వారు స్పందించకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మోసం చేసి రూ.1.04 లక్షల కాజేత

బేగంపేట: సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని మోసం చేసి రూ.1.04 లక్షలు కాజేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బేగంపేట శ్యామ్‌లాల్ బిల్డింగ్స్‌కు చెందిన రాజ్‌కుమార్ ఇటీవల తన ఇంట్లోని మ్యాట్రెస్ విక్రయించేందుకు ఓఎల్‌ఎక్స్‌లో ప్రకటన ఇచ్చాడు. రోహన్ అనే వ్యక్తి ఫోన్‌చేసి తాను కొనుగోలు చేస్తానన్నాడు. రూ.5ను ఆయన ఖాతాకు పంపాడు. డబ్బు అందుకోవాలంటే తాను పంపిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి యూపీఐ పిన్ ఎంటర్ చేయాలని చెప్పాడు. నమ్మిన రాజ్‌కుమార్ స్కాన్‌చేసి పిన్ నమోదు చేశాడు. వెంటనే ఖాతా నుంచి రూ.1.04 లక్షలు డెబిట్ అయ్యాయి.

టెలిగ్రామ్ టాస్కుల పేరిట విద్యార్థినికి టోకరా

బేగంపేట, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరిట టెలిగ్రామ్ గ్రూపులో చేర్చుకుని ఓ విద్యార్థినిని మోసం చేసిన ఘటన బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలంరాయికి చెందిన విద్యార్థిని హీనాను ఇటీవల మెగా అడ్వాన్స్ డెయిలీ టాస్క్ పేరుతో ఉన్న టెలిగ్రామ్ గ్రూపులోకి యూసుఫ్ శాంసన్ అనే వ్యక్తి చేర్చాడు. ప్రాపర్టీ ప్రమోషన్, గూగుల్ రివ్యూలు తదితర ఆన్‌లైన్ టాస్కులు చేస్తే ఆదాయం వస్తుందని నమ్మించాడు. తొలుత కొన్ని సులభమైన టాస్కులు చేయించి రూ.180 చెల్లించాడు. దీంతో బాధితురాలు ఆన్‌లైన్ టాస్కులను నమ్మింది. విడతల వారీగా రూ.4.46 లక్షలు చెల్లించింది. డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా మరో రూ.1.5 లక్షలు చెల్లిస్తేనే గతంలో పెట్టుబడి పెట్టిన డబ్బు చెల్లిస్తామని స్పష్టం చేశారు. తాను మోసపోయినట్టు గ్రహించి బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వైద్యురాలి ఐప్యాడ్ చోరీ

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న ఓ వైద్యురాలి ఐప్యాడ్ చోరీకి గురైన ఘటన ఫిల్మ్‌నగర్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఫిల్మ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో డా.ఎం.అశ్విని వైద్యురాలిగా పని చేస్తున్నారు. ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆమె తన యాపిల్ ఐప్యాడ్‌ను మొదటి అంతస్తులో ఉంచారు. సాయంత్రం 6 గంటలకు వచ్చి చూసుకునేసరికి అది కనిపించలేదు. చోరీకి గురైందని ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్కు నిండా చెత్తే



బోరబండ కల్యాణ్‌నగర్ ప్రధాన రహదారిపై రోడ్డు మధ్యన ఉన్న పార్కులో కంచె తొలగించి మరీ చెత్త వేస్తున్నారు. పచ్చదనం పెంచాలని, కాపాడుకోవాలని ఎంత చెబుతున్నా ఆ స్ఫూర్తి మాత్రం ప్రజల్లో కొరవడింది. అధికారులు స్పందించి మళ్లీ కంచె ఏర్పాటు చేసి పార్కు రక్షణకు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

ముగిసిన క్రీడోత్సవాలు

నారాయణగూడ, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాట్) ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా 'ఖేలేగా భారత్- జీతేగా భారత్' నినాదంతో నిర్వహించిన క్రీడా, ఫిట్‌నెస్ కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఆయన సేవలను స్మరించడంతో పాటు క్రీడా ప్రాధాన్యం, క్రీడాస్ఫూర్తి, ఆరోగ్యకర జీవన విధానాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు సాట్స్ అధికారులు వివరించారు. 'ఏక్ ఘంటా ఖేల్‌కే మైదాన్‌మే' కార్యక్రమం పేరిట ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ తదితర పోటీలతో పాటు '29 ఛాలెంజ్', 'పాస్ ది బాల్ ఛాలెంజ్', 'మీట్ ది ఛాంపియన్స్' వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. మహిళలు, యువత, వయోధికులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. వేడుకల ముగింపు సందర్భంగా 'స్పెషల్ సండేస్ ఆన్ సైకిల్', రన్‌లు, వాకథాన్‌లు నిర్వహించినట్లు వివరించారు.

న్యాయవాదికి కత్తి చూపి బెదిరింపు

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: న్యాయవాదిని వెంబడించి కత్తితో బెదిరిస్తూ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసిన ఓ వ్యక్తిపై ఫిల్మ్‌నగర్ ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. బృందావన్‌కాలనీకి చెందిన న్యాయవాది జబర్ అహ్మద్‌ను శనివారం ఉదయం ఇద్దరు వ్యక్తులు వెంబడించారు. షేక్‌పేట ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలో ఆయన్ను అడ్డుకున్నారు. హషీమ్ అనే వ్యక్తి కత్తి చూపి రూ.10 వేలు ఇవ్వాలని బెదిరించాడు. తన వద్ద డబ్బులు లేవని అనగా కనీసం రూ.5 వేలు అయినా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రిశక్తి హనుమాన్ ఆలయం వద్ద మురుగు



మింట్ కాంపౌండ్‌లోని శ్రీత్రిశక్తి హనుమాన్ దేవస్థానం ముందు కొద్ది నెలలుగా పొంగుతున్న మురుగు భక్తులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. నడవ లేని పరిస్థితి నెలకొనటంతో పాటు తీవ్ర దుర్గంధం వస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఫిర్యాదు చేస్తే సిబ్బంది వచ్చి తాత్కాలికంగా శుభ్రం చేయడం తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం చూపటం లేదన్నారు. పైపులైన్ వేస్తే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉన్నా జలమండలి అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. సెలవు రోజులు, వారాంతపు రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, అధికారులు చొరవ తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సమస్యపై ఇటీవల హైడ్రా కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేశామని ఆలయం ఛైర్మన్ కొలిశెట్టి శివకుమార్ తెలిపారు. ఇకనైనా స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. – న్యూస్‌టుడే, ఖైరతాబాద్

పచ్చని వనం.. ప్రకృతి సోయగం

అమీర్‌పేట, న్యూస్‌టుడే: యూసుఫ్‌గూడలోని కృష్ణకాంత్ పార్కు పచ్చదనంతో కనువిందు చేస్తోంది. ప్రస్తుత వర్షాల కారణంగా ఉద్యాన సోయగాలు రెట్టింపయ్యాయి. ఒకప్పుడు యూసుఫ్‌గూడ గ్రామానికి నీరందించిన చెరువును ఉద్యానంగా తీర్చిదిద్ది కృష్ణకాంత్ పార్కుగా నామకరణం చేశారు. భారీ వృక్ష సంపద, ఔషధ మొక్కలు, పుష్పజాతులు, ముచ్చటగొలిపే గజిబోలు, పచ్చదనంతో నిండి చూపరులను కట్టిపడేస్తోంది. దీనిలో రెండు పెద్ద నీటి కుంటలున్నాయి. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు సమృద్ధిగా అందుతుంటాయి.

దూరప్రాంతాల నుంచి.. యూసుఫ్‌గూడ, జవహర్‌నగర్, కల్యాణ్‌నగర్, సిద్ధార్థనగర్, మధురానగర్ల నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి తెల్లవారుజామున 5 గంటల నుంచే వాకర్లు ఇక్కడికి వస్తారు. నడకతోపాటు యోగ, కరాటే సాధన చేస్తుంటారు. రెండు ఓపెన్ జిమ్‌లు ఉన్నాయి. పిల్లలు ఆడుకునేందుకు రెండు చోట్ల ఆట స్థలాలున్నాయి. వర్షాలకు ముందు జీహెచ్‌ఎంసీ అధికారులు భారీ ఇంకుడు గుంతను ఏర్పాటు చేశారు.



ఉద్యానంలో వాకర్లు



కళకళలాడుతున్న పార్కు

డంపింగ్ యార్డుతో ఇబ్బందులు..

పార్కును ఆనుకుని జవహర్‌నగర్ వైపు చెత్త డంపింగ్ యార్డు ఉంది. దీంతో ఉద్యానానికి ఒక వైపు దుర్వాసన వస్తుంటుంది. దీన్ని తొలగించాలని స్థానికులు, వాకర్లు పలుమార్లు అధికారులను కోరారు.

భావ ప్రకటన స్వేచ్ఛ నియంత్రణ ఆందోళనకరం



చర్చా కార్యక్రమంలో పాల్గొన్న అంజలి లాల్ గుప్తా, నరేశ్ ఫెర్నాండెజ్, ప్రియాంశి శర్మ

బంజారాహిల్స్, న్యూస్‌టుడే : వర్తమాన సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్న డిజిటల్ సాంకేతికత.. పౌర, సామాజిక, ఆర్థిక, రాజకీయ భావప్రకటన తదితర అంశాలను నియంత్రిస్తున్న తీరు మాత్రం ఆందోళన కలిగిస్తోందని వక్తలు అభిప్రాయపడ్డారు. బంజారాహిల్స్‌లోని జర్మన్ సాంస్కృతిక, అధ్యయన సంస్థ గోథె జంత్రం ఆధ్వర్యంలో శనివారం జర్నలిజం, విద్యారంగం, వివిధ రంగాల ప్రముఖులతో రెండు చర్చా కార్యక్రమాలను నిర్వహించారు. టెక్ యుగంలో వార్తల సేకరణ, సత్యం, జవాబుదారీతనం, న్యాయాన్ని పరిరక్షించడం అంశాలపై జరిగిన మొదటి బృంద చర్చలో నరేశ్ ఫెర్నాండెజ్, ప్రియాంశి శర్మ, లెనా బొడేవిన్ పాల్గొన్నారు. అనుసంధానకర్తగా అంజలి లాల్ గుప్తా వ్యవహరించారు. వక్తలు మాట్లాడుతూ డిజిటల్ సాంకేతికత చిన్న తరహా వార్తా సంస్థలకు, పౌరులకు ఒకే రకమైన యాక్సెస్, భాగస్వామ్యం కల్పించటం స్వాగతించదగ్గ అంశమే అయినా.. ఇందులోని పెద్ద టెక్నాలజీ సంస్థలు మార్కెట్ గుత్తాధిపత్యాలను సృష్టించటం, నియంత్రించటం వంటి తీవ్రమైన సవాళ్లు కూడా ఎదురవుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ అంశాలను ఎదుర్కొనేందుకు చట్టపరమైన, నైతికపరమైన చర్యలు అత్యవసరమని పేర్కొన్నారు. టెక్ డిజైన్, పాలసీ, నిఘా, నైతికతను అర్థం చేసుకోవడం వంటి అంశాలపై రెండో బృంద చర్చ నిర్వహించగా వివిధ రంగాలకు చెందిన అపర్ గుప్తా, అనికేత్ అలం, రాకేశ్ తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఉషా రామన్ సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో గోథె జంత్రం డైరెక్టర్ అమితా దేశాయ్, పెద్దసంఖ్యలో వీక్షకులు పాల్గొన్నారు.

ఎంజేసీఈటీలో హ్యాకథాన్

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం రాత్రి వరకు హ్యాకథాన్ పోటీలు జరిగాయి. త్వరలో జరగబోయే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్- 2026 పోటీలకు సన్నాహకంగా నిర్వహించిన కళాశాల అంతర్గత పోటీల్లో 612 మంది విద్యార్థులు 102 బృందాలుగా తలపడ్డారు. విద్య, వైద్యం, రవాణా, వ్యవసాయం తదితర అంశాలపై తమ ప్రతిభను ఉపయోగించి పలు ఆవిష్కరణలు, అప్లికేషన్లను రూపొందించారు. కార్యక్రమంలో ఎంజేసీఈటీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆచార్య ఫర్హతుల్లా హుస్సేని, డీన్ (అకడమిక్స్) ఆచార్య హమ్‌రాజ్, రిజిస్ట్రార్ నరసింహరావు, ఎస్‌ఐహెచ్ ఫ్యాకల్టీ సమన్వయకర్త మహమ్మద్ జైనుద్దీన్ పాల్గొని విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను పరిశీలించారు.

చిరుజల్లుల్లో పర్యాటకుల పులకింత



చారిత్రక చార్మినార్ పరిసరాల్లో ఆదివారం చిరుజల్లులు కురిసినా పర్యాటకుల సందడి ఏమాత్రం తగ్గలేదు. వారాంతం కావటంతో గొడుగులు పట్టుకుని వచ్చి చార్మినార్‌ను వీక్షిస్తూ.. వేడివేడి ఇరానీ చాయ్ తాగుతూ ఉల్లాసంగా గడిపారు.

ఘనంగా ఓయూ ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే

ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే: ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే-2026ను ఆదివారం ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించారు. 2026లో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ 31 బంగారు పతకాలు, 88 నగదు పురస్కారాలు, 27 ర్యాంకు ధ్రువపత్రాలను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఓయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి, రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన సాలిడ్ స్టేట్ ఫిజిక్స్ ల్యాబ్ (ఎస్‌ఎస్‌పీఎల్) డైరెక్టర్, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ అనేష్ కుమార్ శర్మకు 'విశిష్ట పూర్వ విద్యార్థి పురస్కారం-2026' అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు. కళాశాల అభివృద్ధికి ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం, ప్రిన్సిపల్ ఆచార్య పి.చంద్రశేఖర్, అధ్యాపక బృందం చేస్తున్న కృషిని ప్రశంసించారు.



అనేష్ కుమార్ శర్మకు పురస్కారం అందజేస్తున్న వీసీ ఆచార్య కుమార్ మొలుగరం తదితరులు

గొడవల నేపథ్యంలో.. బౌన్సర్ల పహారా

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో శనివారం ఇరువర్గాల మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో ఆదివారం ప్రైవేటు బౌన్సర్లను రంగంలోకి దింపారు. శనివారం ఇరువర్గాల మధ్య తోపులాట, వాగ్వాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా వీరిని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ బౌన్సర్ల ఏర్పాటు విషయమై కొందరు సభ్యులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కూకట్‌పల్లి

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలాజీనగర్: **8008573418**, కేపీహెచ్‌బీ కాలనీ: **8008573195**, మూసాపేట: **8008573423**

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: మూసాపేటకు చెందిన రఘుకు ఆదివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శేషాద్రినగర్‌లో రూ.2లక్షల సీఎం సహాయనిధి చెక్కు అందజేశారు.

ముగిసిన జాతీయ క్రీడా దినోత్సవాలు



పతకాలతో విజేతలు

మేడ్చల్ కలెక్టరేట్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో మూడు రోజులపాటు నిర్వహించిన వేడుకలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. రాష్ట్ర ప్రభుత్వం-స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాలతో జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ క్రీడా పోటీలు నిర్వహించడంతోపాటు, క్రీడల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. చివరి రోజున ఔటర్ రింగ్ సర్వీస్ రోడ్డులో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. జిల్లా క్రీడల అధికారి వై.దామోదర్‌రెడ్డి, ఖేలో ఇండియా సైక్లింగ్ కోచ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: బాలాజీనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీలోని పార్కు సమీపంలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రిళ్లు అంధకారం కారణంగా స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని కూకట్‌పల్లి సర్కిల్ అధికారుల దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా వారు స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

నేటితో ముగియనున్న గడువు

చేయూత పింఛన్లకు ప్రజల నుంచి స్పందన

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కొత్త పింఛన్ల దరఖాస్తుకు కొన్ని గంటల్లో గడువు ముగియనుంది. ఇప్పటికే అన్ని ప్రాంతాల నుంచి భారీగా దరఖాస్తులు రాగా.. ఇప్పటికీ జనం తాకిడి తగ్గలేదు. కొన్నేళ్లుగా కొత్త పింఛన్లు ఇవ్వకపోవడం.. ఇటీవల ఉన్నవాటిలోనూ భారీగా కోత పడడంతో ఇందుకోసం ఎదురుచూస్తున్న వారంతా కొత్త పింఛన్ల కోసం మీ-సేవలకు క్యూ కడుతున్నారు. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలోని మీ-సేవ కార్యాలయాలకు చివరి రోజు రద్దీ పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

8వేలకు పైగా దరఖాస్తులు.. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో 2022 నుంచి కొత్తవారికి పెన్షన్ జారీ నిలిపేశారు. అయినప్పటికీ నిరుపేద ప్రజలు పెన్షన్ వస్తుందన్న ఆశతో.. అప్పటి నుంచి దరఖాస్తులు పెట్టుకుంటూ వస్తున్నారు. దరఖాస్తులు తీసుకోవడానికి వీలు లేనప్పటికీ.. అధికారులు ప్రజలను ఇబ్బందిపెట్టడం ఇష్టంలేక తీసుకుంటూ వచ్చారు. ఇలా రెండు సర్కిళ్ల పరిధిలో 4వేలకు పైగా దరఖాస్తులు రాగా..ఇవన్నీ అప్పటి నుంచి పెండింగులో ఉన్న విషయం తెలిసిందే. కొత్త పింఛన్ల కోసం మీ-సేవల్లో ఈ నెల 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీకాలనీ, బాలానగర్, ఫతేనగర్, మోతీనగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి ప్రాంతాల్లోని మీ-సేవ కార్యాలయాల్లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇప్పటివరకు రెండు సర్కిళ్లలో 8వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని అంచనా వేస్తున్నారు. సర్కిళ్ల కార్యాలయాల్లో పడిఉన్న పాత దరఖాస్తులను బయటికి తీసిన ప్రాజెక్టు అధికారులు వాటిని విభజించి ఫోన్ చేసి సమాచారం ఇస్తున్నారు. ఇలా ఇప్పటికీ 3వేల మంది తీసుకెళ్లగా..ఇంకా వెయ్యిమంది వరకు స్పందించలేదని సిబ్బంది చెబుతున్నారు.



బాలానగర్ వార్డు కార్యాలయంలో పాత దరఖాస్తులను విభజిస్తున్న సిబ్బంది

చివరి రోజు పోటెత్తే అవకాశం..

ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువగా బాలానగర్ మీ-సేవలో వచ్చాయి. ఇక్కడ మొదట్లో రోజుకు 200మంది దరఖాస్తులు రాగా.. ప్రస్తుతం 30వరకు వస్తున్నాయి. కేపీహెచ్‌బీ, మోతీనగర్, ఫతేనగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లిలోనూ రోజుకు 20కి తగ్గకుండా వస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కూకట్‌పల్లి మీ-సేవలో మాత్రం 10నుంచి 20మధ్యలో మాత్రమే వస్తున్నాయి. మిగిలిపోయినవారంతా చివరిరోజు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆందోళనకరంగా పెళ్లికాని వారి పరిస్థితి..

మీ-సేవల్లో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి సోమవారంతో గడువు ముగియనుంది. కాగా ఒంటరి మహిళల కేటగిరిలో పెళ్లికాని మహిళలు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేకపోవడంతో ఇటువంటివారు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దారు కార్యాలయాల నుంచి ధ్రువపత్రం తీసుకురావాలని మీ-సేవ నిర్వాహకులు చెబుతుండడంతో వారు ధ్రువపత్రం ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో ఇటువంటి వారంతా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆలోచన ఘనం.. ప్రయోజనం శూన్యం



ఈ చిత్రం చూశారా..? మట్టి కొట్టుకుపోయి.. చెత్తాచెదారం.. డబ్బాల మధ్య అధ్వానంగా మారిన ఈ మెషిన్.. పేరు ఏటీబీ(ఎనీ టైం బ్యాగ్). ఒక మంచి ఆలోచనతో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన అధికారులు నిష్ప్రయోజనంగా మార్చారు. లక్ష్యం నీరుగారింది. దీనికి వెచ్చించిన నిధులు దుర్వినియోగమయ్యాయి. నాలుగేళ్ల క్రితం కూకట్‌పల్లి జోనల్ అధికారులు నియోజకవర్గం పరిధిలోని రెండుచోట్ల ఏటీబీ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారు. ప్లాస్టిక్‌ను నియంత్రించడంతో పాటు క్లాత్ బ్యాగుల వినియోగం పెంచడం ద్వారా పొదుపు గ్రూపులకు స్వయం ఉపాధి అందించాలన్న మంచి ఉద్దేశంతో వీటి అవసరం ఉన్న రెండు ప్రాంతాలను గుర్తించి ఏటీబీ యంత్రాలను నెలకొల్పారు. ఇలా కేపీహెచ్‌బీకాలనీలోని అత్యంత రద్దీగా ఉండే రైతుబజార్ ఆవరణలో ఒకటి.. బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా నుంచి చింతల్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో టెకుమ్‌సే ఫ్యాక్టరీ ముందు పండ్ల మార్కెట్‌లో ఏటీబీలను నెలకొల్పారు. ఇందులో ఏర్పాటుచేసే క్లాత్ బ్యాగుల తయారీ బాధ్యతను పొదుపు గ్రూపు మహిళలకు ఇచ్చారు. ఇలా వారు తయారుచేసిన బ్యాగులను యంత్రాల్లో పెట్టి.. అయిపోగానే మళ్లీ ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకున్నారు. అయితే ఒక్క బ్యాగుకు రూ.10 ధర నిర్ణయించారు. ఈ యంత్రంలో రూ.10 నోటు లేదా కాయిన్ వేస్తే బ్యాగు బయటికి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. కానీ ఒక్క బ్యాగు వినియోగం కాకుండానే.. యంత్రాలు పడకేసి నిరుపయోగంగా మారాయి. చివరికి రైతుబజార్, పండ్ల మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని కూడా అధికారులు నియంత్రించలేకపోవడం గమనార్హం. –న్యూస్‌టుడే, బాలానగర్

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

బాలానగర్, న్యూస్‌టుడే: **సమయం:** ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. **ప్రాంతాలు:** గౌతంనగర్, పాత విమానాశ్రయం రోడ్డు, ఎన్ఎస్‌కేకే స్కూల్, శ్రీసాయినాథ్‌నగర్, మహతానగర్. **సమయం:** మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు. **ప్రాంతాలు:** ప్రశాంత్‌నగర్, జ్యోతి పాలిమర్స్, రాక్‌టూల్స్. **సమయం:** మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు. **ప్రాంతాలు:** ప్రశాంత్‌నగర్ పార్ట్, వెంకటేశ్వరనగర్, గ్రీన్ వీల్స్. **సమయం:** మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు. **ప్రాంతాలు:** శంకర్ ఎన్‌క్లేవ్, ఆర్ఆర్‌నగర్ రోడ్డు నంబర్-10, రామిరెడ్డికాలనీ, మైత్రీవనంకాలనీ, గౌరీనగర్, హెచ్ఏఎల్‌కాలనీ, రామరాజునగర్.


కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి సంగీత్‌నగర్ కొన్ని రోజులుగా తాగునీరు కలుషితమవుతుంది. స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన జలమండలి కూకట్‌పల్లి సర్కిల్ డీజీఎం త్రినాథరావు సిబ్బందితో మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ తరచూ సమస్య తలెత్తుతుండడంతో కెమెరాతో రెండు, మూడు చోట్ల కలుషిత సమస్యను గుర్తించారు. మంజీరా పైప్‌లైన్ జాయింట్లు ఉన్న చోట మురుగు కలుస్తుండడంతో సమస్య తలెత్తుతుండడంతో దాన్ని నివారించేందుకు గుంతలు తవ్వి పనులు చేపట్టారు. రెండు రోజుల్లో కలుషిత సమస్యను నివారిస్తామని అప్పటివరకు ట్యాంకర్‌తో స్థానికులకు నీటిని సరఫరా చేస్తామని చెప్పారు.

తవ్వేసి.. ఇలా వదిలేసి



ప్రశాంత్‌నగర్ డివిజన్ పరిధి నైనా గార్డెన్స్ పక్క రోడ్డులో జలమండలి సిబ్బంది కొన్నిరోజుల క్రితం ఇక్కడ మంజీరా పైప్‌లైన్ మరమ్మతుల కోసం గుంత తవ్వారు. నామమాత్రంగా ఒకవైపు బ్యారికేడ్ పెట్టి వదిలేశారు. దీంతో ఇటుగా రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. మరమ్మతులు చేయడానికి.. గుంత పూడ్చడానికి రోజుల సమయం తీసుకోవడం జలమండలి అధికారులకు అలవాటుగా మారడం.. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తుంది. –న్యూస్‌టుడే, కూకట్‌పల్లి

నీట్ పీజీకి 197 మంది గైర్హాజరు



పోలీసులు, అధికారులతో మాట్లాడుతున్న విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 19 కేంద్రాల్లో ఆదివారం కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-(సీబీటీ) విధానంలో జరిగిన పీజీ నీట్-2026కు 197 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. 6,368 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 6,171 మంది పరీక్షలు రాశారు. నాగోల్ సీఐఓఎస్ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్, పీర్జాదిగూడలోని సూర్య టెక్నాలజీ పరీక్ష కేంద్రాలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి.విజయేందర్‌రెడ్డి సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.


కలిసికట్టుగా కాలనీని అభివృద్ధి చేసుకోవాలి



మాట్లాడుతున్న బండి రమేష్. చిత్రంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు


మూసాపేట, న్యూస్‌టుడే: కలిసికట్టుగా కాలనీని అభివృద్ధి చేసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మూసాపేట పరిధి ఆంజనేయనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక సీతారామ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బండి రమేష్, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంజనేయనగర్ అభివృద్ధిలో తాము బాసటగా నిలుస్తామని వారు హామీ ఇచ్చారు. అనంతరం కొత్త కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. కాలనీ అధ్యక్షుడు జె.మహేంద్రకుమార్‌తో పాటు శ్రీనివాసులురెడ్డి, లోకేశ్వర్, నారాయణరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాలిబాట ఇలా.. రాకపోకలెలా?



కూకట్‌పల్లి వై జంక్షన్ మెట్రోస్టేషన్ వద్ద కాలిబాట ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. దీంతో ఇటుగా పాదచారుల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. మరమ్మతులు నిర్వహించాల్సిన సర్కిల్ అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారు. దీనిపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదని పాదచారులు వాపోతున్నారు. –న్యూస్‌టుడే, కూకట్‌పల్లి


విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలి: సీపీఎం



సదస్సులో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

నిజాంపేట, న్యూస్‌టుడే: విద్యావ్యవస్థలో సమగ్రమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రగతినగర్‌లోని లీలా సుందరయ్య భవనంలో ఆదివారం జిల్లాస్థాయి విద్యాసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలను కేంద్రీకృతం చేయడం ద్వారా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. పాఠశాల స్థాయిలో ప్రభుత్వ స్కూళ్లలో 15, ప్రైవేటు సంస్థల్లో 85 శాతం మేర నిష్పత్తిలో విద్యార్థులు ఉంటున్నట్లు తమ సర్వేలో తేలిందన్నారు. ఇటీవల జరిగిన నీట్ పేపరు లీకేజీతో వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడ్డారన్నారు. అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నిబంధనలను కఠినతరం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సత్యం, ప్రొఫెసర్ నాగేశ్వర్, నేతలు రవి, రాజశేఖర్, అశోక్, శ్రీనివాసులు, సంతోష్, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పరచుకున్న పచ్చందం.. కేపీహెచ్‌బీకి ఆహ్లాదం



సంపూర్ణ ఫ్లాట్స్ వెనక వెల్లివిరిసిన పచ్చదనం

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న ప్రమాదకర పరిస్థితుల్లో కేపీహెచ్‌బీలో మాత్రం పచ్చదనం వెల్లివిరుస్తుంది. అదే ఈ ప్రాంత వాసులకు ప్రాణవాయువుగా అందుతోంది. సువాసనలతో కూడిన గాలులు ఆస్వాదిస్తున్నామని పచ్చదనానికి దగ్గరగా ఉన్న వారు చెబుతుండటం ఈ ప్రాంత పచ్చదనం ప్రత్యేకత. సీఎంసీ, అటవీశాఖ ఉద్యానవన విభాగం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం, ప్రోత్సాహంతో చెట్ల నరికివేత గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది.

గతంలో అటవీ ప్రాంతం

సుమారు 46 ఏళ్ల కిందట ఏర్పడిన కేపీహెచ్‌బీ అంతకముందు అటవీ ప్రాంతం. ఆకర్షణీయంగా కనిపించే పొడవైన వృక్షాలు, వేల ఎకరాల విస్తీర్ణంలో జంగిల్ ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదని ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వృక్షాలు రాత్రికి రాత్రే కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 1400 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పడిన కేపీహెచ్‌బీ చుట్టూ కూడా విశాలమైన భూముల్లో జంగిల్ ఆవరించింది. కేపీహెచ్‌బీ మలేషియన్ టౌన్‌షిప్ ఎదురు, లోపల, చుట్టూ ఉన్న పచ్చదనం ప్రభావానికి ఆ ప్రాంతం చల్లగా ఉంటుంది. కూతవేటు దూరంలో ఉన్న హైటెక్ సిటీ కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో అక్కడ వాతావరణం వేడిగా ఉంటుంది.

ఇష్టారాజ్యంగా నరికివేత..

- కేపీహెచ్‌బీ ఒకటో రోడ్డు, ఐదు, తొమ్మిది, ఆరో ఫేజ్‌లు, వసంతనగర్, జేఎన్‌టీయూ, ఎన్ఆర్ఎస్ఏ కాలనీల్లో పందిరిలా పచ్చదనం అల్లుకుని కనిపిస్తోంది. వృక్షాలు పందిరి వేసినట్టే కలిసిపోవడంతో వాహనదారులు, కాలనీలవాసులు పచ్చదనాన్ని ఆస్వాదిస్తున్నారు.
- కేపీహెచ్‌బీ శాంతిభద్రతలు, ట్రాఫిక్ విభాగాల ఠాణాలు పొడవైన వృక్షాల కిందే ఉంటాయి. నాలుగోఫేజ్‌లో పాత ఆర్టీఏ కార్యాలయం సేవలు 18 ఏళ్ల దాదాపు 70 నుంచి 80 ఏళ్లుగా ఉన్న వృక్షాల కిందే సాగాయి. మూడో ఫేజ్‌లోని వార్డు కార్యాలయంలో పచ్చని చెట్లు కనువిందు చేస్తున్నాయి.
- 10 ఏళ్ల కాలంలో ఫేజ్ 1, 2, 3, రమ్య మైదానం, భగత్‌సింగ్ నగర్, ఏడు, నాలుగు ఫేజ్‌ల్లో పదుల సంఖ్యల్లో చెట్లు అనుమతుల్లేకుండా మాయమయ్యాయి. ఇదే కొనసాగితే భవిష్యత్తు తరాలకు పర్యావరణం అందకుండా ఉండే ప్రమాదముంది.
- కేపీహెచ్‌బీకి మూడు వైపులా ఉదాసీన్ మఠం, ఐడీఎల్, మలేషియన్ టౌన్‌షిప్ ఎదురు, గోకుల్ ఫ్లాట్స్ దిగిన తర్వాత ఉన్న పచ్చదనం నుంచి కాలనీలవాసులకు ప్రాణవాయువు అందుతోంది.


నేడు ప్రజావాణి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి జోన్, మూసాపేట, కూకట్‌పల్లి సర్కిళ్ల కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారు.

సంక్షేమ సంఘాల నూతన కార్యవర్గం ఎన్నిక

కేపీహెచ్‌బీకాలనీ: శ్రీలపార్కు ప్రైడ్ గేటెడ్ కమ్యూనిటీ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, సత్యవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా మనోజ్‌కుమార్, కోశాధికారిగా వంశీకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా రమేశ్‌బాబు, సంయుక్త కోశాధికారిగా అనురాగ్ మిశ్రా, పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు.

● కేపీహెచ్‌బీ నాలుగో ఫేజ్ ఎల్ఐజీ వెంచర్-2 గృహ సముదాయాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లేశ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు హిమబిందు, నాగరాణి, సంయుక్త కార్యదర్శి విజిత, కోశాధికారి అరుణకుమారి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు నర్సింహులు, అశోక్‌కుమార్, రాజు, వేణుగోపాల్ ఎన్నికయ్యారు.




వినాయకనగర్ కార్యవర్గ సభ్యులను సత్కరించిన రవీందర్‌రెడ్డి

బాలానగర్: బాలానగర్ డివిజన్ వినాయకనగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన కార్యవర్గాన్ని ఆదివారం మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి సత్కరించి కాలనీ సమస్యలపై దృష్టి సారించాలన్నారు. అధ్యక్షురాలిగా ప్రభారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా సతీష్‌కుమార్, పలువురు కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు.

కొత్త రోడ్డుపై కోటి ఆశలు..!

మూసాపేట, న్యూస్‌టుడే: మూసాపేట పరిసర ప్రజలు దీర్ఘకాలికంగా ఎదురు చూస్తున్న కొత్త రహదారి త్వరలోనే అందుబాటులోకి రానుంది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) అధికారులు దీనిపై ఇప్పటికే కార్యాచరణకు ఉపక్రమించారు. రోడ్డు అభివృద్ధికి అంచనాలను సైతం రూపొందించడం విశేషం. దీంతో స్థానికంగా నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు విముక్తి లభించడంతో పాటు కొద్దిదూరంలోనే జాతీయ రహదారికి చేరుకునే అవకాశం ఉంది.



వసుంధర ఆసుపత్రి ముందు నుంచి జాతీయ రహదారికి కలిపే మార్గం ఇదే


ఏడేళ్లుగా పెండింగ్‌లోనే..

వసుంధర ఆసుపత్రి నుంచి జాతీయ రహదారిలోని ప్రస్తుత డీమార్టు వరకు గతంలో ప్రైవేటు క్రేన్ సంస్థ స్థలం ఉండేది. ఆ మార్గాన్ని అభివృద్ధి చేస్తే పరిసర వాసులకు ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి వస్తుందని 2018లో అధికారులు భావించారు. అందుకు ఆయా సంస్థల యజమానులకు నోటీసులు సైతం అందజేశారు. అందుకు పలువురు యజమానులు అప్పట్లో ససేమిరా అనడంతో ఆ వ్యవహారం అటకెక్కింది. ఆ తర్వాత 2019లో ఇదే స్థలంలో 'వైట్ వాటర్ కన్‌స్ట్రక్షన్' అనే సంస్థ భారీ గృహసముదాయ పనులను ఆరంభించింది. అయితే సదరు సంస్థ 'స్వామి కార్యం.. స్వకార్యం' నెరవేర్చాలన్నట్లుగా తమ సంస్థ ముందు నుంచి 80 అడుగుల మేర ప్రధాన రహదారిని అభివృద్ధి చేస్తామని ఆ సంస్థ అప్పట్లో ప్రభుత్వానికి నివేదించింది. అయితే తమ ప్రాజెక్టు పనులు పూర్తయ్యాకే రోడ్డుకు అనుమతిస్తామని ఒప్పందంలో పేర్కొంది. అయితే అనేక కారణాలతో అనుకున్న సమయంలో ప్రాజెక్టు పనులను పూర్తి చేయలేదు. అప్పటి నుంచి పెండింగ్‌లో ఉంది.

రూ.1.70 కోట్లతో అంచనాలు..

వసుంధర ఆసుపత్రికి సమీపంలో ప్రస్తుతం ఉన్న హైటెన్షన్ విద్యుత్తు తీగల రోడ్డు అందుబాటులో ఉంది. ఇక్కడి నుంచి జాతీయ రహదారికి వెళ్లడానికి కేవలం ఫర్లాంగు దూరం మాత్రమే ఉంటుంది. ఇక్కడే నిర్మాణ సంస్థకు చెందిన స్థలం ఉంది. అయితే ఆ ప్రాజెక్టు పనులు పూర్తికావడానికి ఆలస్యం అవుతుండటంతో సదరు స్థలాన్ని స్వాధీనం చేసుకుని కొత్తగా రోడ్డును అభివృద్ధి చేయాలని అధికారులు భావించారు. రోడ్డు విస్తరణకు అవసరమైన కసరత్తును సైతం ఆరంభించారు. ఇందుకు రూ.1.70 కోట్లతో అంచనాలు రూపొందించారు. త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు చేపడతామని సీఎంసీ కమిషనర్ జి.సృజన ఇటీవల ఆంజనేయనగర్‌లో జరిగిన సమావేశంలో స్థానికులకు వెల్లడించారు. ఇది అందుబాటులోకి వస్తే ఆంజనేయనగర్, పవర్‌నగర్, శ్రీహరినగర్, జనతానగర్, ముస్కీపేట, ప్రగతినగర్, యాదవబస్తీ, చిత్తారమ్మనగర్ వాసులు నిమిషాల వ్యవధిలోనే జాతీయ రహదారికి చేరుకునే వీలుంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రవిచంద్ర

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలైన ఘటన గచ్చిబౌలి ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా హన్మకొండకు చెందిన వేముల రవిచంద్ర (25) బండ్లగూడలో ఉంటూ, హోటల్‌లో చెఫ్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి పని నిమిత్తం కొండాపూర్‌కు వచ్చాడు. అర్ధరాత్రి 1:30 సమయంలో తన ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో కొండాపూర్ అర్బోర్ స్కూల్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న టిప్పర్ వాహనం డ్రైవర్ సిగ్నల్ ఇవ్వకుండా అకస్మాత్తుగా యూటర్న్ తీసుకున్నాడు. రవిచంద్ర వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి టిప్పర్ వెనుక చక్రాల కిందకు దూసుకెళ్లింది. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మత్తులో నడిపి.. పోలీసులకు చిక్కి

రాయదుర్గం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన 182 మంది మందుబాబులపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వారాంతంలో రెండు రోజుల పాటు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. పట్టుబడిన వారిలో 154 మంది ద్విచక్ర వాహనదారులు, 20 మంది కారు డ్రైవర్లు, ఏడుగురు ఆటోవాలాలు, ఒకరు భారీ వాహన డ్రైవరు ఉన్నారు. గత వారం న్యాయస్థానాలు 308 కేసులను పరిష్కరించాయి. ఏడుగురికి జరిమానా- సామాజిక సేవ, మిగతా వారికి జరిమానా విధించినట్లు ఏడీసీపీ నరేందర్ తెలిపారు.

పేరుకుపోయిన చెత్త.. ఇదేనా స్వచ్ఛత?



ఫతేనగర్ ప్రధాన రహదారిలో చేపల మార్కెట్ సమీపంలోని నాలా వద్ద భారీగా చెత్త పేరుకుపోయింది. దీంతో స్థానికంగా అధ్వానం.. అపరిశుభ్రత తాండవిస్తుంది. స్థానికులు దుర్వాసనతో అల్లాడుతున్నారు. దీని వలన అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయని వాపోతున్నారు. వెంటనే చెత్తను తొలగించి శుభ్రం చేసి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. –న్యూస్‌టుడే, ఫతేనగర్

నిలువెత్తు నిర్లక్ష్యం.. ఇదిగో నిదర్శనం

ఫోకస్



ప్రశాంత్‌నగర్ ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ముందు...



బాలానగర్ ఇంద్రానగర్ ఎదురుగా



జాతీయ రహదారిపై సంగీత్‌నగర్ వద్ద..

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: వర్షాల వేళ.. అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల ప్రాణాలమీదకొస్తుంది. ప్రమాదకర పరిస్థితుల విషయంలో సత్వరమే స్పందించాల్సి ఉన్నప్పటికీ.. పట్టించుకోవడంలేదు. వారాలు.. నెలలు గడుస్తున్నా.. సమస్య పరిష్కారంలో చొరవ చూకపోతుండడం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన రహదారుల్లో ఈ పరిస్థితి ఉన్నా.. గాలికొదిలేయడం గమనార్హం. వర్షాకాలంలో ప్రమాదాలకు ఆస్కారమివ్వకుండా.. సీఎంసీ అధికారులు రోడ్ల తవ్వకాలను సైతం నిషేధించగా.. అదే రోడ్లపై ప్రమాదకర గుంతల విషయంలో మాత్రం ఇంజినీరింగ్ అధికారులు అశ్రద్ధ చేస్తున్నారు. ఇందుకు తాజా నిదర్శనంగా నిలుస్తున్నవే.. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధి పలు ప్రాంతాల్లోని ఈ చిత్రాలు. ప్రశాంత్‌నగర్ ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ముందు భారీగా లోతున్న వరద కాలువ మ్యాన్‌హోల్ గుంతపై మూత ధ్వంసమై.. రెండు నెలలైంది. ఇప్పటికీ దీన్ని పునరుద్ధరించేందుకు అధికారుల్లో చొరవ లేకపోవడం ఆందోళన కలిగిస్తుంది. జాతీయ రహదారిపై సంగీత్‌నగర్ వద్ద వరద కాలువపై మ్యాన్‌హోల్ మూత ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. ఇంద్రానగర్ ఎదురు వరద కాలువ శ్లాబుపై మూత ధ్వంసం కావడంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుంది.

తెలంగాణ రక్షణ సేన జెండా పండగ



కరపత్రాల పంపిణీలో చంద్రశేఖర ప్రసాద్, నాయకులు

మియాపూర్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే తమ పార్టీ ఎజెండా అని తెలంగాణ రక్షణ సేన శేరిలింగంపల్లి ఇన్‌ఛార్జి చంద్రశేఖర ప్రసాద్ అన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా పార్టీ శ్రేణులు కృషిచేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ చేపట్టిన జెండా పండుగలో భాగంగా ఆదివారం మక్తా మహబూబ్ పేట డివిజన్‌లో నిర్వహించిన జెండా ఆవిష్కరణకు ఆయన హాజరయ్యారు. అనంతరం పార్టీ విధానాలతో రూపొందించిన కరపత్రాలను స్థానికంగా ఇంటింటికీ పంపిణీ చేశారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు గుండె దయానంద్ ముదిరాజ్, అస్లాం, లావణ్య, కుమార్, సందీప్ పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి

• శేరిలింగంపల్లి • పటాన్‌చెరు

విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

రాయదుర్గం, న్యూస్‌టుడే: విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. రౌండ్ టేబుల్ ఇండియా ఫౌండేషన్ అనుబంధ హైదరాబాద్ ఏరియా రౌండ్ టేబుల్ 134 సంస్థ ఆధ్వర్యంలో రూ.కోటి నిధులతో ఖాజాగూడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఎనిమిది అదనపు గదులు నిర్మించనున్నారు. ఈ పనులకు ఆదివారం ఎమ్మెల్యే గాంధీ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వికాసానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. మియాపూర్ పరిధిలో పది ఎకరాల స్థలంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ఛైర్మన్ వివేక్ సచిన్ మెతుకు, వైస్ ఛైర్మన్ కృష్ణ అగర్వాల్, కార్యదర్శి వికాస్, కోశాధికారి ఆయుష్ అగర్వాల్, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో దుర్గం చెరువు



దుర్గం చెరువులో మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు

మాదాపూర్, న్యూస్‌టుడే: నగరంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన దుర్గం చెరువు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. నేరుగా మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు చెరువులోకి చేరుతుండటంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. శుద్ధి చేయని మురుగు కారణంగా నీటిలో ఆక్సిజన్ స్థాయి పడిపోయి భారీ సంఖ్యలో చేపలు మృత్యువాత పడుతున్నాయి. నెల రోజుల క్రితం ఈ విషయమై 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో, మరుసటి రోజు సీఎంసీ కమిషనర్ సృజన, జలమండలి అధికారులతో కలిసి చెరువును సందర్శించారు. చెరువులోకి మురుగు చేరకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మురుగు నీటిని ఎస్టీపీలకు మళ్లించే పనులు పూర్తి కాకపోవడంతో నేటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఆహ్లాదం కోసం చెరువు వద్దకు వెళ్తే ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. చెరువు రక్షణ బాధ్యతను హైడ్రా తీసుకుంటుందని స్వయంగా హైడ్రా కమిషనర్ ప్రకటించి, సంబంధిత విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అయినా పరిస్థితిలో మార్పు లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దుర్గం చెరువులోకి మురుగు చేరకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



మృత్యువాత పడిన చేపలు

కూల్చివేతల్లో నిబంధనల ఉల్లంఘన

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన నేపథ్యంలో, సీఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా 75 గజాల లోపు స్థలాల్లో, ఏడు మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న నిర్మాణాలను తొలగించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఉన్నతాధికారుల ఉత్తర్వులను క్షేత్ర స్థాయి సిబ్బంది పట్టించుకోవడం లేదు. రామచంద్రాపురం, అమీన్‌పూర్ పరిధిలో నిబంధనలు విస్మరించి కూల్చివేతలు చేపడుతున్నారు.

బహిరంగంగానే.. పటాన్‌చెరు సర్కిల్ పరిధిలోనే వందకు పైగా నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. అమీన్‌పూర్, బీరంగూడ పరిధిలోనూ ఈ సమస్య అధికంగా ఉంది. అయితే క్షేత్ర స్థాయిలో అధికారులు తీసుకుంటున్న చర్యల్లో.. నిబంధనల ఉల్లంఘన బహిరంగంగానే కనిపిస్తుంది. నాలుగు రోజుల క్రితం పటాన్‌చెరు సర్కిల్ పరిధిలో కూల్చివేతలు చేపట్టారు. అయితే సీఎంసీ అధికారికి చెందిన ఆరు అంతస్తుల భవనాన్ని కూల్చకుండా వదిలేశారు. స్థానికంగా పలుకుబడి ఉన్న మరో నాయకుడి నిర్మాణం జోలికి సైతం వెళ్లలేదు. ప్రస్తుతం ఇక్కడ 30 వరకు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలు ఉన్నా, పట్టించుకోవడం లేదు. తమ ఇళ్లు కూల్చుతూ, పలుకుబడి కలిగిన వారివి వదిలేస్తున్నారని, చట్టం అందరికీ సమానం కాదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో తూతూమంత్రంగా ఓ రెండు నిర్మాణాల్లో అదనపు అంతస్తులు తొలగించారు. వాణినగర్, పటేల్‌గూడ, పెద్ద చెరువు ప్రాంతం, చక్రపురి కాలనీల్లో అనుమతి లేని అదనపు అంతస్తుల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా, పట్టించుకోవడం లేదు.

అస్మదీయులకు అనుకూలంగా చర్యలు



పటాన్‌చెరులో కూల్చకుండా వదిలేసిన అదనపు అంతస్తులు

సమయం లేకపోవడంతో

నిబంధనల ప్రకారమే అక్రమ నిర్మాణాలు కూల్చి వేస్తున్నాం. పటాన్‌చెరు సర్కిల్ పరిధిలో అదనపు అంతస్తుల నిర్మాణం చేపట్టింది.. సీఎంసీ ఉద్యోగి అని మాకు తెలియదు. ఆ రోజు సమయం లేకపోవడంతో పాటు పోలీసు బందోబస్తు సమస్య కారణంగా కొన్నింటిని వదిలేశాం. ప్రస్తుతం పోలీసు బందోబస్తు కోసం లేఖ రాశాం.
–ప్రసీద, ఏసీపీ, పటాన్‌చెరు సర్కిల్

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

శేరిలింగంపల్లి	80085 73411
పటాన్‌చెరు	76618 88489
చందానగర్	80085 55322
పటాన్‌చెరు రూరల్	8008573260
రాయదుర్గం	8008573413

పటాన్‌చెరు అర్బన్, పటాన్‌చెరు రూరల్, చందానగర్, ఆల్విన్‌కాలనీ, అమీన్‌పూర్, శేరిలింగంపల్లి: ? జాతీయ రహదారి మదీనాగూడ వద్ద పాదచారుల వంతెన లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. –సుధాకర్

✓ క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. –భానుప్రకాశ్, ఏఈ

? పటాన్‌చెరు సాయిరాం కాలనీకి వెళ్లే మార్గంలో చక్రాలు బండి పెడుతున్నారు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. –శరత్

✓ రహదారిపై పెట్టకుండా చర్యలు తీసుకుంటాం. –ఆంజనేయులు, ట్రాఫిక్ ఎస్సై

? ఇస్నాపూర్ పురపాలిక అన్నపూర్ణ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. –సాయి

✓ మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. –వెంకటకిషన్ రావు, కమిషనర్

? ఎల్లమ్మబండ గుడ్‌విల్ హోటల్ చౌరస్తా సమీపంలో చెత్త పేరుకు పోవడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. –ప్రవీణ్

✓ సిబ్బందిని పంపి తొలగించేలా చూస్తాం. –చాముండేశ్వరి, డీసీ, ఆల్విన్ కాలనీ

? అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట శివారులోని ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డులో పైపులైన్ పనుల కారణంగా తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. –వినయ్

✓ పోలీసులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం. –మనోహర్, ఏఎంసీ, అమీన్‌పూర్

? గోపనపల్లి ఎన్టీఆర్ నగర్ ప్రాంతంలో కుక్కల బెడద అధికమైంది. –శివపార్వతి

✓ తగిన చర్యలు తీసుకునేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. –సేవా ఇస్లావత్, డీసీ

? బీరంగూడ సిద్దార్థ కాలనీకి వెళ్లే మార్గంలో మిత్రావిహార్ వద్ద చెత్త పడేస్తున్నారు. –కృష్ణ

✓ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. –వెంకటరమణ, డీఈఈ, అమీన్‌పూర్

? గౌలిదొడ్డి పరిధిలో దోమల బెడద చాలా తీవ్రంగా ఉంది. –భాగ్యలక్ష్మి

✓ ఫాగింగ్ చేపట్టేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. –శ్రీకాంత్‌రెడ్డి, సహాయ వైద్యాధికారి, శేరిలింగంపల్లి

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



గచ్చిబౌలి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలైన ఘటన గచ్చిబౌలి ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం ప్రకారం.. హన్మకొండకు చెందిన వేముల **రవిచంద్ర** (25) బండ్లగూడలో ఉంటూ, హోటల్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి పని నిమిత్తం కొండాపూర్‌కు వచ్చాడు. అర్ధరాత్రి 1.30 సమయంలో తన ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో కొండాపూర్ అర్బోర్ స్కూల్ వద్దకు రాగానే.. ముందు వెళ్తున్న టిప్పర్ వాహనం డ్రైవర్ సిగ్నల్ ఇవ్వకుండా అకస్మాత్తుగా యూటర్న్ తీసుకున్నాడు. రవిచంద్ర వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి టిప్పర్ వెనక చక్రాల కిందకు దూసుకెళ్లింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్.. వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మాదాపూర్, న్యూస్‌టుడే: మాదాపూర్ ఠాణా పరిధిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మాదాపూర్ పోలీసుల కథనం ప్రకారం.. సైబర్ టవర్స్ నుంచి జేఎన్‌టీయూ వెళ్లే మార్గంలోని పైవంతెన కింద ఆదివారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారంతో పోలీసులు.. ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మృతుడి వయసు 40 నుంచి 50 ఏళ్ల మధ్యలో ఉంటుంది. అనంతరం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. మృతుడు సంబంధీకులు ఎవరైనా ఉంటే ఠాణాలో సంప్రదించాలని సూచించారు.

బోనమెత్తి.. భక్తితో ప్రణమిల్లి



రామచంద్రాపురం పట్టణంలో..

రామచంద్రాపురం, శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: రామచంద్రాపురం పట్టణంలో ఆదివారం బోనాల ఉత్సవం నిర్వహించారు. స్థానిక ఏడు గుళ్ల పోచమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పటాన్‌చెరు, దుబ్బాక ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భారాస సమన్వయకర్త ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పుష్ప, అంజయ్య పాల్గొన్నారు. పటేల్‌గూడలో మాజీ ఎంపీపీ దేవానంద్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలు నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గోపీ నగర్, బాపు నగర్, పాత ఎంఐజీ కాలనీలో బోనాలు వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ఎమ్మెల్యే గాంధీ, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, పొట్ట నరేందర్ యాదవ్ తదితరులు హాజరై పూజలు నిర్వహించారు.



పాత ఎంఐజీ కాలనీలో ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శంషీగూడ భాజపా అధ్యక్షుడిగా రఘు నియామకం

ఆల్విన్‌కాలనీ, న్యూస్‌టుడే: శంషీగూడ డివిజన్ భాజపా నూతన అధ్యక్షుడిగా టప్ప రఘు నియమితులయ్యారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనను జిల్లా కార్యదర్శి మణిభూషణ్, జిల్లా సెక్రటరీ దుర్గాప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటస్వామి రెడ్డి, ఆంజనేయులు తదితరులు అభినందించారు.

గల్లంతై నెల.. నేటికీ లభించని బాలయ్య ఆచూకీ

మియాపూర్, న్యూస్‌టుడే: గత నెల 28వ తేదీ రాత్రి భారీ వర్షంలో ప్రమాదవశాత్తు జారి పడి నాలాలో గల్లంతైన బాలయ్య ఆచూకీ నేటికీ లభ్యం కాలేదు. తొలుత అధికారులు గల్లంతైన ప్రాంతం నుంచి దిగువకు వెళ్లే మార్గంలో చెరువు వరకు గాలింపు చర్యలు చేపట్టారు. అన్నివిధాలా గాలింపు చర్యలు చేపట్టినా.. ఎటువంటి ఫలితం లభించలేదు. బాలయ్య భార్య పద్మ, కుమారులు బాలస్వామి, శ్రీను, కుమార్తె మంజు తదితరులంతా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారే. నెల రోజులుగా బాలయ్య ఆచూకీ లభించకపోవడంతో.. ఏం చేయాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ఆనవాళ్లు లభిస్తే, సంప్రదాయబద్ధంగా తదుపరి కార్యక్రమాలు నిర్వహించుకుంటామని కుమారుడు బాలస్వామి తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం..: గాంధీ, ఎమ్మెల్యే

బాలయ్య కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్నిరకాల సాయం అందించేందుకు కృషిచేస్తున్నా. ఈ విషయమై ఉన్నతాధికారులతో చర్చించాం. వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

మత్తులో నడిపి.. పోలీసులకు చిక్కి

రాయదుర్గం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన 182 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారాంతంలో సైబరాబాద్ పరిధిలో తనిఖీలు చేపట్టారు. పట్టుబడిన వారిలో 154 మంది ద్విచక్రవాహనదారులు, 20 మంది కారు డ్రైవర్లు, ఏడుగురు ఆటోవాలాలు, ఒకరు భారీ వాహన డ్రైవరు ఉన్నారు. గతవారం న్యాయస్థానాలు 308 కేసులను పరిష్కరించాయి. ఏడుగురికి జరిమానా- సామాజిక సేవ, మిగతా వారికి జరిమానా విధించినట్లు ఏడీసీపీ నరేందర్ తెలిపారు.

నయనానందకరం.. నృత్యాభినయం



మాదాపూర్, న్యూస్‌టుడే: శిల్పారామంలో ఆదివారం కళాకారులు చూడముచ్చటైన భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. శ్రుతి, వేదప్రియలు చక్కటి అభినయంతో ప్రదర్శించిన భరతనాట్యం అలరించింది. పంచమవేద నాట్యనిలయం విద్యార్థులు వినసొంపైన కీర్తనలకు అనుగుణంగా కూచిపూడిని ప్రదర్శించి కనువిందు చేశారు.

ఎన్నికల్లో భారాస గెలుపు తథ్యం: మాధవరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

భాగ్యనగర్ కాలనీ, న్యూస్‌టుడే: రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో భారాస గెలుపు తథ్యమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధి అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే.. ఏ పార్టీలో ఉన్నారో తెలియని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. ఆయన కౌన్సిలర్‌గా ఉన్న సమయంలో నిజాంపేట రోడ్డు, ఆల్విన్ కాలనీ, అడ్డగుట్ట ప్రాంతాల్లో చేసిన అభివృద్ధి పనులను ప్రస్తావించారు. సుబ్బరాజు, రంగారావు, శ్యామల రాజు, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ◆ **భారాసలో చేరికలు..:** భారాస నేత సంతోశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాలకు చెందినవారు ఆదివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో శేషాద్రి నగర్‌లో భారాసలో చేరారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విశ్వశాంతి కోసం వీరశైవుల పాదయాత్ర



పాదయాత్రలో ఎంపీ సురేశ్ తదితరులు

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: విశ్వశాంతి కోసం వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో పటాన్‌చెరు నుంచి బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయం వరకు ఏటా పాదయాత్ర చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం ఉమామహేశ్వరఆలయం నుంచి చేపట్టిన పాదయాత్రకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వీరశైవ లింగాయత్ సమాజ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందజేస్తామని తెలిపారు. జహీరాబాద్ ఎంపీ సురేశ్ సైతం పాదయాత్రకు హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సపాన్ దేవ్, మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేశ్, పలు పార్టీల నాయకులు విజయ్ కుమార్, నరసింహారెడ్డి, ఉపేందర్, నర్రా భిక్షపతి, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న సంస్కృతుల నిలయం.. పటాన్‌చెరు



వేడుకల్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తదితరులు

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: విభిన్న సంస్కృతుల నిలయం పటాన్‌చెరు నియోజకవర్గమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. నాయర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రామచంద్రాపురంలో ఓనం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఒక్కరిని గౌరవించాలన్నారు. భారాస నియోజకవర్గ సమన్వయకర్త ఆదర్శ్ రెడ్డి, పరమేశ్ యాదవ్, ప్రమోద్‌గౌడ్, ఐలేశ్ పాల్గొన్నారు.

పనులు చేసి.. మరమ్మతులు మరచి



మాదాపూర్ 100 అడుగుల రోడ్డు ఇది. పైపులైన్ పనుల కోసం తవ్వకాలు చేపట్టి, గుంతలు సరిగా పూడ్చకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.
–ఈనాడు, హైదరాబాద్

విజేతలకు బహుమతుల అందజేత



ట్రోఫీ అందిస్తున్న ఆదర్శ్‌రెడ్డి, సుధారాణి తదితరులు

రామచంద్రాపురం: భారతి నగర్ డివిజన్ ఓల్డ్ ఎంఐజీలో రెండు రోజులుగా నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. విజేతలకు పటాన్‌చెరు నియోజకవర్గ భారాస సమన్వయకర్త ఆదర్శ్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు సుధారాణి తదితరులు బహుమతులు అందించి అభినందించారు. క్రీడల్లో రాణించి దేశానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, కార్యదర్శి రామారావు, రామకృష్ణ, జగన్నాథరెడ్డి, భాస్కర్ ముదిరాజ్, బాలయ్య, భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

చందానగర్, న్యూస్‌టుడే: వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు- శ్రీరాం నగర్, గంగారం ఏరియా, కినరాహోటల్, అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లో విద్యుత్తు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సీఐటీయూతోనే సమస్యల పరిష్కారం

పటాన్‌చెరు అర్బన్: కార్మికుల సమస్యలు సీఐటీయూతోనే పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.రాజయ్య అన్నారు. పటాన్‌చెరు శ్రామిక్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన పెన్నార్ కార్మికుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాడి హక్కులు సాధించుకోవాలని సూచించారు. శేషగిరిరావు, త్రిమూర్తులు, రాజు, దాసు, అర్జున్, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రశాంతం



లక్కీడ్రా తీస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: శేరిలింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ఆదివారం లక్కీ డ్రా నిర్వహించారు. గచ్చిబౌలి హౌజింగ్ బోర్డు పరిధిలో ఉదయం 11.30కి ప్రారంభమైన లక్కీడ్రా, సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. ఎమ్మెల్యే గాంధీ, హౌజింగ్ బోర్డు ఈఈ వాణి తదితరులు డ్రా తీసి, లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించారు. రాయదుర్గం సర్వే నంబర్ 66బై1లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి స్థలం కేటాయించారు. మొదట విడతలో 480 ఇళ్లను నిర్మించనున్నారు. మొత్తం 2,722 మంది దరఖాస్తుదారులను అర్హులుగా నిర్ధారించారు. డ్రా ద్వారా 480 మందిని ఎంపిక చేశారు. నిరీక్షణ జాబితాలో అదనంగా మరో 120 మందిని ఎంపిక చేశారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. అత్యంత పారదర్శకంగా అందరి సమక్షంలో లక్కీడ్రా నిర్వహిస్తున్నామన్నారు. వారం, పది రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఏడాదిలోపు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. లక్కీ డ్రాలో పేర్లు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇళ్ల కేటాయింపు నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని తెలిపారు. మియాపూర్ స్టాలిన్ నగర్‌కు చెందిన అంజయ్య అర్హుల జాబితాలో తన పేరు తొలగించారంటూ వేదిక వద్ద బైఠాయించగా, పోలీసులు అతడిని అక్కడి నుంచి బయటకు తరలించారు.



18 ఏళ్ల నిరీక్షణ.. మేము 18 ఏళ్లుగా పాపిరెడ్డి కాలనీలో అద్దెకు ఉంటున్నాం. మా ఆయన కరెంటు పని చేస్తారు. నెల నెలా ఇంటి అద్దె, పిల్లల పోషణ ఎంతో భారంగా మారింది. ఎంతో కాలంగా సొంతింటి కోసం కలలు కంటున్నాం. లక్కీ డ్రాలో ఇల్లు దక్కడం సంతోషంగా ఉంది. –భారతి, పాపిరెడ్డి కాలనీ



సంతోషంలో మాటలు రావడం లేదు.. నేను డ్రైవర్‌గా పని చేస్తున్నా. భార్య, ఇద్దరు పిల్లలతో రాయదుర్గం మధురా నగర్‌లో అద్దెకు ఉంటున్నాం. ఇంటి కోసం గతంలోనూ దరఖాస్తు చేసుకున్నా, రాలేదు. ప్రస్తుతం రాయదుర్గం పరిధిలోనే ఇందిరమ్మ ఇల్లు రావడంతో సంతోషంలో మాటలు రావడం లేదు. –చంద్రప్ప

కూరగాయల ధరలు

పటాన్‌చెరు మార్కెట్ యార్డులో..
కేజీకి (రూ.ల్లో): ఆదివారం

టమాట-25, బీర-25, బెండ-25, వంకాయ-20, చిక్కుడు-30, గోరుచిక్కుడు-25, క్యాబేజీ-20, కాలీ ఫ్లవర్-20, క్యారెట్-50, దొండ-30, బీన్స్-70, మిర్చి-30. –న్యూస్‌టుడే, పటాన్‌చెరు అర్బన్

నల్లగండ్ల మార్కెట్‌లో..

టమాట-20, బీర-50, బెండ-40, వంకాయ-40, బంగాళాదుంప-20, చిక్కుడు-60, గోరు చిక్కుడు-50, క్యాబేజీ-30, కాలీఫ్లవర్-30, క్యారెట్-40, కీర-40. –న్యూస్‌టుడే, శేరిలింగంపల్లి

పార్కింగ్ ఇలా.. ప్రయాణం ఎలా?



జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రామచంద్రాపురంలో సర్వీసు రోడ్డు నిర్మాణం జరుగుతోంది. పనులు పూర్తి కాక ముందే.. సర్వీసు రోడ్డులో ఇష్టారాజ్యంగా వాహనాలు నిలుపుతున్నారు. తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. –న్యూస్‌టుడే, రామచంద్రాపురం

తాగునీటి వృథా.. తీరేదెలా వ్యథ?



ఆదిత్యానగర్ జంక్షన్‌లో పైపులైన్ లీకేజీ కారణంగా తాగు నీరు వృథాగా పోతోంది. లీకేజీ నీరు ప్రగతి నగర్ రోడ్డు నుంచి హెచ్ఎంటీ హిల్స్ జంక్షన్ వరకు పారుతోంది. అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలి. –న్యూస్‌టుడే, భాగ్యనగర్ కాలనీ

కుత్బుల్లాపూర్

ఘనంగా బోనాల వేడుకలు



దుండిగల్, న్యూస్‌టుడే: దుండిగల్‌లోని రాజరాజేశ్వరి పోచమ్మ అమ్మవారి బోనాల వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలయంలో వేకువజాము నుంచి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్య మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, దుండిగల్ పురపాలిక మాజీ ఛైర్‌పర్సన్ శంభీపూర్ కృష్ణవేణి వేర్వేరుగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

నీట్ పీజీకి 197 మంది గైర్హాజరు



పరీక్ష కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 19 కేంద్రాల్లో ఆదివారం కంప్యూటర్ బేస్ట్ టెస్ట్-(సీబీటీ) విధానంలో జరిగిన పీజీ నీట్-2026కు 197 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. 6,368 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 6,171 మంది పరీక్షలు రాశారు. నాగోల్ సీఐఎస్ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్, పీర్జాదిగూడలోని సూర్య టెక్నాలజీ పరీక్ష కేంద్రాలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి.విజయేందర్‌రెడ్డి సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కీసర పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన ఓ విద్యార్థిని అనుమతించలేదు. మేడిపల్లి తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

కుత్బుల్లాపూర్: 8008573403, దుండిగల్: 8008573410, షాపూర్‌నగర్: 8008573404, పేట్‌బషీరాబాద్: 8008573405, నిజాంపేట: 8008573423, జీడిమెట్ల: 8008574405

షాపూర్‌నగర్, దుండిగల్, నిజాంపేట, న్యూస్‌టుడే:

? గాజులరామారం చిత్తారమ్మ దేవాలయం వద్ద విద్యుత్తు దీపాలు పగలు వెలుగుతున్నాయి. – ఇంద్రసేనగుప్తా, గాజులరామారం

✓ లైట్లకు మరమ్మతులు చేయించి రాత్రి మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకుంటాం. –వెంకటరాములు, ఉపకమిషనర్ గాజులరామారం సర్కిల్

? గాజులరామారం ప్రధాన రహదారి బసవతారకనగర్ కూడలిలో పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు రోడ్డుపై పారుతోంది. –వెంకటేశ్, నెహ్రూనగర్

✓ సిబ్బందిని పంపించి పైపులైన్‌కు మరమ్మతులు చేయించి లీకేజీని అరికడతాం. – రవి, జలమండలి డీజీఎం

? బౌరంపేట అవుటర్ అండర్‌పాస్ వద్ద సర్వీసు రోడ్డుపై రెండు భారీ గుంతలు పడటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. –వేణు, స్థానికుడు

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారికి మరమ్మతులు చేయిస్తాం. – సురేందర్‌నాయక్, ఏఈ, దుండిగల్ సర్కిల్

? ప్రగతినగర్ ఎలీప్ చౌరస్తా నుంచి జగన్‌స్టూడియో వైపు ఉన్న మార్గం గుంతలమయంగా మారింది. –సంతోష్‌కుమార్, ప్రగతినగర్

✓ పరిశీలించి రహదారికి మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. –సాబేర్ అలీ, నిజాంపేట సర్కిల్ ఉప కమిషనర్

? బాచుపల్లి ప్రధాన రహదారిలోని రేణుకా ఎల్లమ్మకాలనీ మలుపు వద్ద గోతులు ఏర్పడాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. –రంగారావు, బాచుపల్లి

✓ రహదారి నిర్మాణానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే రహదారి నిర్మిస్తాం. –వసంత, డీఈఈ, నిజాంపేట

? బాచుపల్లి క్రాంతినగర్‌కాలనీలో పలు చోట్ల మ్యాన్‌హోళ్లు ధ్వంసమయ్యాయి. –యశస్విని, బాచుపల్లి

✓ మ్యాన్‌హోళ్లకుమరమ్మతులు చేయిస్తాం. –ప్రవీణ్‌కుమార్, నిజాంపేట సర్కిల్ ఏఈ

సిగ్నల్ ఏర్పాటులో జాప్యం.. నిత్యం ట్రాఫిక్ జాం



నిలిచిన వాహనాలు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం కూడలిలో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. స్థానికంగా ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ముందుకు సాగకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. గాజులరామారం నుంచి కూకట్‌పల్లి, మరోవైపు బాచుపల్లి, నర్సాపూర్ రోడ్లకు అనుసంధానంగా మారడంతో రెండేళ్లుగా ట్రాఫిక్ పదిరెట్లకు పైగా పెరిగింది. నర్సాపూర్ ప్రధాన రహదారి నుంచి గాజులరామారం మీదుగా కూకట్‌పల్లి వరకు 100 ఫీట్ల వెడల్పు రోడ్డు విస్తరణ ప్రతిపాదన కొన్ని సంవత్సరాలుగా కార్యరూపం దాల్చకపోవడంతో ఇరుకైన రోడ్లలో ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఈ సమస్యపై పలుమార్లు 'ఈనాడు'లో వచ్చిన కథనాలకు తోడు స్థానికుల ఫిర్యాదు మేరకు రెండేళ్ల క్రితం ట్రాఫిక్ పోలీసులు జీహెచ్ఎంసీ, టీజీఎస్‌పీడీసీఎల్, బీఎస్ఎన్ఎల్, ఆర్అండ్‌బీ తదితర విభాగాల అధికారుల సమన్వయంతో సిగ్నల్ ఏర్పాటుపై సమీక్షించారు. అందుకోసం కూడలికి నాలుగు వైపులా ఉన్న విద్యుత్తు స్తంభాలకు దూరంగా మార్చి ఏడాది క్రితం రూ.కోటి నిధులతో రోడ్డు విస్తరణ పనులకు పూర్తి చేశారు. అయినా ఇంతవరకు సిగ్నల్ ఏర్పాటు ప్రక్రియ మాత్రం ముందుకు పోవడం లేదు.



దుకాణాల ముందు రోడ్డుపై ఏర్పాటు చేసిన తోపుడుబండ్లు

సీఎస్ఆర్ నిధులతో..

జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని పరిశ్రమల నిర్వాహకులు సీఎస్ఆర్ నిధులతో 5 చోట్ల ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా గాజులరామారం కూడలిలోనూ సిగ్నల్ ఏర్పాటు పనులను మొదలు పెట్టారు. నాలుగువైపులా అందుకు అవసరమైన దిమ్మెలను కూడా ఏర్పాటు చేశారు. అనంతరం టెక్నికల్ విభాగం సిబ్బంది పర్యవేక్షించి నాలుగువైపులా రోడ్డును విస్తరించని పక్షంలో సిగ్నల్ ఏర్పాటు సాధ్యం కాదని చెప్పడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

అద్దె వసూలు చేస్తూ..

గాజులరామారం కూడలిలోని బాలాజీలేఅవుట్, గాజులరామారం గ్రామానికి వెళ్లే దారిలో తోపుడు బండ్లు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. దుకాణ సముదాయాల నిర్వాహకులు వారి షాపుల ముందు తోపుడుబండ్లు ఏర్పాటు చేసుకునేందుకు వారి వద్ద రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు. బాలాజీలేఅవుట్ కూడలిలోని యూనియన్ బ్యాంకు ఉండే ఇంటి యజమాని తన భవనం ముందు పదికిపైగా దుకాణాలను ఏర్పాటు చేయించి అద్దెలు వసూలు చేస్తున్నాడు. రోడ్లకు ఇరువైపులా కూరగాయల వ్యాపారులు షాపులు ఏర్పాటు చేయడంతో వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. వెంటనే సిగ్నల్ ఏర్పాటుచేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సిబ్బందిని ఏర్పాటు చేస్తాం

గాజులరామారం కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని అన్ని విభాగాల అధికారులను సమన్వయపరిచి రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయించాం. నిధులు మంజూరు అవ్వగానే సిగ్నల్ ఏర్పాటు చేస్తాం. అప్పటివరకు ఇక్కడ ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేస్తాం.
– నర్సింహారావు, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ

పార్కు స్థలంలో అక్రమ నిర్మాణాలు



షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం డివిజన్ పరిధి మహదేవపురం కాలనీలోని పార్కు స్థలాలకు రక్షణ లేకుండాపోయింది. కాలనీ ఏర్పాటు చేసిన సమయంలో మొత్తం 14 పార్కు స్థలాలు ఉండగా వీటిలో కొన్ని ఇప్పటికే కబ్జాకు గురయ్యాయి. మరికొన్ని కోర్టు వివాదంలో ఉన్నాయి. ఏడాది క్రితం హైడ్రా సిబ్బంది పరిశీలించి మహదేవపురంలోని రెండు పార్కు స్థలాలకు ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. అయితే వీటిలో కొందరు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి తరచూ నిర్మాణాలకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలోని ఆదివారం ఉదయం నుంచి పార్కు స్థలంలో పనులు చేస్తున్నారు. కాలనీవాసులు అడ్డుకున్నా వారు నిర్మాణం కొనసాగిస్తున్నారు. రెండు నెలలక్రితం ఇక్కడ జరిగిన 'వన్‌డే వన్ వార్డు' కార్యక్రమం సందర్భంగా కాలనీలోని పార్కులను అభివృద్ధి చేయాలని సీఎంసీ కమిషనర్‌ను కోరగా ఆమె సానుకూలంగా స్పందించి అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్ సైతం ఇదే పార్కు స్థలాల్లో ఎల్ఆర్ఎస్, నిర్మాణ అనుమతులకు నోటీసులు కూడా అందజేసి వాటిని రద్దు చేశారు. సెలవు దినాలు వస్తేచాలు కొందరు నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉద్యాన స్థలాలను రక్షించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

యువత ప్రజాప్రతినిధులుగా ఎదగాలి



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: యువత రాజకీయాల్లో చేరి అవినీతిని నిర్మూలించేందుకు ప్రజాప్రతినిధులుగా ఎదగాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సల్మాన్, సత్యప్రకాష్ పిలుపునిచ్చారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మఖ్దూంనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం అఖిలభారత యువజన సమాఖ్య 4వ మహాసభలు నిర్వహించారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న కేంద్రప్రభుత్వం హామీలను పట్టించుకోకపోగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం ఏంటని విమర్శించారు. నీట్ ఉద్యమం ఒక గుణపాఠమని, యువత నిర్వహించే అన్ని ఉద్యమాలకు పార్టీ మద్దతు ఉంటుందని చెప్పారు. అనంతరం అఖిల భారత యువజన సమాఖ్య నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐవైఎఫ్ కార్యదర్శి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాలకు వేదికలు కమ్యూనిటీహాళ్లు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: ఐక్యతకు, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు చక్కటి వేదికలుగా కమ్యూనిటీ హాళ్లు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సూరారం డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో సంక్షేమసంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న సామాజిక భవనం పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భవనం నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని, తనవంతు సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, సురేష్‌రెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షురాలు అమృతరెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు, ఇంద్రసేనగుప్తా, భాస్కర్, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ఐడీపీఎల్ కూడలిలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆవిష్కరించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ కేవలం గౌడ కులస్థులకు పరిమితమైన నాయకుడు కాదని, అన్ని వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహాయోధుడని కొనియాడారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. పాపన్నగౌడ్ కమిటీ ఛైర్మన్ దివాకర్, అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ సగర సంఘం అధ్యక్షుడిగా రవి

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం అధ్యక్షుడిగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి అంజయ్యనగర్‌కు చెందిన రవి ఎన్నికయ్యారు. ఆదివారం సూరారంలోని వీవీపీ ఫంక్షన్‌హాల్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మారుతీసాగర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎ.రామ్మోహన్ సాగర్ ఆధ్వర్యంలో సంఘం ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా వెంకట్రాములు, కోశాధికారిగా సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మారుతీసాగర్ మాట్లాడుతూ.. కుల చైతన్యాన్ని ప్రదర్శిస్తూ ఓటర్లు ఉత్సాహంగా ఎన్నికలలో భాగస్వాములు కావడం శుభపరిణామం అన్నారు. ఎన్నికలు సజావుగా పూర్తి చేసేందుకు సహకరించిన ప్రాంతీయ సంఘాల నాయకులకు, ఓటర్లకు ధన్యవాదాలు తెలియజేశారు.

అమ్మవారి ఒడిబియ్యంతో అన్నదానం

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి జగద్గిరినగర్‌లోని అమ్మవారి ఆలయంలో బోనాల సందర్భంగా భక్తులు సమర్పించిన ఒడిబియ్యంతో ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నసంతర్పణ చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. నేతలు జైహింద్, హనుమాన్‌చారి, కనకయ్య, శంకర్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

దుండిగల్, న్యూస్‌టుడే: **సమయం:** ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, **ప్రాంతాలు:** కేవీఆర్ కాలనీ రోడ్డు నం.1 నుంచి 5, ప్రణీత్‌హోమ్స్, లేక్రిడ్జ్‌హోమ్స్, స్ప్రింగ్‌వుడ్‌విల్లాస్, డఫోడిల్స్ అపార్ట్‌మెంట్స్, రాయల్‌హోమ్స్, శంభీపూర్, మహేశ్వరం తదితర ప్రాంతాల్లో సోమవారం విద్యుత్తు సరఫరా ఉండదని అధికారులు వెల్లడించారు.

విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలి: సీపీఎం



సదస్సులో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

నిజాంపేట, న్యూస్‌టుడే: విద్యావ్యవస్థలో సమగ్రమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రగతినగర్‌లోని లీలా సుందరయ్య భవనంలో ఆదివారం జిల్లాస్థాయి విద్యాసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలను కేంద్రీకృతం చేయడం ద్వారా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. పాఠశాల స్థాయిలో ప్రభుత్వ స్కూళ్లలో 15, ప్రైవేటు సంస్థల్లో 85 శాతం మేర నిష్పత్తిలో విద్యార్థులు ఉంటున్నట్లు తమ సర్వేలో తేలిందన్నారు. ఇటీవల జరిగిన నీట్ పేపరు లీకేజీతో వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడ్డారన్నారు. అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నిబంధనలను కఠినతరం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సత్యం, ప్రొఫెసర్ నాగేశ్వర్, నేతలు రవి, రాజశేఖర్, అశోక్, శ్రీనివాసులు, సంతోష్, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కుంగి.. ప్రమాదకరంగా మారి



బాచుపల్లి పరిధి క్రాంతినగర్ కాలనీ రోడ్డు నంబరు-4లో భూగర్భ మ్యాన్‌హోల్ పక్కన రోడ్డు కుంగి ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. రాత్రి సమయంలో గుంత కనిపించక ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయపడుతున్నారు. వారం రోజులుగా ఈ సమస్య కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. – న్యూస్‌టుడే, నిజాంపేట

స్వచ్ఛస్ఫూర్తి విస్మరించి.. చెత్త వేసి



బహదూర్‌పల్లి పరిధి సాయినాథ్ సొసైటీ ప్రధాన రహదారి పక్కన భారీగా చెత్త పేరుకుపోయింది. ఈ మార్గంలోని కిలో మీటరు దూరంలో సుమారు 5 చోట్ల వ్యర్థాలను పారబోస్తున్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులు తరలిస్తున్నప్పటికీ కొంత మంది స్వచ్ఛస్ఫూర్తిని విస్మరించడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు చెత్తను తొలగింపజేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దుండిగల్

పగలు.. విద్యుత్తు వెలుగులు



బహదూర్‌పల్లి పరిధి సాయినాథ్‌సొసైటీ ప్రధాన రహదారిలో వీధిదీపాలు పగలు సైతం వెలుగుతున్నాయి. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో రాత్రివేళల్లో లైట్లు పనిచేయకపోవడంతో అంధకారం నెలకొంటుంది. ఇప్పటికైనా దుండిగల్ సర్కిల్ అధికారులు స్పందించి విద్యుత్తు వృథాను అరికట్టి వీధిదీపాలు రాత్రి సమయంలో వెలిగేలా చర్యలు తీసుకోవాలని నివాసితులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దుండిగల్

గణేశ్ నిమజ్జనం సమన్వయ సమావేశం నేడు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గణేశ్ పండగ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులకు కుత్బుల్లాపూర్ జోన్, సీఎంసీ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సుచిత్ర అకాడమీ ఇంటర్నేషనల్ పాఠశాలలో గణేశ్ నిమజ్జనం సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్లు జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ తెలిపారు. సమావేశానికి కుత్బుల్లాపూర్ పోలీస్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ, టీజీఎస్‌పీడీసీఎల్, హైడ్రా అధికారులు పాల్గొంటారని తెలిపారు. కుత్బుల్లాపూర్ జోన్ గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులందరూ హాజరై ఏర్పాట్లకు సంబంధించిన సూచనలను, అవసరమైన చర్యల కోసం సంబంధిత అధికారుల దృష్టికి తేవాలన్నారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో కమిటీల సభ్యులు హాజరుకావాలని కోరారు.

గంజాయి సరఫరా.. ఇద్దరి అరెస్టు

జీడిమెట్ల, న్యూస్‌టుడే: సులువుగా డబ్బు సంపాదించాలనే అత్యాశ, ఆర్థిక ఇబ్బందులు ఆ ఇద్దరిని అడ్డదారి తొక్కించాయి. సరిహద్దు దాటి గంజాయి తీసుకొచ్చి, గుట్టుచప్పుడు కాకుండా తరలించేందుకు యత్నించినా.. జీడిమెట్ల పోలీసులు వారిని కటకటాల్లోకి పంపించారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. ఏపీలోని అనకాపల్లికి చెందిన రాజు కొంత కాలంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. నగరంలోని సనత్‌నగర్‌లో నివాసం ఉంటున్న జూనియర్ ఆర్టిస్ట్‌తో అతనికి ఏడాది క్రితం పరిచయం ఏర్పడింది. కొన్ని రోజుల క్రితం రాజు తాను గంజాయి తీసుకొస్తానని, విక్రయించాలని ఆమెను అడగడంతో వెంటనే అంగీకరించింది. పథకం ప్రకారం రాజు.. విశాఖపట్నం జిల్లాకు చెందిన రమణ అనే వ్యక్తి నుంచి 10 కిలోల గంజాయిని రూ.25 వేలకు కొనుగోలు చేసి నగరానికి తీసుకొచ్చాడు. ఆమె సూచనలతో చింతల్ హెచ్ఎంటీ అటవీ ప్రాంతానికి వచ్చాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 11 కిలోల గంజాయి, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. గంజాయి విక్రయించిన ప్రధాన నిందితుడు రమణ కోసం గాలిస్తున్నారు.

ముగిసిన జాతీయ క్రీడా దినోత్సవాలు



పతకాలతో విజేతలు

మేడ్చల్ కలెక్టరేట్, కీసర, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో మూడు రోజులపాటు నిర్వహించిన వేడుకలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. రాష్ట్ర ప్రభుత్వం-స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాలతో జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ క్రీడా పోటీలు నిర్వహించడంతోపాటు, క్రీడల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. చివరి రోజున ఔటర్ రింగ్ సర్వీస్ రోడ్డులో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. జిల్లా క్రీడల అధికారి వై.దామోదర్‌రెడ్డి, ఖేలో ఇండియా సైక్లింగ్ కోచ్ కృష్ణ, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పాల్‌రాస్, ఉపాధ్యక్షుడు సాయికృష్ణ, కోశాధికారి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తులో నడిపి.. పోలీసులకు చిక్కి

రాయదుర్గం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన 182 మంది మందుబాబులపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వారాంతంలో రెండు రోజుల పాటు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. పట్టుబడిన వారిలో 154 మంది ద్విచక్ర వాహనదారులు, 20 మంది కారు డ్రైవర్లు, ఏడుగురు ఆటోవాలాలు, ఒకరు భారీ వాహన డ్రైవరు ఉన్నారు. గత వారం న్యాయస్థానాలు 308 కేసులను పరిష్కరించాయి. ఏడుగురికి జరిమానా- సామాజిక సేవ, మిగతా వారికి జరిమానా విధించినట్లు ఏడీసీపీ నరేందర్ తెలిపారు.

మురుగు పరుగు.. జనం బేజారు



కుత్బుల్లాపూర్ గ్రామంలోని ఆటో స్టాండ్‌కు ఎదురుగా ఉన్న గల్లీలో వారం రోజులుగా మ్యాన్‌హోల్ నుంచి మురుగు పొంగి రోడ్డుపై పారుతోంది. దీంతో రాకపోకలు సాగించడానికి ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందిపడుతున్నారు. దుర్గంధం వస్తోందని నివాసితులు వాపోతున్నారు. దోమలు వ్యాప్తిచెంది రోగాలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మ్యాన్‌హోల్ నుంచి పూడిక తొలగించి మురుగు పారకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కుత్బుల్లాపూర్

నిబంధనలు బేఖాతర్

☛ వర్షాకాలంలో కొనసాగుతున్న సెల్లార్ల తవ్వకాలు ☛ గాలిలో కలుస్తున్న ప్రాణాలు

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: జూన్ మొదటి వారం నుంచి వర్షాకాలం పూర్తయ్యే వరకు జీహెచ్ఎంసీ పరిధిలో సెల్లార్ల తవ్వకాలు, నిర్మాణాలు చేపట్టకూడదనేది నిబంధన. ఈ మేరకు సీఎంసీ కమిషనర్ సృజన ఉప కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా సెల్లార్ల తవ్వకాలకు అనుమతులివ్వొద్దని ఆదేశించారు. ఇప్పటికే మొదలై ఉంటే వాటి చూట్టూ రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కానీ కొందరు పట్టణ ప్రణాళిక సిబ్బంది కళ్లకు నోట్లకట్టలతో గంతలు కట్టి కనీస జాగ్రత్తలు తీసుకోకుండానే వర్షాకాలంలో సెల్లార్ల నిర్మాణాలు చేపడుతుండటం విమర్శలకు తావిస్తోంది.

జడ్సీ ఫిర్యాదు చేసినా...

చింతల్, జీడిమెట్ల, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో అక్రమ సెల్లార్లు, నిర్మాణాలకు అడ్డులేకుండా పోతోంది. వాటి నిర్మాణాలు, తవ్వకాల సందర్భంగా భవనాలు కూలిపోవడం, మట్టి పెల్లలు మీదపడి కూలీలు దుర్మరణం చెందటం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. నాలుగు నెలల క్రితం ఓ వ్యక్తి గాజులరామారంలో కనీస జాగ్రత్తలు తీసుకోకుండా నిర్మిస్తున్న సెల్లార్ కుప్పకూలింది. దీంతో పక్కింటి వారి స్నానాల గదితోపాటు ప్రహరీ కూలిపోవడంతో ఆ ఇంట్లోని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో జోనల్ కమిషనర్ పింకేష్‌కుమార్ నిర్వాహకులపై జగద్గిరిగుట్ట ఠాణాలో ఫిర్యాదు చేసినా భవన నిర్మాణ దారుల్లో మార్పు రావడం లేదనడానికి ఆయా సర్కిళ్లలో తాజాగా కొనసాగుతున్న సెల్లార్ల నిర్మాణాలే ఇందుకు నిదర్శనం.

మచ్చుకు కొన్ని..

✦ పేట్‌బషీరాబాద్‌లో సెల్లార్ నిర్మాణం కోసం తీసిన తవ్వకాలతో మట్టి పెల్లలు కూలి ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు. ✦ జీడిమెట్ల సుచిత్ర రోడ్డు పక్కన ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలో సెల్లార్ నిర్మాణం చేస్తున్నారు. రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతో.. కారు అదుపుతప్పి సెల్లార్ గుంతలోకి దూసుకుపోయింది. ✦ పట్వారీ ఎన్‌క్లేవ్స్‌లో ఓ సంస్థవారు సుమారు 10 అడుగుల లోతుతో సెల్లార్ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా బండరాళ్లను తొలగించేందుకు బ్లాస్టింగ్ చేయడంతో పేలుళ్ల ధాటికి ఓ ఇంటి రేకులు, కారు అద్దాలు పగిలిపోయాయి. అప్పట్లో నిర్వాహకులపై జీడిమెట్ల ఠాణాలో కేసు కూడా నమోదు చేశారు. అయినా పలుచోట్ల ఇప్పటికీ పేలుళ్లు నిర్వహిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.



ఏపీహెచ్‌బీ కాలనీలో సెల్లార్ తవ్వకాలు

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

చింతల్ సర్కిల్‌లో వర్షాకాలం వెళ్లేంతవరకు సెల్లార్ల నిర్మాణాలపై నిషేధం విధించాం. అయినా క్షేత్రస్థాయి పరిశీలన చేసి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న సెల్లార్ల తవ్వకాలను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. – మధు, సెక్షన్ అధికారి పట్టణ ప్రణాళిక చింతల్ సర్కిల్